
ఏప్రిల్ ఆంధ్రభూమి
1935


1. దుర్గాదేవి — నారుమామిళ్ళ శివరామకృష్ణప్రసాదు — 775-778
2. ముందు [illegible] కన్న తప్పు — [illegible] శాస్త్రి — 779-784
3. పిశాచం — రాబర్ట్ — లూయీ స్టీవెన్సన్ — తల్లాప్రగడ ప్రకాశరాయుడు — 785-788
4. ప్రత్యక్ష [illegible] — [illegible] రామమూర్తి — 788
5. [illegible] — [illegible] — [illegible] — 789-791
6. శబరి — కనుపర్తి వరలక్ష్మమ్మ — 791-793
7. భారతీయ గ్రంథాలయములు — [illegible] — 794-797
8. [illegible] — [illegible] — 797-798
9. [illegible] — [illegible] — [illegible] — 799-801
10. [illegible] — [illegible] లక్ష్మీనరసింహారావు — 801
11. [illegible] — 802-804
12. [illegible]? — [illegible] శాస్త్రి — 804
13. [illegible] — [illegible] — 805-811
14. [illegible] — [illegible] — 811
15. [illegible] — [illegible] — గుమ్మలూరి సత్యనారాయణ. 812-813
16. [illegible] — [illegible] — 814-815
17. ముసలి వాళ్ళ [illegible] — పి. [illegible] — 816-818
18. [illegible] — [illegible] — 818-822
19. [illegible] — [illegible] — 823-825
20. [illegible] — 826-830
21. జాగ్రత్త స్మృతి — [illegible] — 830-831
22. [illegible] — 832-833
— 834-836
23. బాలబాంధవి — 837-839
24. [illegible] —
25. ఆంధ్రమహిళా సంఘం — లక్ష్మీనారాయణ [illegible] — 840

ఏప్రిల్ 1935
ఆంధ్రభూమి




# రుచీదేవి

(వచనరూపకము.)

* అంకము. ౪ : రంగము. ౧.

స్థలము : ఒక యరణ్యము.
సమయము : ప్రొద్దుక్రుంకు వేళ.

[పలయు పరివారముతో రుచీదేవి పుట్టి నింటికి పంపబడుచున్నది. మేనా కిరుప్రక్కల యందు దాసదాసీజనము పరుగెత్తుచున్నారు. ముందుభాగమునందు, అశ్వారూఢులై విచ్చుకత్తులతో భటులు పోవుచున్నారు. వెనుకభాగమునందు కొందరు ఆయుధములతో నడుచుచున్నారు. దట్టముగ నల్లుకొని యున్న పొదలను తప్పుకొనుచు, దారి కడ్డముగానున్న కొమ్మలను ఛేదించివైచుచు, వడివడిగా పోవుచు, అరణ్య మధ్యభాగము చేరునప్పటికి ప్రొద్దుక్రుంకెను. సమీపమునందాక చిన్నపల్లెమాత్రము కానవచ్చుచుండెను. సేనాపతియగు చెంగల్వరాయడు దిశలు పరికించి, కొంచెము వెనకడుగు వయిచి పెద్దదాసియగు పద్మను చేర బిలచి]

చెంగల్వరాయడు:—(మెల్లగా) ప్రొద్దుక్రుంకినది; సమీపమునందాకపల్లె కానవచ్చుచున్నది; ఈరేయి ఇచటనే గడపి, ఉదయముననే ప్రయాణము సాగించుట మంచిది. ఈయడవి పోయినకొలది దట్టముగా నుండును. శ్రీదేవిగారికీ విషయము మనవిచేయుము.

పద్మ:—(మొగము చిట్లించి, తల వంకరగ త్రిప్పి) ఏమి మనవి చేయుమని యెదరు? దేవి స్మృతి విహీనయై పడియున్నది. ఆమె కడకేగి పలుకరించుటకే నాకు గుండె నిలచుట లేదు.

చెం:—(ఆలోచనతో, మెల్లగా) ఇదియేమి యన్యాయము! మనవిచేసినంతమాత్రమున తప్పేమి? ఈచీకటిలో, ఈ యరణ్యమున మన మీపల్లె దాటిపోయినచో పెక్కు చిక్కులు రాగలవు ఆ కనుపించు కొండప్రక్కనున్న గుహాలలో పెద్ద పులులుండునని వినియున్నాము అచ్చటనే దొంగలభయమును గలదు. మనకెంత పరివారమున్నను, ఆభరణములతో నిండియున్న పెట్టెలతోడను. సుకుమారులగు సంతఃపుర స్త్రీలతోడను, ఈసమయమున, ఈ నట్టడవిలో పయనమొనరించుట పాడికాదు నా

---

* ఈ యంకమునుండి, కొంత కథ కాధారము : శ్రీ కనలక్ష్మమ్మగారి 'వరదరాకేశ్వరి.'

పలుకు లాలకించి దేవిగారితో మనవి చేయుము.

ప:—(తలయూపి) అట్లే మనవిచేయగలను... మీరు కొంచెము తొలగిపొండు. (మేనాను సమీపించి, తెరతొలగించి, భయముతో మెల్లగా) అమ్మా! అమ్మా!

దేవి:—(మేనాయందు తెలివిదప్పి పడియుండును. చెదరిన ముంగురులు, చందమామపై మూగుచు, తొలగిపోవుచున్న మేఘముల గములవలె, ఆమె ఫాలతలమున గాలికి చిందులుద్రొక్కుచుండెను. పద్మ పిలుపువిని, యులికిపాటున) ఊ! ఏమి?

పద్మ:—అమ్మా! ప్రొద్దుక్రుంకినది. ఈ యడవియందు దొంగపల్లె కానవచ్చుచున్నది; ఈ రేయి, ఇచట నిలచియుండుట మంచిదని సర్దారుని యభిప్రాయము. తమయనుజ్ఞకై వేచియున్నాము,

దే:—(కనులువిప్పి; వెఱ్ఱిదానివలె దిశలు పరికించి) ఈయడవి! సర్దారు! ఏమియడవి? ఎవరా సర్దారు?

ప:—సర్దారు చెంగల్వరాయుడు.

దే:—ఏమిపనిగోరి వచ్చియున్నాడు?

ప:—అయ్యో! ఈమె మనలోకమున లేదు వెఱ్ఱితల్లి అమాయకురాలు. (ప్రకాశముగా) అమ్మా! ప్రభువుగారి యాజ్ఞ ననుసరించి చెంగల్వరాయుడు మనవెంట వచ్చుచున్నాడు.

దే:—మనమెటకు పోవుచున్నాము?

ప:—(తొట్రుపాటున) కటకపురికి.

దే:—కటకపురికి! క...ట....క....పు...రి...కి! ఆ! అనుకొనినంత జరిగినది! ఈ బ్రతుకిక నిరర్థకము. ఇపుడు సర్వము తెలియవచ్చినది. రాణినై, రాజునే సంహరింప దలచితిని! నా శరీరమును ముక్కలు ముక్కలు గావింపక, గండశిలలతో పొడిపింపక, సలసల క్రాగు నూనెలో పడవేయింపక, ఈరీతి పుట్టినింటికి పంపుచున్నారా? ఎంత దయగలవాడా రాజచంద్రుడు! జన్మజన్మముల కైన ఈ పాపము నన్ను విడువదుగదా! భారతనారీ లోకమునం దిట్టి ఘోరకృత్యమునకు తలపడిన నావంటి రాక్షసి వేరొకతె కానరాదు! అబలనై, రాచవారింటబుట్టి, రాచవారిల్లు మెట్టి, ప్రజలకు ఆదర్శప్రాయముగ జీవితమును గడుపవలసిన దానిని కటకటా! కసాయివాని గావింప నడుముగట్టితినే! ఈ బ్రతుకు, అప్రతిష్ఠకు గురియైనది!..........

ఇంకను బ్రతికియున్నానా?........ఇంకను నా దేహమున రక్తము ప్రవహించుచున్నదా?... ....పద్మా! పద్మా! నన్ను చంపివేయుము; ఇదిగో, ఈ యుంగరము నందలి రవ్వను పొడిచేసి నూరించి తీసికొని రమ్ము - పద్మా! నేను ... .......

పద్మ:—అమ్మా! అలసటవలదు. ఇచ్చటనే ఈ రేయి గడపుదము.

దే:—(దీనముగ జూచుచు, కనుల నీరు గ్రమ్మ) పద్మా! నేను పుట్టినింటి కెట్లు పోగలను? నా తండ్రి, విజయనగరాధిపుని ప్రార్థించి, నా సంసారము నిలువబెట్టువనెడి యాశ లేదుగదా? నీకు తెలియని విషయము లేదు; చిన్ననాటనుండి మాకోటయందే కాలము గడపియుంటివిగదా? నాకిక దిక్కెవరు? భర్తను చంప ప్రోత్సహించిన జనకుని శరణు వేడెదనా? నాచే పరిభవింపబడిన భర్తదరి జేరుదునా? పద్మా! నీకును నాపై కరుణలేదా? కన్నవారిచేతను, కైకొన్నవారిచేతను, విన్నవారిచేతను, దూషింపబడి, పరిత్యజింపబడిన ఈ నిర్భాగ్యురాలింకనూ

జీవించి యుండవలయునా? పద్మా! పలుక వేమి? ... .... ...

పద్మ:—(పెద్ద పెట్టున నేడ్చి, ఎట్లో కంఠము సవరించుకొని, గడగడలాడుచు) తల్లీ! నాగుండె పగిలిపోయినది. నేనేమి మాటాడగలను? తల్లి! ఊరడిలుము. కష్టములు కలకాలము కాపురముండబోవు, పుట్టినింటికే పోయి. పరాత్పరుని నిత్యము స్మరించుచుండిన, కృష్ణరాయుని కేనాటికైన దయ గలుగకుండునా? దేవి! దుఃఖపడ నలదు. ఇప్పటికే దేహము శుష్కించి పోయినది. నాపలుకు లాలకించి, దయతో విశ్రమింపుము.

దే:—(బిగ్గరగా, ధైర్యముతో) నాపుట్టినింట, ఇకపై నేను కాలుపెట్టను.

ప:—అట్లయిన ఈ ప్రయాణ మెక్కడకు?

దే:—ఇవు డెచ్చటనున్నామో అచ్చటికే. ఈ నట్టడవియే నాకు పుట్టినిల్లు. నా పుట్టినింటి దాసదాసీజనముతో నీవు కటకపురి కేగుము. మిగిలియున్న వారిని విజయనగరమునకు వెడలి పోనిమ్ము.

ప:—(ఆశ్చర్యముతో) మీారెచట నుందురు?

దే:—ఈ ...య ...డ ...వి ...యం ... దు.

ప:—ఒంటరిగ! ... ...

దే:—ఒంటరిగి! .... ....

ప:—తల్లీ! నన్నేల పరితపింప జేసెదవు? నేను మిమ్ము వదలిపోవలయునా? ఏమని నేను కటకపురి కేగెదను? మీా తల్లిదండ్రుల కేమని, ఈవృత్తాంత మెఱుకపరుపగలను? చిన్ననాటనుండి పెంచి పెద్దజేసి తుదిని మిమ్ము కారడవిలో వదలిపోవలయునా?- నేను మిమ్ము వదలిపోజాలను; ముహూర్తమాటికి నామాట నమ్మియుండుడు.

దే:— (మెల్లగా) పద్మా! నాపలుకు లాలకించి, నాయందభిమానముంచి, నన్నీ యరణ్యమున వదలిపొమ్ము నాయందు, నీకు గల ప్రవిమలమగు ప్రేమను నేను గుర్తింపక పోలేదు. పద్మా! సౌరభమును కోలుపోయిన కుసుమము నెవరు గౌరవింతురు? భర్త విడనాడిన భార్య బ్రతుకు అడవిపాలు కావలసినదే కదా! నా భర్త............... పద్మా!........భార్య, భర్తను సంహరింప బూనునేమి?.... ...నా గుండె నిలచిపోవుచున్నది పద్మా! నన్ను విడచిపొమ్ము, సర్దారుని, విజయనగరమునకు వెడలిపొమ్మని తెల్పుము. నేను ఈరీతి........

ప:—(ఆతురతతో) తల్లీ! ఎందులకీ పలుకులు? యౌవనవతివగు నీవు, విలువగల నగలతో నొంటరిగ నీ మహారణ్యమున నుండి వచో లోకమేమనుకొనునో యోచింపుము.

దే:—(ఆతురతతో లేచి కూర్చుండి) పద్మా! ఈ యరణ్య మేరాజ్యములోనిదో సర్దారుని కనుగొనుము.

ప:—(సర్దారుని కనుగొనివచ్చి) ఇది విజయనగర సామ్రాజ్యములోనిదని సర్దారు తెల్పియున్నాడు.

దే:—(చిరునగవుతో) ఇంకను విడిపోలేదా!.... ...పద్మా! నీ ప్రయాణ మెపుడు?

ప:— నేను, ఈప్రదేశము, వదలి కదలను.

దే:—మిగిలియున్న వారినైన వెడలి పోనిమ్ము

ప:—(బిగ్గరగా) మీాపుట్టినింటి దాసదాసీజనము మిమ్మువదలి పోజాలకున్నారు. విజయనగరమువారు వెడలిపోవుచున్నారు;

వారును మీయాజ్ఞయైనచో ఇచటనే నిలచి యుండుటకు సంసిద్ధులైయున్నారు.

దే:—పద్మా! నేనేమియు మాటాడ జాలను; నాకేమియు తోచుటలేదు. (తల వాల్చి పరుండును)

[తెర.]

రంగము. ౨. స్థలము : గొల్లపల్లెయందొక చెట్టుక్రింద.

సమయము : ఉదయము.

[చెట్టునీడయందు శివశాస్త్రి కూర్చుండి, కొంచెము ఆలోచనలో మునిగియున్న సీతారామ సిద్ధాంతిని గాంచి]

శివశాస్త్రి:—ఏమో ఆలోచించుచున్నారు?

సిద్ధాంతి:—ఏమియున్నది!...ప్రపంచమునందు, ధనమెన్నిపనులనైన—నిర్విఘ్నముగ కొనసాగింపగలదని నాలో నేను సమాధానపడుచున్నాను...మన మీపల్లె ప్రవేశించి కొలది దినములే యైనను, శ్రీదేవిగారిచ్చట నివాసమేర్పరచుకొని యుండుటచేత, ఎన్ని సౌకర్యములిచ్చటేర్పరుపబడెనో తిలకింపుము!

శివ:—ఔను. శ్రీమంతులేనట్టడవియందు కాపురమున్నను, అచ్చటే వారికి వలయు సౌకర్యములు సమకూర్పబడును. శ్రీదేవిగారి పరివారమునందు మనముండుట మన యదృష్టమునకే తప్పదు.

సి:—నిజముగా ఈతల్లి మరల విజయనగరాధిపుని దయ సంపాదింపగలదనియే నా తలంపు. అధికముగ ధనమును వ్యయపరచి, శ్రీదేవిగారిచే నిచట స్థాపింపబడి, సక్రమముగ నడుపబడుచున్న ధర్మశాల ఆమె కీర్తిని దశదిశల వ్యాపింపజేయుచున్నది. ఈ నట్టడవిలో ఇన్ని భవనములు, ఉద్యానవనములు, ఏర్పడునని ఎవరైన కలనైన తలచిరా?

శివ:—ఇదియొక చిత్రమైన కథ; ముందెట్లు పరిణమించునో తెలియదు. ప్రస్తుతము దేవిగారు నిత్యము గావించుచున్న అన్నదానము, అతిథిసత్కారము, ఆమెకు మరల మంచిదినములను సంపాదించిపెట్టుననుటలో నాశ్చర్యములేదు దీనులగువారిని ఆదరించినచో పరాత్పరుడు మిగుల సంతసించును. పరాత్పరుని యనుగ్రహమును సంపాదించుటకిది మిగుల యుత్తమమైన మార్గము. శ్రీమంతులైనంతమాత్రమున ప్రయోజనము లేదు, పూర్వజన్మ సుకృతము వలన తమకు లభించిన ధనమును సక్రమముగ వినియోగించి, దీనులగు మానవుల నాదరించి, ఇతోధిక సుప్రతిష్ఠ నార్జింపగలవాని జీవితమే ధన్యమైనది అట్టివాని నామము స్మరణీయము, వాని చరిత్ర అనుసరణీయము.

సి:—ధనికులందరకట్టి మంచిబుద్ధియే యున్న కాల మిట్లేల మిడుకుచుండును... పంచాంగమును వినిపించుటకు సమయమైనది; దేవిగారి సన్నిధి కేగుదమురమ్ము.

శివ:—అట్లే కానిమ్ము. (ఇరువురు వెడలి పోవుదురు) (తెర.)

—సశేషము.

—చిరుమామిళ్ల శివరామకృష్ణప్రసాదు, బి.ఏ.

# మందుపుచ్చుకొన్న తప్పు

౧

వృత్తులనుబట్టి ఏర్పడ్డ వర్ణవ్యవస్థ నానాటికీ శిలారూపాన్ని దాల్చి ఏవిధంగా వర్ణన్యూనాధిక్యతలను స్థిరపరిచిందో, అదేవిధంగా మానవకల్పితములైన ఇతర ఆచారవ్యవహారాలుకూడా మనుష్యుల్లో హెచ్చుతగ్గుల నేర్పరిచాయ్.

ఏ వర్ణంలోనైనా — మంచికానీ యిండి చెడ్డ కానీ యిండి — పెద్ద లేర్పరచినహద్దుల్ని దాటకుండా వుండే వాళ్ళదృష్టిలో అందుకు భిన్నంగా నడిచేవాళ్ళు — అంటే భావస్వాతంత్ర్యంకోసం తంటాలుపడేవాళ్ళు లోకువగా కనబడతారు.

వాళ్ళసంఖ్య వీళ్ళసంఖ్యకంటె హెచ్చుగా ఉందీ అంటే ఇకచెప్పేదేమిటి! బహిష్కరణాయుధాన్ని ప్రయోగించి ముప్పుతిప్పలూ పెడతారు. ఆ ఆయుధానికి లొంగినవాళ్ళు లొంగి వాళ్ళదారికివచ్చి సంఘాన్ని బల్లిలల్లా అంటిపెట్టుకొని ఉండడమో లేకపోతే సంఘానికి దూరమైపోవడమో తటస్థిస్తుంది.

సంఘం ప్రయోగించిన ఆయుధాలకి పూర్తిగా లొంగిపోయిందా కాదు; వాటిని పూర్తిగా నిరోధించిందా కాదు శశి. ఆకులచాటు పిందె; అస్వతంత్రపుజీవి. ఆమెకు పంధొమ్మిదేళ్ళో ఇరవైయేళ్ళో ఉంటాయి. పిటపిటలాడే యౌవనం. సౌందర్యమంటారా? స్త్రీ తన కళ్ళకందంగా కనబడడానికి మానవుడు తెచ్చిపెట్టిన కృత్రిమసౌందర్యం ప్రసక్తెందుకూ మనకి? వయస్సుకు తగ్గ శరీరసౌష్ఠవం. పచ్చని దేహచ్ఛాయ. రంగులో నల్లకలువలను ధిక్కరిస్తూ మోకాళ్ళనంటే తలకట్టు. ఆకర్ణాంతవిశాలనేత్రాలు. చక్కనిపలువరుస. ఎందుకూ ఈ వర్ణనంతా? ఆమెనొక సౌందర్యరాశంటే చాలు. అందానికితోడు, సంస్కృతాంధ్రభాషలలో చక్కని ప్రవేశంకూడా ఉందామెకు.

కృత్రిమ సౌందర్యానికి ఆమెను వెలిచేసింది భగవంతుడా లేక మానవుడా? ఏమైతేనేం? సంఘపంజరంలో మానసిక దాస్యానికి లోనైవున్న పతంగసంఘాన్ని అనుసరించే శుకశాబకమందాం ఆమెను. తీయనిపాటల్తో వనజీవిని ఆనందడోలల్లో ఊపడానికి వీల్లేకుండానూ, ఇచ్ఛానుసారంగా గున్నమామిడిమీద కూర్చొని లలితపల్లవాలను ఆరగించకుండానూ బంధింపబడిన పరభృతమందాం;

నిజవాంఛలను రూపుమాపి పురుషులైనంతమాత్రాన తన సోదరులకూ, పుణ్యస్త్రీలైనంతమాత్రాన సన్నిహితస్త్రీలకూ సేవచేయడాని కేర్పరుపబడిన దాసీ అంటేనేం?

ఇంట్లో గంపెడు బలగం. సోదరులూ, వారి భార్యలూ, భార్యలతల్లులూ, తల్లులచెల్లెళ్ళూ, చెల్లెళ్ళ కోడళ్ళూ, కోడళ్ళచెల్లెళ్ళూ — ఇల్లా ఎందరులేరు? వారందరి దృష్టిలోనూ నీచంగా కనబడే పనులు శశి దృష్టిలోమాత్రం నీచంగా కనపడవూ? ఆఁ కనబడతాయ్; వినా ఆ యభాగ్యజీవిని అభిమానం చంపుకో మని శాసించింది సంఘం.

౨

వుండంటి శీతాకాలం. ఉదయం ఎనిమిదిగంటలవుతుంది. లోకబాంధవుడు తన ప్రచండకిరణాలతో నీహారజవనికను తెరల్చుకొంటూ, చలితో గజగజలాడే సర్వజీవులనూ తన కరస్పర్శలతో ఆదరిస్తున్నాడు. తొలికోడితోలేచి, గృహప్రాంగణ శుద్ధిచేసి, అంట్లగిన్నెలు చేతబట్టుకొని చెఱువుకువెళ్ళిన శశి ఎనిమిదిగంటలదాకా అక్కడేవుంది వాటినితోముతూ. ఆమె గులాబిచెక్కిళ్లు కందగడ్డలైనాయి. ముఖకమలమున స్వేదబిందువులు పాటమరించి సహజసౌందర్యాన్ని మెరుగుపరిచాయి. కొఅరూలినపనులకు వెళ్ళే పుజనుడు కష్టాలలో చిక్కుబట్టుగా గాలికెగిరిన ఆమెముంగురులు స్వేదబిందువులలో చిక్కుకున్నాయ్. తడిసీ తడవకుండావున్న ఆమె

కట్టుబట్టను మార్వ్యథగవానుకు అర్పితేస్తున్నారు. అల యటుచే వృద్ధాప్యభాపీడితరైన తన స్నేహితురాలిని గంగాభవాని రెండుకోళ్ళ నీరిచ్చి ఆదరించింది.

మానవుడామెను అనాకరితను చేస్తేనేం? ప్రకృతి ఆమెను ఆదరిస్తూనేవుంది గతభర్తృకరైనప్పటినుంచీ.

## ౩

'ఏమే! ఇంకా అంట్లుతోవడం కాలేదూ? పెళ్ళివారికి కాఫీ పదిగంటలకా ఏమిటి ఇచ్చేది? లేచిలి రావేం త్వరగా?' అని గర్జించాడొకపురుషుడక్కడకు వచ్చి.

'ఒస్తున్నానన్నయ్యా; ఎందుకల్లా కోప్పడతావ్? ఒక్కటైనా తెల్లవారగట్లనుంచీ తోముతూనే ఉన్నానా—కూర్చున్నాననుటావా? ఒంట్లో సుస్తీగా వుండడంచేత ఇంత ఆలస్యమైందిగాని లేకపోతే నిన్నటి మోస్తరుగానే తెల్లవారేటప్పటికే తోమిలేద్దును.'

'ఔనౌను. నీకిల్లాంటప్పుడే వస్తుంది'

'నాకుమనుపా అన్నయ్యా, రోగంవచ్చిందని చెప్పుకోడం?'

'ఎవరెరగని భాగవతమిది? ఇప్పుడా? వారంరోజుల నుంచీ ఏకేనాపని చేయవలసివచ్చినప్పటినుమాత్రం జ్వరమనీ తలనెప్పనీ సణుగుతావ్. పోనీ అల్లాఉన్నావని ఒక్కపనైనా చేయడంతూనేవా? అన్నీ చేస్తూనే ఉన్నావు. నిజంగా రోగమైతే నీవు చేయాలనుకుంటే మాత్రం ఏం చెయ్యడానికి సాధ్యమవుతుంది!'

(ఏడుస్తూ) 'ఔను...నావన్నీ అబద్ధాలే.'

'చెబుతావ్; చెబుతావ్ సమాధానాలు.'

'..........................'

'ఏడొప్పటి బాగాచేతనైంది చీటికీమాటికీ; అమ్మతో మురిప్పాలికమూడుబీపాలు తగ్గేయి నీ పాలు. నయాన్నీ భయాన్నీ, 'జుట్టుతీయించుకోవాలే తల్లీ' అని ఎంతపోరేడు నాన్న? ఆయనమాటలు లక్ష్యపెట్టేవూ నువ్వు? నిజంగా వంశానికి తీరనిఅప్రతిష్ట తెచ్చావని బెంగతోనే చచ్చిపోయాడాయన.'

(తేరబారిమాస్తూ) 'నాన్న చనిపోడానికి కారణం నేనా?' అంది శశి.

'ఆఁ మురిమ్మాటికీనీ; ఎన్నిమాట్లు నిన్ను రామేశ్వరం ప్రయాణంకమ్మన్నాడాయన? వనేమిరా అన్నావే? తల కట్టుకు ఏడ్చావే!'

'ఔను. అన్నమాటనిజమే;'

'నేను చెప్పేదీఅదే. ఇంట్లో నిత్యకృత్యంలో నువ్వు వంటచేస్తూంటే పేమిప్పుడు తిండంలేదా! వెనక నాన్నతినలేదా. మనమింట్లో ఎల్లా ఏడిశినా నలుగురులోనూ సెభాష్ అనిపించుకోవాలి. నువ్వెరిలే వినవు; ఒకరినిచూసైనా నేర్చుకోవ్. నకేశిని వంటచెయ్యడానికి పనికిరాదనేగా ఆ మధ్య చెల్లమ్మని రామేశ్వరం తీసుకెళ్ళి ఆ కాస్తపనీ కానిచ్చారు? నువ్వూ అప్పుడువెడితే ఈ పెళ్ళివంటలకిప్పుడు వాళ్ళనీవాళ్ళనీ పెంగళించవలసిన అవసరం లేకపోనుగదా?'

'........................ .....'

'అబ్బే! ఇంక మాట్లాడవుగా......అదుగో కేకేస్తోంది మీ వదినె; త్వరగారావాలి నేను వెడుతున్నా.'

'ఊఁ' (ఏడుస్తూ)

## ౪

'ఏదే శశి?' అన్నాడు శంకరశాస్త్రి భార్యను సమీపించి.

'మీ రెరగనట్టే ఎరగనావేం! ప్రొద్దున్న అంట్లుతోము కొచ్చి ఇంట్లోపడేసి గదిలోకెళ్ళి పడుకుంది దుప్పటి కప్పుకుని;'

'అశిముండా! ఎంత దొంగెత్తువేశేవే!'

'నేను వెనక చెబితే ఏమో అనుకునేవారు. ప్రత్యక్షంగా చూస్తేగాని తెలీదు ఎవరికీనీ. అది ఎల్లాంటిదనుకున్నారు! వట్టి పాడుగుణాలు; చూస్తూనేఉన్నారుగా? పిల్లలతో అల్లా దోరుతూనే, ఇంటిడిపనులూ నేను చేసుకొంటూంటే, తనకిట, వదుంవాల్చుకోడానికేనా తెరిపిలేకుండా పనులుచెప్పడంవల్ల జబ్బుచేసిందని చెబుకొందిట చూశారా నలుగురుతోనూ?'

'ఎవరు చెప్పేరు నీకు?'

'ఎవరు చెబితేనేంలెండి!—తెలిసింది; శుభమంటూ

పెళ్ళిచేసుకుంటూ ఛందస్సేమిటి, పిల్లీ? ఈ గోలేమిటి? అంటున్నారూ వారంరోజులనుంచీ మరీని.'

'ఆసి దీన్నితగలెయ్యా! ఏంహాస్యాలమే?'

'ఎన్నేనా వున్నాయ్ దానిచాపల్యాలు. మీకు తెలిస్తే కోపపడతారని ఎప్పటికప్పుడు దిగమింగి ఊరుకుంటున్నాను. కొంపలుకూల్చే కోరికకాదటే! అబ్బో! ఎన్ని ఊహాలు!'

'ఆఁ...ఏమిటీ! చెప్పు; చెప్పు అనేమిటో'

'అబ్బా—ఎందుకవన్నీ ఇప్పుడు? పెళ్ళివారు భోజనాలకు వచ్చేవేళయిందికూడాను. ఎవరేనా విన్నా అప్రతిష్ట.'

'బాగానేవుంది.' అని వెళ్ళిపోయాడు శాస్త్రి.

శశి విరామంలేకుండా మూలుగుతోంది.

'అబ్బా! పదిలం; ఏం మూలుగుతావే? ఇటువంటి దుర్బుద్ధు లుండడంచేతే పద్ధాలుగేళ్ళే మొగుడు చచ్చి పుట్టిల్లుపట్టేవు. తల్లి బ్రతికుండగా నానాఏడుపులూ ఏడిపించావు. తండ్రా చచ్చాడు. ఇప్పుడెక్కడ సాగుతాయి నీ వెధవవేషాలు.' అని గొణుగుతూ వంటయింట్లోకి వెళ్ళింది శాస్త్రిభార్య.

• • •

పెళ్ళివారందరూ భోజనాలకొచ్చారు. భోజనాల సమయంలో గదిలోకూర్చుని దీని మూలుగేమిటి? కాశీపువెళ్ళి దాన్నా పసులశాలలోనైనా పడుకోమందురూ మీకు పుణ్యంవుంటుంది' అంది శాస్త్రిభార్య.

'ఆఁ...అల్లాగే' అంటూ శాస్త్రి ఆమెను బలవంతంగా లేవదీసి దొడ్లోకి తీసికెళ్ళి పడుకోపెట్టేడు.

రెండురోజులు గడిచాయి. శశియొక్క ఆలనా పాలనా ఎవరికి కావాలి? 'నెమ్మదిగా ఉందా' అని అడిగినపాపాన్ని పోయినవాళ్ళెవరూ కనిపించలేదు.

మార్యభగవానుడే ఆమెను పైసాకోరని వైద్యుడు. ఎవరూవెళ్ళి పిలవకుండానే ఉదయమూ సాయంత్రమూ, ఆ సాలలోకివచ్చి చూసి వెడుతున్నాడు శశిని. రజనీకాంతకూడా ఆమెను ఆదరించింది దగ్గరకూర్చుని; తాను ఉల్లాసంగావుండి ఆమెకు ధైర్యంచెప్పింది. ఎంత ధైర్యం వహించినా అబలకాదూ? కొంతసేపటికి శశి జీవించలేమో అని అధైర్యపడిందామె. కట్టుకున్న తెల్ల చీరవిప్పి విచారసూచకంగా నల్లచీర ధరించింది. కన్నీళ్ళు రాల్చింది.

'ఊఁ ఊఁ...అని మూలుగుతూనేవుంది శశి.

౫

మనవాళ్ళదాసు ఆప్రాంతంలో పేరుపొందిన వైద్యుడు. వయస్సు అరవైసంవత్సరా లుంటాయి. పదేకరాలకొండ్రే ఉన్నవాడవడంచేతనూ, సహజంగా ఉదారస్వభావం కలవాడవడంచేతనూ బీదలకు మాలమాదిగలకు ఉచితంగానే వైద్యంచేస్తూవుంటాడతడు. వాళ్ళందరూ అతన్ని భగవంతుడల్లా పూజిస్తారు. అగ్రవర్ణాలవబడేవాళ్ళుకూడా అవసరంవచ్చినప్పుడు రహస్యంగా అతన్ని తీసుకొచ్చి వైద్యంచేయించుకుంటూవుంటారు. ప్రతిసంవత్సరమూ అతడు బీదలకు సమారాధనలు చేసేటప్పుడు అందరూ యథాశక్తిగా సహాయ్యం చేస్తారు. ఎక్కడికోగాని దాసు మందులసంచీ చేతబట్టుకుని వెడుతున్నాడు ఒకనాటి తెల్లవారుగట్ల.

'ఊఁ ఊఁ' అనే సన్నని మూలుగు అతని చెవినిబడింది. ఇటూఅటూ తిరిగిచూశాడు. మనుష్యులెవరూ కనబడలేదు. ఓ అగ్గిపుల్లవెలిగించి చూశాడు. తూర్పుగా ఉన్న పసులశాలలో తెల్లగా కనిపించింది. మరో అగ్గిపుల్లవెలిగించి దారిచూసుకుంటూ అక్కడకు వెళ్ళేడు.

ఒక కుక్కిమంచం. మంచంమీద ఓ మనిషి పడుకొనివుంది.

'ఎవరువారు' అన్నాడు దాసు అగ్గిపుల్ల వెలిగించి చూస్తూ. జవాబులేదు.

తలవంచిచూస్తూ 'అయ్యో! సోమయాజులుగారి కూతురువుటమ్మా! ఎంతగతి పట్టిందినీకు! భర్త పోవడమూ, తర్వాతతల్లీ ఆతర్వాత తండ్రీ చచ్చిపోవడమూ! ఇప్పుడు నీ స్థితిదా? దయదాక్షిణ్యాలు లేకుండా నిన్ను పసులశాలలోకి గెంటి ఖులాసాగా కూతురు పెళ్ళిచేసుకుంటున్నాడూ శాస్త్రులుగారు! అరెరే!......నేను మందిస్తాను పుచ్చుకుంటావా అమ్మా!'

'.........................'

దాసుప్రశ్నకు సమాధానంలేదు; చెయ్యిచూశాడు,

'అబ్బా! ఎంత తీవ్రంగా వుందీ!' అన్నాడు మందుల సంచీ విప్పి ఏవో రెండుమాత్రలు తీసి ఆమెనోట్లో వేశాడు. నాలుగుమాత్రలు పొట్లంకట్టి మంచంమీద పెట్టి వెళ్ళిపోయాడు దాసు.

తెల్లవారింది. శశి మరణదేవతతో యుద్ధంచేసి గెలిచి అలసటను తెలియబరచే చూపుల్తో ఇటూ అటూ చూసింది. అంతకుపూర్వమూ రెండురోజులనుంచీ వినిపించని శబ్దాలచప్పుడు ఆమెకప్పుడు వినిపించిం. 'కాంతానికి వెళ్ళుతూంటే ఏపనీ చేయకుండా నే నిల్లాపడుకొని ఉండడమా? ఛీ. పాడుజన్మ! వెళ్ళి విస్తరాకులేనా తీసిపారేస్తా' అంటూ లేచి మంచంమీద కూర్చుంది. దొడ్లోవున్న అంట్లతెప్పెలాలు ఆమెను స్వాగతమిచ్చాయి. తలుపుమూలనున్న చీపురు తొంగి చూసింది. నెమ్మదిగా లేచింది శశి. కళ్ళుతిరిగి వెంటనే క్రిందపడిపోయింది. మరికొంతసేపటికి లేచికూర్చుని నెమ్మదిగా ఇంట్లోకివెళ్ళి 'ఒదినా! గుప్పెడు మెతుకులు పెడుదూ, దడదడలాడిపోతోంది ప్రాణం' అంది నెమ్మదిగా.

'నీకూ ఇప్పుడే తొందరవచ్చిందా' అంటూ విసుక్కుని ఆకులో కొంతఅన్నం పారేసి వెళ్ళిపోయిందామె.

నాలుగుముద్దలు తిని శశి నెమ్మదిగా పసులసాల లోకి వెళ్ళిపోయింది.

## ౬

'అమ్మాయిగారూ! మీవంట్లో ఎల్లావుందిప్పుడు?' అన్నాడు దాసు మర్నాడుతెల్లారగట్ల అక్కడకువచ్చి.

'ఎవరు వారు?'

'నేను మనవాళ్ళ దాసునమ్మా.'

'ఊఁహూఁ; నెమ్మదిగా నేవుంది.'

'పోనీయండి పాపం! నిన్న మీస్థితిచూస్తే నాకే సందేహంకలిగింది.'

'నిన్నవచ్చి చూశావేమిటి?'

'ఔనండీ. తెల్లవారగట్ల ఈదారినే వెడుతూ మీ మూలుగువిని ఇక్కడకొచ్చా.

'ఊఁహూఁ'

'పిలిస్తే పలకలేదు; చాలా అపాయస్థితిలోనే వున్నారప్పుడు.'

'ఆఁ'...రక్షించావువన్ను; నీఋణం తీర్చుకోలేను నేను.

'అఁ దానికేంలెండి; మీరు నెమ్మదిగా ఉండడమే కావలసింది. ఇదిగో ఈమాత్రలు దగ్గరఉంచండి; నాల్గురోజులు వేసుకుంటే పూర్తిగా ఆరోగ్యంకలుగుతుంది.

మాత్రలపొట్లం అందుకొని 'నమస్కారం' అంది శశి.

'శలవు' అని వెళ్ళిపోయాడు దాసు.

'...........................'

శంకరశాస్త్రి కంటె చెంబు తీసుకువెళ్ళడానికి దొడ్లోకివచ్చాడు. శశి మాత్రలు నోట్లో వేసుకోబోతోంది.

'ఆ మాత్రలెక్కడివే' అన్నాడు శాస్త్రి.

'మాత్రలా!...మనవాళ్ళ దాసు తీసుకువచ్చి ఇచ్చాడు తెల్లవారగట్ల.'

'ఆఁ మనవాళ్ళదాసే!'

'...........................'

'ఆసీ నిన్నుతగలయ్యా, మాలకూడుకూడా కలుపుతున్నావే ఇంటిలో...వాడు మందివ్వడమేమిటి?'

'ఏమో నాకుతెలియదు; నిన్న తెల్లారగట్ల ఈ దారినేవెడుతూ నేను బాధపడుతూంటే చూసి రెండు మాత్రలు వేసి వెళ్ళాడట; ఈవాళ తెల్లవారగట్లకూడా వచ్చి చెయిచూసి పదిమాత్రలిచ్చి వెళ్ళేడు.'

'పీణ్ణి తగలయ్యా; వాడికెందుకు బుద్ధిలేకపోవాలి; బ్రాహ్మణకొంప కొస్తాడూ. పైగా చెయ్చూసి మాత్రలిస్తాడూ?'

'ఉండు; వాడిరోగమూ నీ రోగమూ కుదిరిస్తా.'

'అతని తప్పేమిటి? బాధపడుతూంటేచూసి దయదల్చి నాలుగుమాత్రలిచ్చాడు; నిన్ననామాత్రా వేసుకోకుండావుంటే విధిగా ప్రాణంపోయేదేట.'

'పోతే భూమికిలోటొచ్చింది ఇటువంటి పాపిష్టి వెధవలు.' అంటూ వెళ్ళిపోయాడు.

శశి విచారిస్తూకూచుంది మంచంమీద. శంకరశాస్త్రి

లోపలికెళ్ళి 'ఇదిగో! ఆ వెధవకెవరైనా ఈవేళ అన్నంపెట్టేరంటే మాటదక్కదు; ఇంటిలోకి రానీయడానికి వీల్లేదు.' అన్నాడు భార్యను చూస్తూ.

'ఏం...ఏమొచ్చిందిప్పుడు?'

'మనవాళ్ళ దాసుచేత వైద్యంచేయించుకుంటోందిట.'

'అయ్యో! ఏం మాలకూడైపోయింది? మొదటినుంచీ దీనిబుద్ధి ఇల్లాంటిదే.'

'ఇంటిలోకి రానీయకండి; నలుగురిచేతా గడ్డట్టించి......'

'ప్రాయశ్చిత్తంచేయించద్దూ ఇటువంటి వాళ్ళకి?'

'విధిగా చేయించాలి.'

* * *

శశి వారి సంభాషణలన్నీ వింది; 'ప్రాయశ్చిత్తాలేమీ నాకక్కర్లేదు; మీఇంటిలోకి రానులెండి.' అంది గట్టిగా, కళ్ళనీరు కొంగుతో ఒత్తుకుంటూ.

'రాకపోతే గంగలోదిగు వెధవా' అన్నాడు శాస్త్రి పళ్ళు పటపటలాడిస్తూ.

శశి మాట్లాడకుండా ఊరుకుంది. 'అభిమానమెంత మళ్ళీను' అంది శాస్త్రిభార్య.

౨

'అమ్మాయిగారూ! బాగా సుఖంగా వుందా మీ వంటిలో?'

'లేకేం? సుఖంగానే వుందిగాని......నాకు గొప్ప అపకారం చేశావు నువ్వు.'

'ఏమమ్మా! అల్లా అంటారేం?'

'ప్రపంచకాని కెందుకూ ఉపయోగపడని ఈ జీవి బతికివుంచేవెందుకూ! నీ వేమందూ ఇవ్వకుండా వుంటే మొన్ననే చనిపోయివుందును గదా?'

'అవేంమాటలమ్మా? మీ అన్నగారేమైనా అన్నారేమిటి?'

'ఇప్పు డనడమేం? మొదటినుంచీ అంటూనే వున్నారు. ఎంతకాలమని ఓపికపట్టి వుండడం? వచ్చిన కష్టానికే నేను ఏడుస్తూంటే పైగా వీళ్ళుకూడా ఏడిపించడమా? తలదువ్వకుంటే తప్పా? రవిక తొడుక్కుంటే దోషమా? బోడుగుండు చేయించుకుని ముసుగేసుకుంటే చూడాలనివుంది వాడికి; పూసిన తంగేడల్లా వుంటే వీడికళ్ళూ వీడి పెళ్ళాంకళ్ళూ కుడుతున్నాయి: ఛీ. వెధవాచారాలుగాని—ఇక నేనీ ఇంటిలో ఉండలేను.'

'బా...గా...నే...వుంది!'

'నాకొక బాధనుకున్నావా? చూశావా, నీదగ్గర మందుపుచ్చుకున్నందుకు నాను ప్రాయశ్చిత్తం చేయిస్తారట; అంతవరకూ ఇంటిలోకి అడుగుపెట్టడానికి వీల్లేదుట. మందుకుకూడా అంటేనా? ప్రాణాలు పోయేటప్పుడు కూడా వర్ణభేదాలేనా! ఛీ...ఛీ...నే నిక్కడ ఉండలేనింక; నువ్వే నాకు తండ్రివి. నన్ను రక్షిస్తానంటే ఈ ప్రాణాల్తో వుంటా; లేకపోతే ఏ చెరువో చూసుకుంటా.'

'అల్లాగే రక్షిస్తా; మీకేమీ భయంలేదు; ప్రస్తుతం నేను చెయ్యవలసిందేమిటో చెప్పండి.'

'ఏమీలేదు; నీ కుమార్తెననుకోమంటా; గుప్పెడు మెతుకులు నీతో తిననీయమంటా.'

'నా రెక్కలు చల్లగా ఉన్నంతకాలమూ తిండికేమీ లోటులేదుగాని; వర్ణసంకరం కావడం తప్పనుకుంటానండీ.'

'ఐతే ఏమంటావు'

'ఏమీలేదు. మా ఇంటికిప్రక్కగా మరో చిన్నఇల్లు వేయిస్తా; పోనీ అక్కడ వండుకుంటూ వుంటారా?'

'నీదయ; ఎల్లా చెయ్యమంటే అల్లాగే చేస్తాను పోనీ.'

'ఐతే ఇంకేం; సాయంత్రానికి వేయించేస్తా పాక.'

'కొంతకాలం నీకు శ్రమతప్పదు. తర్వాత నీదయ వుంటే ఎవరినో నలుగురుపిల్లల్ని పోగుచేసి నాపొట్ట నేను పోసుకుంటా.'

'నాకేమీ లోటులేదమ్మా. ఎంతకాలమైన ఇబ్బంది లేదు.'

'అబ్బే. అల్లా అనకు.'

'సరేలెండి; ఇప్పట్నుంచీ ఎందుకూ ఆ ఆలోచన?...

'ఊఁ...'

౩

శశి మాలపల్లెలో కాపురముండనేసంగతి ఆ చుట్టు

పల్లె గ్రామాలవాళ్ళకందరికీ తెలిసింది. వయస్సులో వుండి గనక అనేకబుద్ధులు పుడతాయన్నారు కొందరు. వితంతువులను కత్తెరబోనులో పెట్టాలిగాని ఆ హామీగా విడిచిపెడితే తప్పేబాధ లిల్లాంటివే అన్నారు కొందరు.

తమ అభిప్రాయానికి కళంకం తెచ్చిపెట్టిందని, శాస్త్రి తదితరబంధువులూ విచారించారు. అరవైయేళ్ళ దాసుగాడి కీసాయ్యకాలకేమిటో గట్టిగా కనుక్కోవాలన్నారు కొందరు

* * *

కాలచక్రం గిర్రున తిరిగిపోయింది. నాలుగు సంవత్సరాలు గడిచాయి. అన్నగారి ఇల్లువిడిచివెళ్ళిన కొద్దికాలానికే పదిమంది మాలమాదిగపిల్లల్తో శశి స్థాపించిన పాఠశాల చాలా అభివృద్ధిలోనికివచ్చింది. ఊళ్ళోవాళ్లు కూడా చాలామంది తమపిల్లలిని ఆ పాఠశాలకే పంపేరు. పాఠశాలప్రక్కనే శశి స్థాపించిన శాంత్యాశ్రమంలో ఉదయమూ సాయంత్రమూ ప్రార్థనలు జరుగుతాయి. మధ్యాహ్నం పురాణ కాలక్షేపం జరుగుతుంది. ఏ ముహూర్తాన్ని ఆమె ఆపాఠశాలా, ఆశ్రమమూ స్థాపించిందోగాని అజ్ఞానులగు ఆ మాలమాదిగలలో విపరీతమైన మార్పుకలిగింది. అందరూ మాంసముతినడం మానేశారు. ఆరోగ్యమార్గము నవలంబించారు. న్యాయవర్తనము నలవడజేసుకున్నారు. ఆపల్లె ఆరోగ్యదేవతకు స్థానమైంది. సరస్వతీదేవికి నిలయమైంది.

ఊళ్ళోవాళ్ళు మొదట శశిమీద ఎన్నినిందలు దొర్లిస్తేనేం? నిజం నిలకడమీద తెలిసిందందరికీ. శాస్త్రి, అతని భార్యా పెట్టే బాధలుపడలేక ఇల్లువిడిచి వెళ్ళిపోయిందని అందరూ గ్రహించారు. ఆమెను ఆదరించి ఆమెచేసే సత్కార్యాలకు చేయూతనిచ్చిన దాసును ప్రశంసించారు. అరవైఏళ్ళ దాసుకు అపనిందలారోపించిన బుద్ధిమంతులు సిగ్గుపడ్డారు.

రెండు సమాంతరరేఖలు ఎంత పొడిగించినా కలవవనడం ఎంతసత్యమో, ఆమె నిష్కళంకచరిత్రయనడంకూడా అంత సత్యమని అందరి తలంపూనూ.

—పన్నిరామశాస్త్రి.

# దైవికము

ప్రణయపరిణత జీవిత పథమునందు
నడచునామది తోడుగా. నడచునొక్క
ప్రేమరూపిణి; ప్రకృతి సంప్రీతిగూర్పఁ
బయన మొనరింతు మేము సంబరముతోడ;

మాకు లక్ష్యము, రూపనామములు గలిగి
లేని యానందనిలయమ్ము; లేమిలేని
యీశ్వరుండుగురుండు; మాహితుడు నతడె;
యెన్నిదినములు పయనమో యెరుగరెవరు;
కర్తలముగాము మేము; సంకల్పమాత్ర
స్వర్గసుఖములు మా పదాబ్జాల జేరు;
కల్పితైహికసుఖములఁ గాలదన్ని
హృదయసీమల నానంద మేలగలము;

అట్టి మా జంటహృదయాల నంటినడుమ,
గోరుచున్నది, ప్రకృతి నిగూఢభావ
ప్రేరణాలాప కోమలహృదయ మొకటి;
లక్ష్యమెయ్యది నూ, కదేలక్ష్యముగను;
మూడు హృదయంబు లేకమై యీడులేని
ప్రేమజీవితపథమున, కామరహిత
మైన యానందనిలయమ్మునందు జేరి
దైవికరహస్యమునుగాంచి దనరుగాక;

* * *

దేవ! నీదివ్యసృష్టినిఁ దెలియజాల
రెంతవారేని; యెప్పటి కేమిజేతొ
యెరిగిలినో మూడుహృదయంబు లేకమాట
నేటికిట జూపితివి సృష్టి నేర్పుజూప;

—ములుమూడి ఆదిశేషాద్రిరెడ్డి.

# పిశాచం—రొట్టె

[టాల్‌స్టాయి కథకు అనువాదము]

పేదవాడైన పొలంకాపొకడుండేవాడు. ఒకనాడుదయాన్నే లేచి పొలం దున్నటానికి బయలుదేరి పోయినాడు. ఉదయపు భోజనానికి కొంత రొట్టెకూడ చేత బట్టుకున్నాడు. నాగటికొయ్య బిగించి యెద్దులను పూన్చాడు. కోటువిప్పి రొట్టెముక్క దానిలో చుట్టబెట్టి, కంచెక్రింద దాని పెట్టి దుక్కి ప్రారంభంచేశాడు. జాము ప్రొద్దెక్కేవరకూ దున్ని నాగలి నిలిపివేశాడు. గుఱ్ఱానికీ కొంత అలసట కలిగింది. గుఱ్ఱాన్ని మేతకు వదిలి, కంచెచాటునున్న రొట్టె తీసుకుందామని పోయినాడు.

కోటుమడత విప్పిచూచాడు—రొట్టె కనిపించలేదు. కోటు తిరగవేసి బోర్లవేసి చూచాడు; కోటు కొనలు పట్టుకొని దులిపిదులిపి చూచాడు—రొట్టె లేదు. అంతా బహు చిత్రంగావున్నది—కారణమేమెా ఊహించలేక పోయినాడు కాపు.

'ఏమిటీవింత! నేనుతప్ప మరెవ్వరూ రానేలేదిక్కడికి! ఎవ్వరూ రాకపోతే మరి రొట్టేమయింది? ఎవరో వచ్చేవుండవలె!' ననుకున్నాడు.

రొట్టె దొంగిలించినవాడొక పిశాచం. కాపు పొలం దున్నుతూన్న సమయంలో రహస్యంగావచ్చి, రొట్టెత్తుకొనిపోయి పొదచాటున దాగి కూచున్నాడు. ఏవో మాయోపాయాలు పన్ని, కాపును రెచ్చగొట్టి, క్రోధావేశం పుట్టించి, అతనిచేత నానాదుర్భాషలాడించి, పాపంలోకి దించి పాడుచేదామనే పిశాచం సంకల్పించుకున్నాడు.

రొట్టెపోయిందని కాపు మొదట కొంచెం విచారించాడు. కాని వెంటనే 'పోనీ, పోతేపోయింది—ఒకపూట తిండికోసం యింత ఆలోచనకూడదు. ఇంతమాత్రంచేత ఆకలితో చచ్చిపోతానా యేమిటి! ఎవడో ఆకలిబాధ భరించలేకనే తీసుకొనిపోయివుంటాడు రొట్టె. పోనీ, తిని సుఖిస్తాడెవరో, పాపం!' అంటూ కాపు తిరిగి మనస్సమాధానంచేసుకొని నూతి దగ్గరకు పోయినాడు. కడుపునిండా నీరుతాగి దాహం తీర్చుకొని, కొంతసేపు విశ్రమించాడు. తరువాత లేచి గుఱ్ఱాన్ని తీసుకొని వచ్చి తిరిగి పొలందున్నటం ప్రారంభించాడు.

ఇంతటితో పిశాచానికి గర్వభంగమయింది. కాపు చేత అనరానిమాట లనిపించి, అతణ్ణి పశువుగా చేదామని తానుచేసిన ప్రయత్నమంతా భగ్నమయింది. తనకు జరిగిన పరాభవాన్ని గూర్చి తన యజమానితో చెప్పకుందామని సైతానుదగ్గరకు పోయినాడు పిశాచం.

కాపు తెచ్చుకున్న రొట్టె తానెట్లా దొంగిలించాడో, కాపు తన్ను తిట్టి శపథాలు చేయటానికి బదులుగా 'పోనీ, దొకరికి కావలసి తినివేశారో, పాపం! అదీ మంచిదే!' నంటూ సంతృప్తిచెంది నీళ్ళుమాత్రం తాగి, తిరిగి దుక్కి యెట్లాసాగించాడో, యీసమాచారమంతా పిశాచంపోయి సైతానుకు విన్నవించాడు.

ఈమాట వినేసరికి సైతానుకు కోపంవచ్చింది. 'ఒక్క మనుష్యమాత్రుని గెలువలేక లొంగిపోయినావంటే తప్పంతా నీదే' నీబాధ్యత నీకే తెలియునని కట్టి పనికిమాలిన వాడవనిపించుకున్నావే. ఇట్లా పొలంకాపులూ, వాళ్ళ ధైర్యంచూచుకొని వాళ్ళభార్యలూ, అందరూ మనమీదికి వచ్చి యెదురుత్తుంటే మనపని యేమి కావలె! వాళ్ళనిట్లా విడిచిపెట్టి వూరుకుంటే యెట్లా? నీవు తిరిగి వెంటనే పోయి పని యెట్లానో చెరపేచ్చుకొని రావలె. నీకు మూడు సంవత్సరాలు గడువిస్తున్నాను. ఈలోగా నీవా కాపువాణ్ణి లొంగదీయలేకపోతే, దేవాలయానికి పంపి అక్కడి పవిత్ర జల కలశంలో ముంచి లేవనెత్తిస్తానుసుమా నిన్ను—జాగ్రత!' అని సేవకునికి భయం పుట్టేటట్లు బెదరించాడు సైతాను.

ఈ చీవాట్లతో పిశాచానికి శరీరమంతా భయంతో వణికిపోయింది వసివడిగా భూమిలోపలికి దూరిపోయి, తానుచేసిన పొరపాటు దిద్దుకొనటమెట్లాగో యోచిం.

ఇంటి యజమానీ, యింటిస్త్రీ, అతిథులూ అందరూ తప్పదాగి ఒకరికొకరు ఉపన్యాసాలిచ్చుకుంటూ, నోటికి వచ్చినట్లల్లా పేలాపన ప్రారంభించారు.

ఇదంతా శ్రద్ధగా వింటున్నాడు సైతాను. తన బంటు పన్నిన తంత్రాని కెంతో మెచ్చుకుంటూ 'ఈ తాగుడుమూలంగా వీళ్ళస్థితికి వచ్చారంటే, యిక వీళ్లు మనచేత జిక్కి దాసానుదాసులైనా రన్నమాటే! ఇంకా సందేహమా!' అన్నాడు.

'ఉండవయ్యా స్వామీ! తొందరపడక యింకా యేంజరుగుతుందో చూడు! సారాపాత్రలు యింకొక్కవరుస తిరగనిచ్చి తరువాత మాడు. తోకలాడిస్తూ ఒకదానిచుట్టూ వొకటి తిరిగే గుంటనక్కలలాగున వాళ్ళిప్పటికే తయారైనారుకదా! మరొక్క క్షణమాగు. ఒక్కొక్క డొక్కొక తోడేలౌతాడు—మనమే చూస్తాము!' అన్నాడు పిశాచం.

పాలంకాపు లందరూ తిరిగి ఒక్కొక్క పాత్ర సారాయి పుచ్చుకునేసరికి మైకంబాగా తలకెక్కింది. ఒకరినొకరు బండతిట్లు తిట్టుకోవడం ప్రారంభించారు. సరసంముదిరి విరసంగా మారింది. మరొక్క క్షణానికి భయంకరమైన కొట్లాటకూడా ప్రారంభమయింది. ఆ యింటికాపుకూడా దెబ్బలాటలో పాల్గొని దిట్టంగా దెబ్బలు తిన్నాడు.

సైతాను చూచిచూచి పరమానందభరితుడౌతున్నాడు. 'ఒకటొకరకంగా వున్నదిరా!!' అన్నాడు పిశాచంతో.

'మరికాస్త ఓపికపట్టవయ్యా బాబూ! అసలు రంగం యింకారానేలేదు. మూడవసారి పాత్రలు తిరిగిన తరువాత చూడవలె తమాషా. ఇప్పటికి తోడేళ్ళవలె చెలరేగుతున్నారుకదా! మరొక్క గ్లాసు లోపల పడేటప్పటికి కేవలం పందిస్వభావం బయటికి వస్తుంది. అప్పటితో గాని పశుత్వం పూర్తికాదు.' అన్నాడు పిశాచం.

అతడన్నట్లుగానే తిరిగి అందరూ మూడవపాత్ర తాగేసరికి శుద్ధ పశుప్రాయులుగా మారి, ఒకరిమాటొకరికి వినబడకుండా ఒళ్ళుతెలియని వెర్రికేకలు మొదలుపెట్టినారు.

అంతటితో తాగుడు కట్టిపెట్టి ఒంటరిగా కొందరు, ఇద్దరుముగ్గురు కలిసి గుంపులుగా కొందరు, మతిమాలిన కేకలువేసుకుంటూ వీధివెంబడి పడుతూ లేస్తూ పోతున్నారు. అతిథులను సాగనంపడానికి గృహయజమాని కూడా బయటికివచ్చి, వీధిమూలనున్న బురదగుంటలో పడ్డాడు. నఖశిఖపర్యంతం బురదతో నిండిపోయింది. సారాయిమత్తులో ఒళ్ళుతెలియక పందిలాగున గురగుర లాడుతూ, చాలసేపు సాగోతిలోనే పొర్లుతూ పడివున్నాడు.

ఈ దృశ్యంచూచేసరికి సైతాను సంతోషానికి మేరలేకపోయింది. సేవకుని తెలివితేటలను మెచ్చుకుంటూ యిట్లన్నాడు:

'హాయ్, హాయ్! ఎట్లా కనిపెట్టినావో గాని, మంచిమందే తయారుచేశావురా! మొదటిలో నీవు కలిగిన పరాభవాన్ని మరిపించేటంత దిగ్విజయాన్ని పొందినావు—ఓహో! అయితే యీసారాయెట్లా తయారుచేశావో కొంచెంచెప్పు. మొట్టమొదట గుంటనక్కరక్తం అందులో కొంతకలిపి వుంటావను కుంటాను. అది లేకపోతే అంత జిత్తులమారితనం, మోసం వాళ్లకెట్లా అబ్బుతుంది? తరువాత తోడేళ్ల రక్తంకూడా కొంతకలిపి వుండవలె. అందుకే వాళ్ళంత భయంకరంగా కేవలం తోడేళ్ళలాగునే కాట్లాడుకున్నారు. తరువాత పందిరక్తంకూడా కలపటంతో దాని ప్రభావం పూర్తిఅయిందనుకుంటాను. చివరి కందరినీ పందులకింద మార్చివేసిందే!'

'కాదు, కాదు—అట్లాకాదు అది తయారైనవిధం. కాపుకి కావలసినదానికంటె యెక్కువగా ధాన్యం పండించి యిచ్చాను—ఇంతే నే జేసినపని. పశువు రక్తం యెప్పుడూ మనుష్యునిలో వుండనేవున్నది. తిండికి సరిపోయేటంత మట్టుకే ధాన్యమున్నంతకాలం యీ పశుత్వం పైకిరాకుండా అణగివుంటుంది. ఆస్థితిలో వున్నంతవరకు కాపువానికి ఒక్కొక్కరోజున తిండి లేకపోయినా లెక్కచేసేవాడు కాడు. నాడు తాను తెచ్చుకున్న రొట్టె నే నెత్తుకొనిపోయినప్పుడు, భోజనానికింటికైనా పోకుండా కడుపునిండా నీళ్ళుతాగి దుక్కి పూర్తిచేసుకున్నాడు. ఇప్పుడాకాలం మారిపోయింది—ఎందుకో తెలుసునా? కాపు యింటిలో

యిప్పుడెక్కడచూచినా ధాన్యపురాసులే— అవసరానికి మించిన పంటపండింది దానితో భోగాభిలాష మితిలేకుండా పెరిగిపోయింది. ఈ వాంఛ తీర్చడానికే నేనే తాగుడుమార్గం చూపించాను. తిండికొరకై కష్టబడ్డ ఆహారపదార్థాలను సారాయికింద మార్చడానికెప్పుడు సిద్ధపడ్డాడో, అప్పుడే వెంటనే అంతవరకు లోపల అణగివున్న నక్కయొక్క మోసం, తోడేలుయొక్క క్రూరత్వం, పందియొక్క బండతనం— యివన్నీ ఒక్కపెట్టున బైటికి ప్రత్యక్షస్థితికి తెచ్చాయి. మరేమీ అక్కరలేదు, యీతాగుడుకిట్లా నిలిచి పోయిందంటే మాత్రం యిక శాశ్వతంగా పశువై యుంటాడు.' అని పిశాచం జవాబిచ్చాడు.

సైతాను మితిలేని సంతోషం వెలిబుచ్చుతూ, పిశాచుని మెచ్చుకున్నాడు. వాడు మొదటచూపిన అసమర్థతకు క్షమించి, పాతవుద్యోగంనుంచి తప్పించి మరొక పెద్ద వుద్యోగంలో ప్రవేశపెట్టి రెంతైనా గౌరవించాడు.

—తల్లాప్రగడ ప్రకాశరాయుడు ఎం.ఏ.

# ప్రత్యూహ దృశ్యము

ఆమె పెదవులు రత్నరాగాభ లేమి
పాలిపోయి ఎడపడె; ప్రవాహమటులు
ఊర్పువాయువు పర్విడె; ఉత్పలముల
ఉనికిపట్టగు తెలినీలి కనులయందు
చరమ దివసాంబరారుణ జలదకాంతి
భూతవృత్తోద్భవ విషానుభూతిఁదూలి
కాలు నామె యెడఁదలోని జ్వాలతోడ
ఉబ్బుకొని వచ్చుచున్నది. ఒకయపూర్వ
దివ్యకాంతి తటిల్లత—(దీప్తమైన
ఆపె ప్రేమనిధికి ప్రతిరూపమదియె!)
ఆమెమూర్తిని ప్రత్యంగ మనుసరించి
ఆవరించెను! పరిసరమ్మైన ప్రకృతి
లోలితంబయ్యె మిసిమి వెల్లువలలోన

* * *

రజనివోలె మృత్యువువోలె ప్రామునొన్న
ఇగులగుంపుల నేత్రాల నివతళించు
ముగ్ధదృష్టులు సగినరమ్మును గదల్చి
నాటి సూచికలట్లు గిన్పట్టె;
రూప
రహిత పావకార్చికలు వెలార్చు ఆమె
మధుర మస్సృణాధరమ్ము నా యధరమంటి
తెలసి నుసిచేయునంచు గంపించినాను;
ఆమెశిరమును నా హృదయమున హత్తి,
జాలుకన్నీటి యగ్గి కణాలురాల్చి,
అమృత మధురమ్మును శిరీషమృదుళమును
నయ్యును విషాదముద్రితమ్మైన నుదుల
పలుకరించి నాచేతమ్ము గలచి తనదు
వలపుఁగనులను నా నేత్రములను గలిపి
ఎక్షద బువ్వరేకుల గుప్తరించియున్న
విన్నుతిప్రేమవృత్తి పవిత్రభూతి
పత్రములు విచ్చియామె చూపగ ప్రమోద
వికసితాలోకనమ్ములు వెల్లివిరియు
అరసితి; ఒకక్షణమె!
ప్రాచియందు బాల
భానుడుదయించె; బంధూకసూనరక్తి
ప్రిదులుచుండెను; నేనేమొ లేచిపోతి—
ఇదియ ప్రత్యూహదృశ్యమోయీ సఖుండ!

* * *

వెల్లిలో మున్గి తేలుచు వెడలుచుండు
కడిమి నవవెంటజను తేటి కరణినాదు
తలఁపులక్కట తముతామ తరలిపోవు
ప్రాణసఖ వలపునీడల పథములంటి!

* * *

ప్రణయబంధమ్ము త్రెంచికో వలనుపడదు!

—ఓలేటి సీతారామమూర్తి బి.ఏ.



# ౬. అసత్యమూ—నాగరికతా

హరిశ్చంద్రుడి చరిత్ర సత్యవ్రతానికి అనవసరమైన ప్రచారం చాలా చేసింది. నా మందబుద్ధికి. హరిశ్చంద్రుడు, గుడ్డెద్దు చేలో పడ్డట్టు నిజం చెప్పటం, అన్నం చాలా హానికరమని చక్కగా నిరూపిస్తున్నట్టు కనిపిస్తుంది. కాకపోతే అటువంటి వ్రతాలకు ప్రత్యేకవ్యక్తులను సంబంధించినంతవరకు కొంత ప్రాముఖ్యత లేకపోలేదు. అబద్ధానికి నైతికమైనబలంలేదని తేల్చేవరకూ సత్యవ్రతదీక్షను మౌనవ్రతదీక్షమొదలైన దీక్షలకంటె ఎక్కువస్థానం ఇవ్వక్కర్లేదు. ఆ దీక్షనుగురించి రాయటం, కీర్తించటం, కన్న హానికరమైన విషయం ఉండబోదు.

అనృతంయొక్క నైతికబలం విచారిద్దాం. దానికి ముందు అనృతంయొక్క స్వరూపం విచారించవలిసి ఉంది.

దీర్ఘంగా ఆలోచిస్తే సత్యంయొక్క స్వరూపం నిర్ణయించటం చాలా కష్టమనీ బహుశా అసంభవమనీ తేలుతుంది.

సత్యప్రకటన మాటలద్వారా జరిగినపుడు మాటలలో ఉన్న అసత్యం ప్రకటింపబడే సత్యాన్ని అరికట్టుతుంది. చంద్రుడెట్లా ఉంటాడని ప్రశ్నిస్తే సమాధానం అబద్ధాలమయం అయి తీరవలసిందే. ఎన్నిమాటలతో చంద్రుడియొక్క ఆకారం వినేవాడికళ్ళను కట్టినట్టు చెయ్యగలం? యుగాలుచాలవు, వాఙ్మయం యావత్తూ నిరర్థకం అయిపోతుంది. ఉపమానాలు తెస్తామా, ప్రతి ఉపమానమూ, సత్యాన్ని మరింత దూరంగా తోలేస్తుంది. చంద్రుణ్ణి చూపించి జ్ఞానేంద్రియంద్వారా ఇట్లాఉంటాడని తెలియజేద్దామా, చక్షురింద్రియంయొక్క లోపాలన్నీ సత్యాన్ని కప్పేస్తయి. చంద్రుడి సమీపానికి వెళ్ళినకొద్దీ చంద్రుడి ఆకారం మారటం నిశ్చయం. అంతదూరంపోకుండా టెలిస్కోపులోనించి చూసినా తేలిపోతుంది. కంటికి ఇత్రిగానూ మత్రిగానూ కనిపించే చంద్రుడిమచ్చ క్రేటర్స్‌గా కనిపిస్తుంది దుర్భిణితో చూస్తే.

స్వల్పవిషయాల్లో మనం సత్యం చెప్పగలగటం లేదా? 'టైమెంతయ్యింది?' అంటే 'పది' అని చెప్పలేమా? అది ఎవరైనా అనవచ్చును. అటువంటి సత్యం మనకెంతవరకు ఉపకరిస్తుంది? అంతకన్న డాక్టర్లు రోగికి చెప్పే అబద్ధాలు ఎక్కువ ఉపకారం చేస్తున్నై.

ఒకపని చెయ్యవచ్చును; థియరీ ఆఫ్ రిలేటివిటీ ఆధారంచేసుకుని ఒకదానికన్న ఒకటి ఎక్కువసత్యం అనవచ్చును అనగా ఒకదాన్లోకంటె మరొకదాన్లో ఎక్కువ అసత్యం ఉంటూఉంటుంది; సత్యాసత్యాలన్నిటిలోనూ పాళ్ళుగాఉన్నవని. అటువంటప్పుడు సత్యవ్రతదీక్ష హాస్యాస్పదం కాదా? హరిశ్చంద్రుడి ఎదట అంతకన్న సత్యవంతుడు పుట్టవచ్చును. దీనికి అంతేది?

మాటలకన్నా జ్ఞానేంద్రియాలకన్నా సత్యగ్రహణశక్తిగలది మనస్సొకటి ఉంది. సత్యాన్వేషణ పరుడి మొదటివిధి దాన్ని అభివృద్ధి చెయ్యటం. దాని అభివృద్ధికి నాగరికత ఏమాత్రం తోడ్పడుతున్నది? పదార్థవిజ్ఞానశాస్త్రం, రసాయనశాస్త్రం, ఇంకా తదితర శాస్త్రాలూ అభివృద్ధిపొంది పంచేంద్రియాల లోటుపాట్లను సక్రమంగా నిరూపించి మనస్సును వాటి దాస్యంనించి తొలిగించాలని ప్రయత్నంచేస్తున్నమాట

వాస్తవమే. 'అదుగో సూర్యోదయం' అంటుంది కన్ను. 'అయితే సూర్యుడుదయించి ఎనిమిదినిమిషాలైంది' అని లెక్కచేసుకుంటుంది మనస్సు. ఇందువల్లమాత్రం ఏం లాభంఉందని అడగవచ్చు నెవరైనా. చాలాలాభం ఉంది. మొదటిసంగతి, ఇటువంటి అభ్యసనంవల్ల మనసు జ్ఞానేంద్రియాల దాస్యవిముక్తి పొందటమేకాక సృష్టి యొక్క రహస్యాలను భేదించటానికి మానవ మనశ్శక్తి తగిన అభివృద్ధి పొందటంకూడా జరుగుతుంది. ఎప్పటికైనా సత్యాన్వేషణయొక్క గమ్యస్థానమదే— ఏదైనా ఉండటమంటూఉంటే. సత్యాన్వేషణకు మానవమృగం తగినపరికరాలు కలిగిలేదు. అయినా ఇంతకంటె తగినమృగం వచ్చేవరకూ ఇది అభివృద్ధి అవుతూ దానిరాక నిరీక్షిస్తూ ఉండటంకన్న గత్యంతరం లేదు.

ఇవి నిజంగా సత్యాన్వేషణకు అనుకూలమైన రోజులే. సందేహంలేదు. కాని మనం సత్యాన్వేషణను చుట్టూ తిరిగిపోతున్నామేమో అని నాకు గట్టిఅనుమానంఉంది. ఇన్ని టెలెస్కోపులూ అబ్జర్వేటరీలూ లేకుండా పూర్వులు అద్భుతమైన జ్యోతిశాస్త్రం నిర్మించారు. పెద్దపెద్ద యంత్రాలసహాయంతో చేసేపనులు బైరాగులల్లేవచ్చి మూలికలతోనూ మంత్రాలతోనూ చేస్తున్నారు. మనిషిలో ఎవరూ ఊహించని, ఎవరూ నమ్మని శక్తులు విదితంకాకున్నై. ఈ శక్తులన్నీ పరిపూర్ణత్వానికి వచ్చేవరకూ మరోమృగంయొక్కరాక అనవసరం. ప్రతిపదార్థమూ ఎలక్ట్రాన్ ప్రోటాన్లకలయికచేత కలుగుతున్నదని శాస్త్రజ్ఞులు ఊహిస్తుండగా, ఎక్టోప్లాజం అనేపదార్థం కనిపెట్టబడ్డది. దానిచేత చేయబడిన జుట్టు మామూలుజుట్టల్లేనే ఉంది. ఇతరపదార్థాలను కూడా ఎక్టోప్లాజం తయారుచేస్తుందని నమ్మబడుతున్నది. ఎక్టోప్లాజం మనం ఇంటిలోవాడుకునే ఉప్పువంటి అనేకపదార్థాలయొక్క కలయికవల్ల తయారవుతున్నది! ఇప్పుడు ఎలక్ట్రాన్ ప్రోటాన్లను ఏంచెయ్యాలి! శాస్త్రజ్ఞులని పేరుపెట్టుకుని బిరుదులుపొంది కులుకుతున్నవాళ్ళు ఇది 'స్పిరిచుయాలిజం'కు సంబంధించిన విషయమని ఎక్టోప్లాజంజోలికి పోకుండాఉన్నారు. ఈ పాశ్చాత్యనాగరికత పాశ్చాత్యదేశాలనూ వాటివెంట మనవంటి అర్భకులనూ తప్పుదోవను తీసుకుపోతున్నదనటానికి సందేహంఉందా? ఒక్క ఈవిషయంలోనేకాక ఇతర విషయాలలోనూ పాశ్చాత్యనాగరికత ఇట్లాగే ఉన్నట్టుకనిపిస్తుంది. మంచి తెలివిగలవాడు పదినిమిషాలలో చెయ్యగల తీర్మానం బ్రిటిషుపార్లమెంటు అయిదుసంవత్సరాలకు మించని కాలంలో చేస్తుందట! గోరుతో పొయ్యేదానికి గొడ్డలి—అదీ ఈ నాగరికతయొక్క పద్ధతి. ప్రపంచంఅంతటా రాజ్యాంగవిధానాల దగ్గిర్నించీ బట్టలు ధరించుకోటంవరకూ అసలు సూత్రాన్ని అర్థంచేసుకోకుండా మధనపడటంగా కనపడుతుంది.

ఉన్న నాగరికత ఒక్కరోజులో పొయ్యేదికాదు. ఈ నాగరికతలో అబద్ధానికి స్థానంఉంది.

'ఈరోగి జీవించే ఆశ వదులుకోండి!' అని డాక్టరు చెప్పదగిన పరిస్థితులు కలిగినపుడు ఆవిషయమై డాక్టరు చెప్పాలా అబద్ధం ఆడాలా అనేది నైతికసమస్య. ఆమాట అనటంవల్ల చావబోయేవాడికీ దగ్గిరవాళ్ళకూ చాలాబాధకలుగుతుంది. అబద్ధం ఆడితే రోగి చెయ్యవలసిన పనులు చెయ్యకుండా చావటం తటస్థించవచ్చును. అటువంటప్పుడు నాగరికత డాక్టరుచేత లౌక్యంగా అబద్ధం ఆడిస్తుంది. 'రోగి జీవిస్తాడని నాకు చాలా గట్టినమ్మకం ఉంది. ఎటుపోయి ఎటువచ్చినా కీడెంచి మేలెంచమన్నాడు. నేను మందివ్వగలను కాని ఆయుర్దాయం...' అటువంటప్పుడు నాగరికతయొక్క అభివృద్ధిలో చావుకుకూడా కొంతస్థానం ఇవ్వబడటం, ప్రతివాడూ చావును ధైర్యంగా ఎదుర్కొనగలగటం కూడిరావాలి. అంతవరకూ డాక్టరు అబద్ధాలాడవలసిందే. లేకపోతే ఎవరూ పిలవరు. లేదా ఆ స్థితిగతులలో డాక్టరుయొక్క అబద్ధాలకు మరోపేరు పెట్టాలి. ప్రస్తుతం అట్లాగే జరుగుతున్నది.

ఈవిధంగానే ప్రతి ఎసెంబ్లీ సెషనులోనూ, పార్లమెంటరీ సెషనులోనూ, ప్రతి వార్తాపత్రికలోనూ, ప్రతి మీటింగులోనూ, ప్రతి పుస్తకంలోనూ, ప్రతిచోటా, ప్రతివాడి చేతనూ, అన్ని సమయాలలోనూ

నాగరికతను సమర్థించటాని కబద్ధా లాడబడుతున్నై. మనం ఉన్న నాగరికతతో తృప్తిపడిపోయినామని సూచించబడుతున్నది ఇందు మూలంగా!

ఇవేకాక ప్రతి రాజకీయ రహస్యమూ ఒక అబద్ధం కింద నేను లెక్క వేస్తాను—అవసరమైన అబద్ధంఅనండి కావాలంటే; అన్ని అవసరమైన అబద్ధాలలోనూ ఇదొకటి. అవిధంగానే మనప్రవర్తనను కట్టుబాటుచేసే నియమాలన్నీ అబద్ధాలు. ఎదురుగా 'ఏమండీ'అంటాం. అవతలికి వెళ్ళిన తరవాత అతణ్ణిగురించి మాట్లాడుతూ 'గారు' తగిలించమని మనకూ తెలుసు, వాడికీ తెలుసు. 'ఏమండీ!' అనేది ఒక అబద్ధం. బాహ్యంగా అచ్చులో పేరు చివరతగిలించే 'గారు' అబద్ధం. ఇటువంటివి శత సహస్రాలు. వీటిని నేను ఖండించటంలేదు. అవి లేలేక పోవటం పెద్దతప్పుగాకూడా భావిస్తాను. నాగరికత ఎంత అసత్యాన్ని పురస్కరించుకునిఉందో మననిచేస్తున్నాను. ఇవన్నీ క్రమంగా తగ్గిపోవాలనికూడా అంటాను. అందువల్ల నాగరికత వెనక్కుపోతుందని సంశయంరావచ్చును. అట్లా ఎప్పటికీకాదు. అతినాగరికతా అసలు నాగరికతలేకపోవటం ఒక్కవిధంగానే కనిపిస్తయి స్థూలదృష్టికి. అడివిమనుష్యులూ తక్కువ గుడ్డలతో జరుపుకుంటారు పాశ్చాత్యస్త్రీలూ గుడ్డలు లేకుండానే జరుపుకుంటారు నాగరికత మనుష్యులచేత అటువంటిపనులు చేయిస్తుంది. ఈ గుడ్డలులేకపోవటం అడివిమనుష్యులలోనూ పాశ్చాత్య సౌందర్యవతుల లోనూ ఒకటిగానేఉందని ఒక్కనాటికి అనుకోరు వరూ. అట్లాగే ఇటువంటి చిన్నచిన్నసమస్యలు నాగరికతలేనప్పుడు అసలుండవు. క్రమంగా వచ్చిపడతై. కొంతకాలానికి మనం వాటిని అతిక్రమించి పైకి పోవాలి.

అబద్ధాన్ని విషంమాదిరిగా ఉపయోగించాలి. ఎంత పెద్దబాడ్యాని ఉపయోగిస్తే అంతవిలువ ఉంటుంది దానికి. పూర్తిగా బాధ్యరహితమైన నాగరికత ఎప్పుడు వస్తుందో ఏరూపంలోవస్తుందో ఊహించటం నా తలకు మించినపని.

—కొడవటిగంటి కుటుంబరావు.





# * శబరి

"పదిరెండేండ్లు గడచిపోయినవి. పదు మూడవయేడు కూడ గడచుచున్నది. జాడ లేదు నాతండ్రీ! మాగురువర్యులు మతంగ మహర్షులు చెప్పి వెళ్లినారు 'శబరీ! శ్రీ రాములు సీతా లక్ష్మణసహితులై వచ్చి యున్నారు. చిత్రకూటముకడ నున్నారు. క్రమముగా మన ఆశ్రమప్రాంతమునకు కూడ విచ్చేయుదురు. వారిని దర్శించి ముక్తి రమ్ము' అని. గురుదేవుని ఆజ్ఞ యింతవఱకు నెఱవేరలేదు. ఏ చిట్టడవుల దిరుగు చున్నాడో! చెప్పువారు లేరు. త్రిభువన సంచారిగదా యీ వాయుదేవుడు. 'మా రాముని జాడ నెఱుగుదువా?' అని ప్రతినిత్యము అడుగుదును జబాబుచెప్పడు. విశ్వ విహారులు గదా యీ పక్షిజాతముల: ప్రతినిత్య మడుగుదును 'మా రామయ్యను చూచి నారా?' అని బదులు చెప్పవు. ఎచ్చటనో మహోన్నతనగాగ్రముల నుండి పయనించి వచ్చుచున్నవిగదా యీ సెలయేఱులు. అను దినము విసువులేకుండ నడుగుదును వీనిని

* బాపట్ల స్త్రీహితైషిణీమండలి వార్షికోత్సవమున ఒక బాలికచే అభినయింపబడినది.

'మా రామచంద్రుని సమాచార మేమైన తెలియునా ?' అని ఇవియు చెప్పవు. ఏమి చేయుదును ? పదిరెండు వత్సరములనుండి బాగుచేయుచున్నా నీమార్గము మారా మయ్య వచ్చుటకు. అబ్బా! ఎన్ని కఠిన శిలలు! ఎన్ని వార్ధిముండ్లు! ఎన్ని చిక్కు పొదలు! ఎంత దుర్గమమైన దీబాట! ఎంత చక్కబఱచినాను! ఎంత స్నిగ్ధపఱచినాను! ఎంత సుగమము చేసినాను! ఎంతకాలము నుండియో యూడ్చి నీళ్ళుచల్లి శుభ్రపఱచి యుంచుచున్నాను రాముడు వచ్చి నిలుచుటకై యీకుటీర ప్రాంగణము. ఎన్నిదినముల నుండియో ప్రాతః స్సంధ్యల నలికి ముగ్గులు పెట్టి యుంచుచున్నా నీయరుగు రామస్వామి వచ్చి కూర్చుండుటకై, ఏపూట కాపూట మార్చిమార్చి యెన్నిరోజులనుండియో కట్టుచున్నా నీ చిగురాకు తోరణములు, ఈపువ్వుల సరములు, ఈపర్ణశాల వాకిట, ఎన్నాళ్ళనుండియో వినుగు లేకుండ తెచ్చియుంచుచున్నాను, గిరినిర్ఝరుల శీతలోదక మీభాండములలో. ఎన్నెన్ని సాంద్రారణ్యములో తిరిగితిరిగి మంచిమంచివి యేరి తియ్యతియ్యనివి రుచిచూచి నిత్యము తెచ్చి నిలువచేయుచున్నా నీ పుటికలలో యీ రేగుబండ్లు. ఆరామస్వామి విచ్చేయుడు! అందుకొనడు! ఎప్పటికైన నీ దీనురాలి కా శ్రీరామచంద్రుడన కాతిథ్యమిచ్చు భాగ్యమున్నదో! లేదో! యాత్నించి విఫలమైనవి మాత్ర మెన్ని లేవు అభాగ్యజన్మలు'

మాతోయ పిల్లలు నిత్యము నన్ను చూచి నవ్వుదురు, 'ఏమిఅవ్వా! కొంచెము నేవు కూర్చొనవు. పడుకొనవు. అన్నముతినవు. నీళ్ళుత్రాగవు. నిద్రబోవు. ఎవరో వచ్చెదరని యెల్లప్పు డడావిడిగా సిద్ధపడుచుందువు. తుదకెవ్వరు రారు. నిత్యమిటులే యైనను వినువు వేనటలు లేవేనీకు!' అని. పిచ్చి కొయ్యలు వాళ్ల కేమెఱుక. ఈ జలబిందువు నా మహాసాగరము జేర్పవలయుననియు, ఈచిఱుగాలి తరగ నామహావాయు తరంగములలో నైక్యమొనర్పవలయు ననియు, ఈ పరమాణువు నా బ్రహ్మాండములో కూర్పవలయుననియు, ఈఖండజ్యోతి నాయఖండజ్యోతిలో మేళవింప వలయుననియు, ఈ జీవాత్మ నాపరమాత్మలో లీనమొనర్ప వలయుననియు, ఈప్రాణి యెంత పరితపించుచున్నదో వాళ్ల కేమి తెలియును ? ఎన్నాళ్ళనుండియో చేయుచుంటినట పదిరెండేండ్లు: నిక్కముగా పదిరెండేండ్లు! ఏమంత దీర్ఘకాలము ? నాకొక్కటే సాధన! ఒక్కటే మూర్తి! ఒక్కటే ప్రాప్య వస్తువు! కాని ఆ పరమాత్మ కెంత సంసారజంజాటము! ఎన్నిజీవుల ధన్యము జేయవలయును; తన దర్శనమొసగి, ఎందఱు పతితుల నుద్ధరించవలయును; తన పాదరజము రాల్చి, ఎందఱు సాధుల పరితృప్తి నందించవలయును; వారి యాతిథ్యమును స్వీకరించి, ఎందఱార్తులను రక్షింపవలయును; వారి యిక్కట్టులను నివారించి, ఎందఱు దుష్టులను హతమార్పవలయును; లోకకల్యాణమెంచి స్థావర జంగమాత్మకమై చేతనాచేతన రూపకమైన యీ విశాల విశ్వమంతయు తనలో నిదే యైనప్పుడు ఎవరిని కాదనును ? దేనిని త్రోసివేయును ? ఏది వదిలిపెట్టును ?

ఒకనాడు మాగురుస్వామి నడిగితిని. 'రాము డెటువంటివాడు?' అని మనస్సుండబట్టక. గురుదేవులు నవ్వి 'అనంతాకాశమున నీలమేఘచ్ఛాయలతో దేలిపోవు తొలకరి మబ్బుల నెఱుగుదువుగదా. శబరీ! రాముడటువంటి దేహముగలవాడు. ఉదయభానుని లేత కిరణముల గిలిగింతలకు విప్పారు

తామర పూవులను జూచుచున్నావు గదా; అటువంటి ముఖముగలవాడు, శరచ్చంద్ర చంద్రికలలో విలసిల్లు తెలిసిగ్గు తేటలు తెలియును గదా; అటువంటి నవ్వులుగలవాడు. మధ్యాహ్న సమయమున నభోమధ్యమున వెలుంగు ప్రచండమార్తాండుని తీక్ష్ణత జూచుచున్నావు గదా. అటువంటి తేజము గలవాడు. ప్రాతః ప్రత్యూషసమయమునందల్ల నల్లనవీచు బిల్లగాడ్పులం జల్లదనం బెఱుగుదువుగదా! అంత చల్లని చిత్తముగలవాడు. ఇంకను ఏమిచెప్పుదును? శబరీ! ఆ నేత్రములు ప్రశాంత గంభీరములు: ఆహాస్తములు నిఖిల జగద్రక్షణ దక్షములు ఆ వక్షము లక్ష్మీ సరస్వతుల నృత్యపీఠము, ఆ కంఠము మేఘగంభీరము! ఆ హృదయమగాధసాగరము! ఆహాసము! ఆ తేజము! ఆ ఓజస్సు! ఆ పరాక్రమము! ఆ శాంతి! ఆ దాంతి! అసదృశము! అసాధారణము!' అన్నారు, గురుస్వామి పులకిత గాత్రులై, నాకు అర్థముగాలేదు. 'స్వామీ! అట్టి విశ్వరూపుని దర్శించడమెట్లు?' అన్నాను భయముతో, భక్తితో కరములు ముకుళించి. శబరీ! బీజమునందు వృక్షగుణములన్నియు గర్భితములై యున్నటులే సర్వము శ్రీరామచంద్రునియందు గర్భితములై యున్నవి, అది విశ్వరూపుని లీలామూర్తి యన్నారు. ధన్యోస్మి యనుకొని యానీలమేఘశ్యామల మూర్తి యాగమనముకొఱకు ప్రతీక్షించుచున్నాను. ఎప్పటికనుగ్రహించినను సరియే ఆయననే స్మరించుచు ప్రార్థించుచు గూర్చుందును బిడ్డలారా! పాడండి. పక్షులారా పాడండి వృక్షములారా పాడండి.

"రఘుపతిరాఘవ రాజారాం
పతితపావన సీతారాం
సుందరవిగ్రహ మేఘశ్యామ్
గంగాతులసీ సాలగ్రామ్
భద్రగిరీశ సీతారామ్
భక్తవత్సల సీతారామ్."

(బోయపిల్ల ప్రవేశించి శబరితో)

'అవ్వ! అవ్వ! ఎవ్వరో యిద్దఱు చక్కగానున్నారు. ఒకరు మేఘచ్ఛాయ, ఒకరు బంగారుఛాయ నారపంచలు కట్టుకొని నారు. జడలు ధరించినారు. చేతిలో విల్లమ్ములు పట్టుకొనినారు, నీవు బాగుచేసిన బాటవెంటనే సూటిగా వచ్చుచున్నారు. అదుగో! అదుగో సమీపించినారు.'

(కనులువిచ్చిచూచి లేచి శబరి) ఆఁ ఆఁ ఏమి! వచ్చినాడు నాస్వామి! నా బహుజన్మ తపః ఫలము! నాచిత్త జలజభృంగము. నా నీలమేఘశ్యామలమూర్తి నా శ్రీరామచంద్రమూర్తి వచ్చినాడు! రా! రా! రా! నాయనా! రా! ఆవెనుక వారెవరు? ఓహో! పరమభాగవతశేఖరుడు! నిరంతర భ్రాతృసేవాపరాయణుడు! ముద్దు తమ్ముడు, లక్ష్మణస్వామియా! రండి నాయనలారా! ఇరువురు రండి! రామా! ఇదిగో ఆవాహనము! ఇదిగో పాద్యము! ఇదిగో అర్ఘ్యము! ఇదిగో పీఠము! ఇదిగో పత్రము! ఇదిగో పుష్పము! ఇదిగో తోయము! ఇదిగో ఫలము. స్వీకరింపుము. తండ్రీ! సోదర సహితుడవై స్వీకరింపుము.

అన్యథాశరణంనాస్తి
త్వమేవ శరణంమమ.
త్వమేవ శరణంమమ.

'రఘుపతిరాఘవ రాజారాం -
పతితపావన సీతారాం,'

—కనుపర్తి వరలక్ష్మమ్మ.

# ౪. హిందూ గ్రంథాలయములు

బహు ప్రాచీనకాలమునుండియు హిందువులకు లిపిజ్ఞాన ముండినదనియు; ఈ దేశమునం దెన్నియో విఖ్యాతములగు విద్యాపీఠము లుండెడివనియు, దేశదేశములందును పేరుగాంచిన పండితులిచట నుండిరనియు నింతవరకును చెప్పియుంటిమి. ఈ ప్రకరణమున ప్రాచీన మధ్యయుగములనాటి హిందూ గ్రంథాలయములు వర్ణింపబడుచున్నవి.

## తక్షశిల

బౌద్ధయుగమునకు పూర్వము మన దేశమునం దభివృద్ధిచెందిన విద్యాపీఠములలో తక్షశిలావిశ్వవిద్యాలయ మగ్రగణ్యము. గౌతమబుద్ధుడు, చరకుడు, జీవకుడు మున్నగు మహాపురుషులిచట విద్య నేర్చిన వారిలో ముఖ్యులు. అర్థశాస్త్రమునురచించిన కౌటిల్యుడుగూడ నిచటి విద్యార్థియే. కొరియా, జపాన్, గ్రీస్ మున్నగు దూరదేశములనుండిగూడ నెందరో విద్యార్థు లీవిద్యాపీఠమున కేతెంచుచుండిరి. ఇచటి ప్రజ్ఞావంతులగు పండితులును, అమూల్యమును నిరుపమమునగు గ్రంథాలయము నీ విశేషముల కాకర్షకములుగనుండెవి. ఇచటి యాచార్యులును విద్యార్థులునుగూడ చక్కగ నిర్మింపబడిన పుస్తకముల నుపయోగించుచుండిరట.(1) విదేశీయ విద్యార్థులెందరో యిచటి గ్రంథములకు ప్రతులను వ్రాసికొని తమదేశములకు గొనిపోవుచుండిరి తక్షశిలా విద్యాపీఠమును గ్రంథాలయమునుగూడ క్రీ. పూ. 600—క్రీ. శ. 400. నడుమ వర్ధిల్లినవి.

## కాశి

పిమ్మట పేర్కొనదగినది కాశీవిద్యాపీఠము. నేటికిని కాశీ విద్యలకాలవాలమని ప్రసిద్ధినందియున్నది. ఇట నసంఖ్యాకులగు విద్యార్థులు నాచార్యులును ప్రాచీనకాలమునుండియు నివసించుచున్నారు. ప్రతి యాచార్యునివద్దను చక్కని గ్రంథాలయముండెడిది. విద్యార్థులు తమ యుపయోగమునకై వీనికి ప్రతులను వ్రాసికొను టాచారము. ఇట్టి తాళపత్రప్రతులెన్నియో నేటికిని పండితకుటుంబములలో గాంచనగుచున్నవి. ఒక్కొకవిద్యార్థి పండ్రెండుసంవత్సరములు కృషిచేసినగాని యొక శాస్త్రమును గూర్చియుండు వాఙ్మయమును గ్రహింపజాలడట. (2) ఇట్టి శాస్త్రములను రెండు మూడిటిని బోధించు గురువులెందరో కాశిలో గలరు. దీనినిబట్టి వారి గ్రంథాలయముల యొక్క ప్రాశస్త్యము తెలియుచున్నది.

## కాశ్మీరము

కాశీ వలెనే కాశ్మీరముగూడ నొకముఖ్య విద్యాపీఠముగ నుండుచు వచ్చినది. కల్హణ, బిల్హణ, క్షేమేంద్ర, భామహ, మమ్మటాది మహానుభావుల కయ్యది పుట్టినిల్లు. కాశ్మీర శారదాపీఠము జగద్విఖ్యాతము. అచటి పండితుల యాదరమునందిన విద్వాంసులు దేశమునం దెల్లెడలను మహాగౌరవము నందుచుండిరి. దక్షిణదేశమునందలి సంగమువలెనే యీ శారదాపీఠముగూడ నొకపండిత సమాజమనియు, కవి పండితులను, పాండిత్యమును విమర్శించి గౌరవించుటయే దాని ముఖ్యకర్తవ్యమనియు తోచుచున్నది. అనేక విద్యా వివాదములను సాగించి పరిష్కరించు నీ శారదాపీఠమునకు గూడ నుత్కృష్టమగు నొక గ్రంథాలయ మత్యవసరము. అందు సర్వశాస్త్రములకును సంబంధించినవే గాక నప్పుడప్పుడు గవిపండితులు విమర్శార్థమై బంపెడు

1. సి. ప్రతాపరెడ్డిగారు—గ్రంథాలయములు. పే 10.

2. బి. నారాయణరావుగారు—ప్రాచీన విద్యా పీఠములు 'కాశి'.

కృతులుగూడ నుండియుండవలెను. భారతదేశములోని యాధునిక గ్రంథాలయములలో నెల్ల సద్గ్రంథ్యములను భాండారములు కాశ్మీరమున నేటికిని గాంచనగుచున్నవి. (3)

### స్థానిక గ్రంథాలయములు

విద్యాపీఠములందును, పండితుల యిండ్లయందు నేగాక ప్రాచీన మధ్యయుగములలో మన దేశమునందు నగరములలోను దేవాలయములలోను గూడ నెన్నియో భాండారము లుండెడివి. ఇట్టివానిలో నేటి బిజాపుర మొకటి. పూర్వమీ పట్టణమునకు విద్యాపురమని పేరు. కల్యాణీ చాళుక్యరాజు లీయూర నొక చక్కని విద్యాశాలను నిర్మించిరి. అందొక భాగమున నొక గ్రంథాలయ ముండెడిది. దీని శిథిలములు నేటికిని గాంచనగుచున్నవి. (4) దేవాలయ భాండారములకు నాగర్ కోటలోని జ్వాలాముఖీ దేవళము చక్కని దృష్టాంతము. ఫిరోజ్ షా తుగ్లకు సైనికులీ యాలయమును ధ్వంసము చేయుచుండగా స్థానికు లెవరో సుల్తానుతో నీ యాలయమున నిరుపమమగు గ్రంథసముదాయముగలదని చెప్పిరట. అంతట సుల్తానా గ్రంథముల నన్నిటిని దెప్పించి, సవిమర్శముగ బరిశీలించి గొన్నిటిని తనతో రాజధానికి గొనిపోయెను. అందు గొన్ని యాతనియాజ్ఞచే పర్షియను భాషలోనికి దర్జుమా చేయబడినవి. దలెల్ - ఇ - ఫిరోజ్ షాహి అను గ్రంథము వీనిలో నొకటి. (5)

### రాజాస్థాన గ్రంథాలయములు

విద్యాపీఠములకు బిమ్మట రాజాస్థానము లీదేశమున గ్రంథాలయోద్యమమును వృద్ధిపరచినవని చెప్పవచ్చును. కవులను పండితులను పోషించి వారిచే వాఙ్మయసేవ చేయించుట రాజులకు ముఖ్య కర్తవ్యముగ నుండినది. స్వయముగ పండితులును రసికులునయి యుండిన హర్షుడు, విక్రమాదిత్యుడు, ప్రతాపరుద్రుడు, అనవేమారెడ్డి, కుమారగిరిరెడ్డి, సర్వజ్ఞ సింగభూపాలుడు, కృష్ణదేవరాయలు మున్నగు భూపాలుర కాలమున సంస్కృత వాఙ్మయమును, దేశీయ వాఙ్మయమునుగూడ సర్వతోముఖములుగ విస్తరించినవి. ఇట్టి రాజులు తమ పూర్వులును, సమకాలికులును, తాము రచించిన గ్రంథములనన్నిటిని సంపాదించి జాగరూకతతో రక్షించుచుండిరి. ఈ విధమున నేర్పడిన రాజాస్థాన గ్రంథాలయములెన్నియో మహమ్మదీయుల దండయాత్రలలో రాజులతోబాటు నశించినవి. అయినను కాదాచిత్కముగ గొన్నిమాత్రము నేటికిని మనకు లభించుచున్నవి. ఇట్టివానిలో క్రీ. శ. 11-వ శతాబ్దిలో ధారానగరము నేలిన భోజరాజు గ్రంథాలయము గణ్యము. (6) అనిహాల్ వాడ్ పట్టణములోని చాళుక్యచక్రవర్తుల పుస్తకభాండాగారము మరియొకటి. క్రీ. శ. 12-వ శతాబ్దిలో సిద్ధరాజ జయసింహుడు ధారానగరమును జయించి యచటి గ్రంథాలయములోని గ్రంథములనన్నిటిని గొనిపోయి, అన్హిల్ వాడ్ పట్టణములోని తన భాండారమునజేర్చెను. క్రీ. శ. 13-వ శతాబ్దమునాటి చాళుక్య విశాలదేవుని భారతీభాండారముగూడ ముఖ్యమైనదియే. నైషధీయ చరితముయొక్కయు, కామసూత్రముయొక్కయు మొదటిప్రతులీ గ్రంథాలయమునుండే మనకు దొరకినవి. అంతియగాక నేడు కాశీ విశ్వవిద్యాలయమున గాంచనగు రామాయణముయొక్క మొదటిప్రతిగూడ నీ విశాలదేవుని భాండారములోనిదే. తరువాత కాలమున నుండిన రాజులుగూడ గ్రంథములను సేకరించుటెడ విశేషమగు శ్రద్ధను వహించియుండిరి. ఆంధ్రదేశమునందలి గద్వాల వనపర్తి మున్నగు సంస్థానములవారలు నీ విషయమున పేర్కొనదగియున్నారు. ఈ సంస్థానములలో నమూల్యములును, నేటికిగూడ పండితుల దృష్టిపథమున బడనివియునగు

3. I bid 'కాశ్మీరము'.
4. Fergusson - Architecture at Bijapur p. 12.
5. N. N. Law-Promotion of Learning in Mahomadan Times p. 112.
6. Buhler - Indian paleography. p.99.

తాళపత్రగ్రంథము లెన్నియోగలవు.

అప్పుడప్పుడు ప్రభుత్వమువారిచే నియమింపబడిన లిఖితగ్రంథాన్వేషణముల నివేదికలమూలమున (Reports on the search for Manuscripts) నుత్తరదేశమున నేటికిని పూర్వకాలమునుండియు సాగుచుండిన రాజాస్థాన భాండారము లెన్నియోగలవని స్పష్టమగుచున్నది. ఆల్వార్, బికనీర్, జమ్ము, మైసూరు, తంజావూరు, జయపురము, నేపాల్ మున్నగు చోట్లగల గ్రంథాలయములిట్టివి. జయపుర రాజగు సవాయి జయసింగు తన గ్రంథాలయము నెన్నియోవిధముల నభివృద్ధిపరచెను. అతని సంతతివాడగు నొకరాజు సైభాండారమును గొంతవరకును పాడుచేసెను. అయినను నేటికి నిలచియున్న యీ భాండారమే రాజస్థానమునందెల్ల నగ్రగణ్యమైయున్నది. జోధ్‌పూరు మహారాజావారి గ్రంథాలయములో 1800 లిఖితగ్రంథములు ననేకములగు సంస్కృతముద్రిత గ్రంథములునున్నవి. బికనీయరు సంస్థానమున 2000 సంస్కృతగ్రంథములును, ఆల్వారులో సంస్కృత, పర్షియను, అరబ్బీ, లిఖితగ్రంథములును, గలవు. రాజపుత్రస్థానమునకు బిమ్మట పేర్కొనవలసినది కాశ్మీరము. ఈ దేశము నేలినరాజులు పూర్వికులు [illegible]లనుగూడ గ్రంథములను సేకరించుటయందును రక్షించుటయందును మిక్కిలి యభిరుచిని గలిగియుండిరి. కాశ్మీరరాజ గ్రంథాలయము చాలభాగము జమ్ములోనున్నది. దానికి డాక్టరు బుహ్లరుగారొక పట్టికను తయారుచేసిరి. ఈ కాశ్మీరగ్రంథములలో రెండు ముఖ్యలక్షణములు గాంచనగుచున్నవి. వాని నిర్మాణపద్ధతి మిక్కిలి చక్కనిది. రెండవ విశేషము వానిలోని సంస్కృత గ్రంథములు సచిత్రములయియుండుట. నేపాళసంస్థాన భాండారము భారతీయ సంస్కృత గ్రంథాలయములలో నెల్ల ప్రాచీనతమము. ఇందలి పుస్తకములుకొన్ని గుప్త చక్రవర్తులనాటివి. వీనిలో గొన్ని తాళపత్రములమీదను, కొన్ని గాగితములమీదను వ్రాయబడినవి. వీనిసంఖ్య 8000 కు మించియున్నది. రాజుల జాగరూకతకు దేశపు శీతోష్ణస్థితి తోడగుటచే నీకాశ్మీర గ్రంథములు చక్కనిస్థితిలో నున్నవి. దక్షిణహిందూదేశమున ఆంధ్రనాయకరాజులచే స్థాపింపబడి పెంపొందింపబడిన సరస్వతీ గ్రంథాలయము కాశ్మీరరాజ భాండారమున కెనయగును. ఇండియా ప్రభుత్వమువారిచే నిందలి గ్రంథముల కొక పట్టికను తయారుచేయుటకై నియమింపబడిన డాక్టరు బర్నెలుగారు 'ఈ గ్రంథాలయము ప్రపంచములో నెల్ల పెద్దదియు, ముఖ్యమైనదియు' నని వ్రాసియున్నారు. క్రీ.శ. 16-17 శతాబ్దులనడుమ తంజాపురము నేలిన ఆంధ్రనాయకులు వేనవేలుగ గ్రంథముల నిందు చేర్చి సంరక్షించిరి. వారికి బిమ్మట నధికారమును నెరపిన మహారాష్ట్రరాజులు నీయుద్యమముల నభివృద్ధిపరచిరి. నేడిచట గాంచనగు పుస్తకములు 18000 లకు మించియున్నవి. ఇవి పదకొండు లిపులలో వ్రాయబడినవి. ఈ గ్రంథసముదాయముయొక్క విలువనుగూర్చి డాక్టరు బర్నెలుగారు 'సంస్కృతగ్రంథములన్నిటికిని పాఠాంతరములున్నవని నేటికి స్పష్టమైనది. తంజాపుర గ్రంథాలయమున నింతవరకును మనకు దెలిసిన పుస్తకములకును, మరికొన్ని క్రొత్తవానికిని గూడ నకళ్ళుగలవు. ఇట్టి విపులమగు సముదాయమును నిర్మించుటకు 50000 పౌనులు అనగా నేడులక్షల ఏబదివేలరూపాయలకు తక్కువగాదని నాకు తోచుచున్నది.' అని వ్రాసియున్నారు. దీనినుండి యీ పుస్తకభాండారము యొక్క మహాత్వము స్పష్టమగుచున్నది.

## వ్యక్తిక గ్రంథాలయములు

ప్రాచీన మధ్యయుగములలో మనదేశమున వ్యక్తిక గ్రంథాలయము లెన్నియో యుండెడివి. ఈవిషయమున కాశ్మీర మగ్రగణ్యము. తరతరములనుండియు రక్షింపబడుచు వర్ధిల్లుచుండిన కుటుంబ భాండారముల నెన్నిటినో నేను సౌరాష్ట్రమున జూచితిని. పూర్వకాలపు వాఙ్మయమున వీని ప్రశంస యరుదుగానైనను గన్పించుచున్నది. అల్లసాని పెద్దన కాకవులు తమ పూర్వులు రచించిన తాళపత్ర గ్రంథములనుండి యనేక విషయములను సంగ్రహించి స్వకీయములుగా వానిని లోకులకు దెల్పుదురని తన మనుచరిత్రమున వ్రాసి

యున్నారు, గ్రంథములకు అగ్ని, శైథిల్యము, స్థానచలనము, చౌర్యమునను నాలు గాపదలుండునని తెనాలి రామకృష్ణకవి తన పాండురంగమహాత్మ్యమున చెప్పియున్నాడు. తామ్ర శిలాశాసనములలో కడపటి భాగమున దాత తానొసర్చిన ధర్మము రక్షింపకలేవని వేసినట్లే, పూర్వులు తాము కష్టపడి వ్రాసిన గ్రంథముల చివరభాగమున భావిపాఠకుల నుద్దేశించి 'ఓయీ! నడుమును కాళ్ళునులాగ, మెడలుపడిపోయి కండ్లు మండునట్లుగా నేను కష్టపడి వ్రాసిన యీ గ్రంథమును జాగ్రతగా రక్షింపుము' అని హెచ్చరించియున్నారు. ఇట్లు తీరికవేళలో మనపూర్వులు వ్రాసిన గ్రంథములెన్నియో నేటికిని పల్లెలలో గానవచ్చుచున్నవి.

ప్రాచీనకాలమునుండి నేటివరకును నిలచియున్న వ్యక్తికగ్రంథాలయములు ఉత్కృష్టములగు నిదర్శనములు కొన్నిగలవు. మైసూరు ప్రభుత్వమువారి ఆర్క శాఖోద్యోగియగు పద్మరాజ పండితునియింట నాయన పూర్వులు సేకరించినవియు, నాయన చెన్నపురి రాజధానిలోను, సింహళమునను సంపాదించినవియునగు ప్రాచీనగ్రంథము లెన్నియో యున్నవి. మైసూరు రాజ్యములోని జైనపండితులవద్ద చక్కని భాండారములున్నవి. మైసూరులోని వీరసంగప్ప, కరిబసవశాస్త్రి, మల్లప్ప యనువారివద్దను, దేవనగరెలోని హలువీరప్ప యనువారివద్దను ప్రాచీనవీరశైవ గ్రంథము లెన్నియో పదిలపరుపబడియున్నవి. అట్లే మైసూరు రాజబంధువులగు దళవాయి దేవరాజఉర్సు, నంజరాజ బహద్దూర్, లింగరాజఉర్సు అనువారును చక్కని ప్రాచీన గ్రంథాగారముల కధిపతులై యున్నారు.

—మారేమండ రామారావు ఎం.ఏ బిఇడి.

# అద్దాల్లో బిడ్డలు

అథంతుథం ఎరగని అద్దాల్లో బిడ్డలఅచ్చుట్లు ముచ్చట్లు అమితానందాన్ని, ఆపాదిస్తాయి అనడం ఆక్షేపణీయమైన అంశముకాదు.

అప్పుడూ, ఇప్పుడూ అనకుండా ఎప్పుడూ, ఆడేమాటకి, పాడే పాటకి, చేసే చేతకి, సాగేనడకకి, ఒహాటేమిటి అన్నింటికి అద్దం తగిలే యీ అమాయక హృదయాల చర్యలకి, అదరిద్దామన్నా, ఆధారం కనబడదు.

అంతలో మితిమీరిన ఆనందం—అంతలోనే అంతులేని దుఃఖము—మరి కాస్తలోనే తీరని పట్టుదల—అంతలోనే రాజీ. యిన్ని అందచందాలుగల భావాలు, అప్పటికప్పుడు, ఆకూనలకే అనుకూలపడాలి కాని, అద్దంముందు అనుకున్నంతసేపూ నిలబడి, అమర్చుకోడానికి ఎన్నిపాట్లు పడ్డా ఏమీ అతకవు ఎంతవాళ్ళకైనా.

శరీర మార్దవం—వచ్చీరాని మాటల మృదుత్వం—తెలిసీ తెలియని చేతల చురుకు—ఆటల ఆనందం. అన్నింటికంటె మించిన సహజమైన అనుకరణశక్తి, ఓదాని కింకొకటి సాయపడుతూ, అందాన్ని కూరుస్తాయి: దాని అనుభవంలేని జీవులు దురదృష్టవంతులని చెప్తారు పెద్దలు. పైగా నాగరికత—దానితో మూర్ఖత్వం—దానితో అహంభావం ఏకమయి మూలనున్న, ఉపయోగంలేని కుక్కిమంచం కోడులోకూడా, బలవంతంగా, దూరుతూన్న యీదినాల్లో ఆ ఆనందం మన ప్రయత్నంలేకుండానే మాసిపోయి పుచ్చుకి మందులోకయినా దుర్లభమైపోతూంది కాని విచిత్రభావనా కల్పనాలు అసాధుజీవులలో మాత్రం గైరు హాజరు కావడంలేదు కారణం ఏమిటంటే ప్రపంచ వాసనలు వాళ్ళని యింకా ఆవరించవు.

* * *

మాశాస్త్రిల్లు ఒక్కడే కూర్చున్నాడు అరుగుమీద, చిట్టిపాదాలు క్రిందకిచాచి,

ఆడించుకుంటూ, ఆనందిస్తూ. లేతనవ్వు తొంగలిస్తూంది. చిన్న ముంగురులు, గాలిలో కెరటాలు కొడుతున్నాయి. అరుగుకింద వాళ్ళ తువ్వాయి పరకలు కొరుకుతూంది. నమిలేడప్పుడల్లా మూతితో శాస్త్రిల్లు పాదాల్ని తాకుతూంది నేస్తం కలుపుకోడానికి కాబోలు. గట్టిమూపులతో దాన్ని బిగ్గా కట్టేస్తున్నాడు తనపాదాలకి దాని మూతి తగిలినప్పుడల్లా ఇట్టే పైకిలాక్కుంటున్నాడు. మళ్ళీ సమయంకొద్దీ క్రిందకి జారవిడుస్తున్నాడు, చికిలుస్తూ, దాని జతఉండడానికి అంగీకరిస్తున్నట్టుగా.

• • •

"శాస్త్రిల్లూ! తలకిచమురురాస్తాను, రా! నాయనా"

"మ్నా! తువ్వ.........ఊ... ..."

"తువ్వాలేదు గివ్వాలేదు, రా! నాయనా! నూసిరాసి వెళ్లాలి"

"అద్దు...."

"ఏడిశావ్. వెధవ పెంకితనం నువ్వూను - వస్తావా? రావా?"

"అను...పో." చేతులు తిప్పుతున్నాడు-చిరాకు మొఖంలో కనబడుతూంది.

"బిస్కట్టు యిస్తారా - మానాయన రావోయ్—రా, బాబూ!"

"అక్కల్లే..."

"డబ్బివ్వనా?"

"ఊ... ..."

"బంతి యిడుగో - రా"

"........"

"తాయిలం యింద...."

"... ...." శాస్త్రుల్లు గొల్లుమన్నాడు. కాళ్లా, వేళ్లా నిలబడకుండా:

• • •

"ఎందుకు వాణ్ణి అలా ఏడిపించడం?"

"వేలిడున్నాడో లేదో; చూడండి! యింత పిసరుమాట చెవికెక్కించుకోడు—వెధవపెంకితనం వీడున్నూ."

"వాడు నీమాట చెవికెక్కించుకోలేదని నీమొహం ముడుచుకున్నావుకాని, వాడు చేసేపని నీకళ్ళకి ఏమైనా కట్టినట్టు అనుమానం ఉందా?"

"ఆ....ఆయనా, మీరూ, చేసేపనులు చూస్తూ కూర్చుంటే, కడుపు నిండిపోతుంది"

"అంతే - ముద్దూ ముచ్చటా ఎరగని మొద్దు మొహాల మూర్ఖత్వం యిలాగే ఉంటుంది - తోచదు-చెపితే తలకెక్కదు సుఖంగా ఆడుకుంటూన్న వాణ్ణి యిట్టే 'అలో' మనిపించావు వాడి సంతోషాన్నిచంపి!"

"నాన్నా!....ఉ...అమ్మ... తూడు—తువ్వ...."

నాకూడా గిర్రునతిరిగాయి నీర్లు కళ్ళల్లోంచి-చేతుల్లోకి తీసుకున్నాను శాస్త్రిల్లుని

"అమ్మ - కొత్తి...తువ్వ"

శాస్త్రిల్లుని ఓదార్చాను-తల్లి కేసిచూచి, ముత్యాలు కారుతూన్న కళ్లతో, సగం చూపు చూస్తూ 'హంయ్' అని చెయ్యి విసిరాడు తల్లి కేసి.

"ఓస్, అబ్బా! ఏంపౌరుషం" * * *

చంకలు బాదుకుంటూ, కిచకిచమంటూ "అమ్మా!....తువ్వ" గిన్నెలోని బువ్వను చూపుతూ తల్లి "తువ్వాయి బువ్వ తింటూంది నువ్వుకూడా 'ఆమ్ము' తిను; నాయనా!

"అమ్మా - తువ్వ ...బువ్వ" అంటూ పరకలు దూడకి అందిస్తున్నాడు శాస్త్రిలు

తువ్వా, తనూ, బువ్వతిన్నారు, అమ్మా తనూ రాజీపడి. నేనూ ఆవిడా నవ్వుకున్నాము.

—కడియాల కామేశ్వరరావు

# కీటకములు - మానవుడు

## ౨

మానవ సృష్టితో కీటకములకు మానవ సంబంధవర్గములు కేవలమని తెలిసికొనియున్నాము. అనుకూలములు, ప్రతికూలములు, తటస్థములు.[1]

అనుకూలములగు కీటకములలో పారిశ్రామికములగు లాభదాయకములు పెక్కులున్నవి. వానిలో లక్క పురుగు, పట్టు పురుగు, తేనెటీగ ముఖ్యములు. పలువిధములగు విరోధకత్తులు తయారుచేసికొనుట కుపయోగించునట్టి లక్కను మూలముగ లక్క పురుగులును, అమూల్యాంబరములకు కావలసిన పట్టునిచ్చు పట్టు పురుగులును, మధుకరములుగూర్చి మనకిచ్చుచుండుటచే తేనెటీగలును మానవులు ఉపకారకృతజ్ఞులై యుండవలసినదే. మానవసంఘమంతయును ఉపయోగించకపోయినప్పటికి కొంత భోజనాభిలాషులకు పలువురకు కొన్ని కొన్ని కీటకములు రుచించుచున్నవి. ఉసుళ్ళు, మిడుతలు, చీమలు తిండిగ తినుచున్నవి. కొన్ని దేశ్యపురుగులు ఔషధములుగ మందులలో వాడబడుచున్నవి. కొంతకాలము పెంచుకొనుటకు తుమ్మెదలనూ, దృష్టిమాంద్యమును పోగొట్టుటకు దీపపు దోష్యపురుగులతో తయారైన కాటుక వాడేవారట. కీటకములను పంటలకు ఎరువుగ వాడబడుచున్నది. భారతీయ గ్రామకములను ఔషధములపై ఆధారపడిన దినములున్నవి. అంతియే కాదు; మానవుడు ఉత్కృష్టములపై ఆధారపడవలసియుండుటచేత, వృక్షములు గర్భధారణమునకు కావలసిన పుప్పొడి చెట్టుచెట్టునకు, మొక్క మొక్కకు, మార్పుటలో సహాయములగు కీటకములను మానవుడు యింకా పనిచేయుచున్నారు. ఈ కీటకములను పెంచి వాని సహాయ్యమున తన పనులకు కార్యములు చేయించుకొనుచు తేనెపు మానవుడు సివృద్ధిచేసినదే గడించుచున్నాడు. మానవుడు తెలివిగలవాడగుటచేత మిత్రభేదతంత్రమును ప్రయోగించి, తన కీటకవిరోధులపై పెట్టుచున్నాడు. మానవయుద్ధములలో ఉపయోగింపబడు విషవాయువు 'ఫాస్జిన్' అని 'క్లోరోపిక్రిన్' అని, 'డయిఫినైల్' అని రెట్లు మనుష్యులపై పెట్టుచుండినట్లు, అట్టే మిత్రభేదమార్గములను మానవుడు 'ప్రతిరోధము' (బయొలాజికల్ కంట్రోల్) అను పేరున స్వీకరించుచున్నాడు. ఇది గాక, కలుపు మొక్కలను నిర్మూలించు కీటకములను, మలినపదార్థముల నిర్మూలించు కీటకములను, మానవుడు తన మిత్రవర్గములో చేర్చుకొనియున్నాడు. చేర్చుకొని తన తెలివిని సార్థకపరచుకొనినాడు.

అయితే మానవ విరోధులగు కీటకముల విషయమై మానవుడు పడు శ్రమ యింతంతగాదు. ఒక్క దోమ కాటువలన పెంచి మానవసంఘమెట్టి కష్టనష్టములు చేసికొనవలయునో చూడుడు! కొన్ని సామ్రాజ్యములలో గృహములందలి ప్రతిద్వారము, కిటికీలను దోమలు రానట్టి తెరలచేత కప్పబడియుండును. సాయంత్రము దాటినప్పుడు బయటకు రానీయుటకు అరలేదు. నగరములు తమ గృహములలోనూ, దోమతెరల మాటున నిదురించవలసినదే! ఈ భయము, యీ ధనము, యీ ఆర్భాటము ఒక్క దోమజాతికి పెంచి! మానవులు దాగిన రోగులకేమి అపారముగదా! మానవుల పెంపును అంతటను అన్నిటికదా! వాని పెద్దను కీటకబాధనుండి తప్పించుకొనుటకు! ఇట్టి యుదాహరణలెందులకన కీటకములు మనకు చేయు నపకారము స్థూలముగా వ్యాఖ్యానముగ చెప్పుటకే. కీటకములలన మానవునకు కష్టమేలాగన్ని చెప్పుదుమట్లా!

మానవునకు సంక్రమించు వ్యాధుల ధనపుకరోగములు లేక కీటకములు ప్రశాంతకారణములని యెంచవలసి యున్నది; కొనకొనబడుచున్నది. విషకారకరోగము,

---

1 భాగము జనవరి సంచికయందు చూడవలెను. అందు కీటక వర్గీకరణము 'అనుకూలములు' అను దానికి 'ప్రతికూలములు' అనియు, ప్రతికూలములను అనుకూలములనియు దిద్దుకొనవలయును.

మలేరియా చలిజ్వరము, నిద్రారోగము, ప్లేగు, టైఫాయిడ్ మొదలగువానికి కారణములగు సూక్ష్మజీవులను, దండికలను, మానవులకు తమ కాటులమూలమున సంక్రమింపజేయునవి కీటకములే. అసలు విరోధులకంటె, మధ్యవర్తులగు కీటకములు మానవునకు ప్రబలవిరోధులు, ఇట్టి రహస్యములను కనుగొనుటకై శాస్త్రజిజ్ఞాసులు పడినపాట్లు, కీటకములతో పోరినపోరులు, మానవ మానవపోరాటములను మఱపించివేయునేమో!

ఈతి బాధలలో కీటకపీడ యొకటి. కారుమబ్బులరీతి ఆకాశమున తిరుగుచు, మిడుతలదండ్లు రాత్రివేళల పంటల దుంపనాశన మొనర్చి, తెల్లవారులోపల అదృశ్యములగుచుండుట దలచి మానవుడు విచారపడగలుగును గాని, యేమైన చేయగలుగునా? ఈ మిడుతలదండ్లు రైళ్ళసైతము ఆపివేయగలిగినట్లు మనము పత్రికలలో చదువుచునేయున్నాము. మహారణ్యముల నిర్మూలించు కీటకలార్వాలను (గొంగళిపురుగులు) ధ్వంసమొనర్చుటకై మానవులు విమానములపైనుండి విషవాయువుల గుప్పించి చేయుచున్న కృషికి తగిన ఫలము మానవున కింతవఱకును దొరకలేదనియే చెప్పవలయును.

హిందువులలో నొక నమ్మకగలదు. రాజు, మంచి వాడు కాకపోయిన, యీతిబాధలు (కీటకపీడ దానిలో నొండు) కలుగునని నమ్మకము. అది యెంతవఱకు నమ్మదగినదో గాని, ఎక్కువగ కీటకపీడలు 'ప్రకృతిలోని తులామానమువంటి నిశ్చలత' (బ్యాలెన్స్ ఆఫ్ నేచర్) తారుమారగుటవలన కలుగుచున్నదని శాస్త్రజ్ఞుల సిద్ధాంతము. ఈ సమభారప్రకృతిలో నొడుదుడుకుల గలిగించు వారిలో మానవుడు ముఖ్యుడు. అడవుల నఱకి భూమ్యుపరితల నైసర్గికస్వరూపమును మార్చుట, కీటకాహారులగు జంతువులను పక్షులను వేటాడివైచుట, మొదలగునవి మానవుని కృత్యములే. పరదేశీయములగు జంతువృక్షములను దేశీయములుగ నొనర్చుకొనవలయు నన్నకోరిక మానవునకు మెండు. అందుచే అటనుండి యిటకు, యిటనుండి అటకు, ఉద్భిజ్జముల నైతే నేమి జంతువులనైతే నేమి మానవుడు రవాణా చేయుచున్నాడు. దానిఫలితము ప్రకృతిలో తారుమారు; ప్రబలారిష్టములగు కీటకపీడలు, తదితరపీడలు. మానవుడిట్లు చేయుటలో సద్బుద్ధితోనే మెలగవచ్చును. కాని ప్రకృతి ధర్మముల ననుసరించి దాని దుష్ఫలితము సైతము వెంటనంటియేయుండును. ఒక్క ఉదాహరణము, మొదట మనదేశమునకు రంగుకొఱకై 'కొచినియల్' అను కీటకము తేబడియెను. దాని పెంచుటకు నాగుజెముడు. పిమ్మట కొచీనియల్ రంగుపరిశ్రమ క్షీణించిపోయెను. కాని నాగుజెముడుమాత్రము హద్దు అదుపులేక పెరిగి, దొడ్లను యిండ్లను సైతము కలయప్రాకి పెద్ద ఆటంకమగుటచే, ప్రస్తుతము మఱల కొచీనియల్ పురుగు దానిపై ప్రయోగింపబడినది. ఈ కీటకమునకు నాగుజెముడు బలిచాలక యెక్కడ పంటలపీడగా తయారగునో యని రైతులకు దిగులులేకపోలేదు; కీటకపీడలు దేశమున వ్యాపించకుండుటకై మానవులు 'క్వారంటైన్' నిబంధనలు, చట్టములు, శాసనములు చేసుకొనియున్నారు. అయిననేమి! నేటి ప్రయాణసౌకర్యములు, సులువులు, కీటకములు సైతము వినియోగించుకొనుచున్నవి. దేశదేశముల నెడబాప సముద్రముండినను, కీటకవ్యాపకము జరుగుచున్నదనుటకు నేటి స్టీమరులు, యెగుమతి సరుకులు, ముఖ్యముగ మానవుల అలక్ష్యభావము కారణములుగాక మరియేమి? మూడు సంద్రాల మధ్యనున్న యిండియాలోనే పరదేశ కీటకపీడలవలన అమితనష్టము చేకూరినది. ఇట్టి కీటకపీడల వలన నష్టపడిన దేశములలో అమెరికా మొదట చెప్పదగినది. అచట స్థాపించబడిన 'కీటక పరిశోధన బ్యూరో' పాలనకు 60 లక్షల రూప్యముల వెచ్చించి పనిసాగించుచున్నది. అయితే కీటకములనుండి ప్రతి పంటకుగలుగు నష్టము ద్రవ్యరూపమున అంచనావేయుటకు వీలుకాదనియే తలంచవలసియున్నది.

మానవ కీటక పోరాటము నిరంతరము సాగుచునే యున్నది మానవుడు తన తెలివితేటలతో ప్రాతవిరోధుల తుదముట్టించులోపల వేరొండు నూతనశత్రువు తారసిల్లుచున్నట్లు కనుగొనుచున్నాడు. కీటకపీడా నివారణకైయును, నిరోధమునకైయును, నేడు మానవుడుపయోగించు ప్రయోగముల క్లుప్తముగ తెలిసియుండ

వలసినదే. గృహములను కీటకములకు దుర్గమములుగ కొనర్చుట, పొలములలోని కలుపు మొక్కలను, మోళ్ళను (మొదళ్ళు) ఎప్పటికప్పుడు పెకలించి కీటకములకు నిలువ నీడలేకుండజేయుట, చావడులలో పశువుల మలమూత్రములను తగురీతి జాగ్రత్తపరచి, కాలల శుభ్రముగనుంచుట; భూముల లోతుగదున్ని, గట్టుల పెళ్ళగించి, కీటక గుట్టుమట్టుల సూర్యరశ్మికి బహిరంగపరచుట, పంటమార్పు, మిశ్రమపంటల పద్ధతు లవలంభించుట, దివ్వెలవెలిగించి కీటకముల నాకర్షించి వాని నిర్మూలించుట, 'మోసపుపంటల' వేంచి ముఖ్య పంటలకు కీడు తగ్గించుకొనుట, విషౌషధములను, విష వాయువులను ప్రయోగించి కీటకనిర్మూలనమొనర్చుట, దాపుడు వస్తువులను శాస్త్రీయపద్ధతుల ప్రకారము పరిశుభ్రపరుపబడిన కొట్లలో, కుండలలో పాత్రలలో దాచుకొనుట మొదలగు నెన్నెని స్వరక్షణ శత్రుభక్షణ మార్గములను మానవు లవలంభింపవలసియున్నది! అవలంభించుచునే యున్నారు.

* * *

అయితే యీ అసంఖ్యాక కీటకజాతిని మానవ జాతిని, పలువురు శాస్త్రజ్ఞులు యెట్లు పోల్చియున్నారో కనవగును. కొందఱు శాస్త్రజ్ఞులు కీటకములను మానవులతో పరిపోల్చిరి. మేటర్‌లింక్ అను శాస్త్రజ్ఞుడు కీటకములు మానవులను మించిన తెలివి తేటలుగలవని అభిప్రాయపడెను. కొయ్యను, కాంక్రీటును (గచ్చు) తిని జీవించగల చెదలు, మానవునికంటె తెలివిగలవనియే అతని సిద్ధాంతము. కాని పలువురు దానికొడబడరు. మఱికొందఱు మఱింత విచిత్రముగ దలంచిరి. మానవుని నాగరికత హెచ్చుకొలది మానవ సంఘముసైతము పిపీలికసంఘమువలె (ఒక నాగరిక కీటక సంఘమువలె) తయారగునని వారియూహ. ఏది యెట్లయినను, జూలియన్ హక్స్లీ చెప్పినట్లు, 'మానవుడు తన ప్రకృతి ననుగుణముగ, నూతనవిషయముల కనుగొనుటకు శక్తిగలిగియున్నాడు; నూతనసృష్టి కారితీయగలడు; స్వర్గమునకగు నేర్పుకలిగి తనను తాను నడుపుకొనగలడు. ఇది కీటకముల కసాధ్యమైన విషయం!'

కాని మానవు లొక్కటిమాత్రము మరువరాదు. మానవుడు తగిన కట్టుదిట్టముల నుండకపోయినచో కీటకముల ముందాతని పనియేమి కావలయునో! పరాకు! పరాకు!!

—జాగు గోపాలరావు.

---

# నీ నా బ్రతుకులు

౧

ఎండి మండెడు గొంతునే యెత్తి సురల
పాడలే నింక నా పాడుపడినగాథ;
శరత్కాల చంద్రిక కించుకంత
నాల్క తడివారె, తియ్యదనమ్ము లూరె
పాడబో నింక నా పాడుపడిన గాథ!

౨

పసనదన ముట్టిపడునో యీ కరకుచేత
తాకితినయేని తొలిసారి తావకీన
మృదుకపోలమ్ము, చెలియ, వర్షించునేమొ
అరుణ సలిలోష్ణధారల నయ్యొ బ్రతుకు
వెరపు గదిరిన యూసరవెల్లి యాయె!

౩

ఎడపెడల కాలగతికిచే బడియు తుదకు
గాలిబ్రతుకైతి నిది, నీది కరుణకొఱకు
ప్రేమకొఱ కేడ్చు బిత్తరిలేడి బ్రతుకు;
నవ్వు లిడుదుము మన మీ ప్రపంచగోళ
బహిర నవ్యస్థలాలకు బ్రమసి యెగసి!

—రెండుచింతల లక్ష్మీనరసింహశాస్త్రి.

# కాకి

(నా, పరిశోధన)

కాకంటే చాలా నీచంగా నూస్తుంటాం కాని సృష్ట్యాదినుండీ కాకి మనకు సాంఘికంగా ఆధ్యాత్మికంగా చేస్తూవున్న సేవ చాలా ఘనమైనదని వొప్పుకోక తప్పదు. దైవభక్తిలోనూ, విశ్వమానవ సేవాపరత్వంలోనూ, సర్వపక్షి సౌభ్రాతృత్వంలోనూ కాకి కీడైన వ్యక్తి ప్రపంచంలో లేదు. అల్లాంటివ్యక్తిని అగౌరవంగా చూడటం అన్యాయం, పాపంకూడాను. ఎంత తపస్సు చేసినా యెన్ని నోములునోచినా, ఆ పాపంపోదని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి.

కాకిలో సాంఘికంగా యేమి వుత్కృష్టతవుందని అడుగుతారేమో చదువరులు. మనరోడ్లు ఊడిచి, చెత్త ఎత్తి దొడ్లుబాగుచేసే పాకీవాళ్ళసేవకంటే కాకిసేవలో వేయిరెట్లు వుత్కృష్టత వుంది. అదంతా నిజమైన నిష్కామ్యకర్మని వెల్లడిస్తుంది. దాన్ని గ్రహించడంలో నేవుంది మజా అంతాను. పాకీవాళ్ళంటే, సేవకు ప్రతిఫలంగా కొద్దిగానో గొప్పగానో డబ్బు పుచ్చుకుంటారు. అంటే వాళ్ళసేవను దుకాణంమీదపెట్టి అమ్మేసిన ట్లమ్మేస్తారన్నమాట. మరి కాకో స్వప్రయోజనరహితమైన సేవచేస్తుంది. నిజంగా ఆసేవ మహాత్ములు అంతగా మందికోసంచేసే సేవలా కనబడుతుంది. ఇందులో వున్న పరోపకారబుద్ధి కాకి ముఖాన్నిచూసి ఊహించవలసినవిషయం. కావలిస్తే చూడండీ, ఎవరైనా చీమిడి చీదేరా, చూసీచూడ్డంలో వచ్చి, దాన్నమాతంగా పీల్చి గ్రుక్కన త్రేన్చేస్తుంది. ఇంతేకాదు యేమూల యేశవమున్నా యిటేమాదిరి. ముక్కిని తీసివెయ్యడంలో క్రిమికీటకాదుల్ని నాశనంచెయ్యడంలో పారిశుద్ధికసంఘం కంటే కాకి సంఘమే పేరుపొందింది. నిజంగా యిలాంటి విశ్వమానవసేవను తలుచుకుంటే యెవరికుండైనా కొట్టుకోకుండా వుంటుందీ!

కాకి మనకంటే చాలా నాగరికత కలది విశ్వమానవ సౌభ్రాత్రమో, విశ్వమానవసౌభ్రాత్రమో అని ప్లాటుఫారాలమీద యెలుగెత్తియేపుస్తున్నాం మనం. విశ్వమానవ సౌభ్రాత్రంమీద, కథల్ని, వ్యాసాల్ని, గీతికల్ని పత్రికలలో ప్రకటిస్తున్నాం. కాని అఖరికి దాని ధ్యాసనన్నా చూడలేకపోతున్నాం కాని కాకిమాత్రం సర్వపక్షి సౌభ్రాతృత్వంలో ముందంజవేసింది. అలాంటి సామాజికవిషయాల్లో కాకినే ముందుగాపేర్కొనాలి. విశ్వప్రేమలో కాకినే ఆదర్శంగా తీసుకోవాలి, మనం మనుష్యులమైనా. పాపం కోయిల గ్రుడ్లుపెట్టడమే కాని పొదగలేదుకదా! కాకి ఆ గుడ్లన్నిటినీ పొదిగి పిల్లల్ని చేసి ప్రపంచంలో విడిచిపెడుతుంది. కాకే లేకపోతే కోయిలెలావస్తాయి? అవి మధుమాసదివసాల్లో సహకార పల్లవాల్ని మెక్కి 'కూహూ' అని యెలా కూస్తాయి? మరి కవిలోకంచేత.

" కోయిలా! కోయిలా!
పోయినావేమి?
పవలనక రేయనక
వుచ్చదేని గొంతెత్తి
కవితా సుధాధార
స్రవియింప జేయుమా
కోయిలా! కోయిలా!
పోయినావేమి?" (కృష్ణాపత్రికనుండి)

అని వియోగగీతాల్ని ఆలాపింపజేసి యెలా హృదయాల్ని కదిలిస్తాయి? ఆ కోయిల్లే లేకపోతే పురాణాలూ, ప్రబంధాలూ, నవీనగీతాలూ, యెలా పారవంతా లవుతాయి? మన నాయికానాయకులు మనకు కర్ణానందంగా వాట్నెలా నోఁకట్టుకొని చెడామడా తిట్టగలుగుతారు?...అంటే కాకి కోయిలకు ప్రాణం పోస్తే కోయిల కవికీ చిత్రకారుడికీ ప్రాణంపోస్తుందన్న

మాట! ఈ విశ్వమల్లా నిస్సారమై జీవరహితమై వుండదూ, కాకే లేకపోతే!—

కాకి 'వైర్లెసు'లాంటిది. పూర్వకాలంలో, కాకి, నారదుడు మొదలైనవాళ్ళే 'వైర్లెస్'లా పనిచేసేవారు. ఇక్కడివిక్కడా అక్కడివిక్కడా ముట్టించేవారు. అందువల్ల ఆ కాలంలో టెలిగ్రాములూ, టెలిఫోనులూ అవసరంలేకపోయేవి. 'ఎవరన్నా చుట్టాలు మనింటికి బయలుదేరదలచారనేటప్పటికే కాకివచ్చి చెప్పేసేది. నారదుడు ఒక్కడే కావడంవల్ల ప్రతిచోటికీ వెళ్ళలేకపోయేవాడు. కాకి విశ్వవ్యాపి అవడంవల్ల నారదుడికంటే యెక్కువ ఉపకరణాలు వుండేవి. సాధారణంగా నారదుడికి తగాదాలు పెట్టడమేవృత్తి కాబట్టి ఇక్కడివిక్కడా అక్కడివిక్కడాచెప్పి కడుపు పొంగు తీర్చుకొనేవాడు. కాని కాకిమాత్రం స్వార్థరహితంగా (జట్టీలుపెట్టకుండా) నేటికిన్నీ పనిచేస్తూవుంది. కాకి అరచేటప్పటికి 'చుట్టాలువస్తార్రా బాబూ!' అని మా ముసలమ్మ చెబుతుంది. ఇప్పటివాళ్ళకి ఆ శకునాల మీద నమ్మకాలుపోయి టెలిగ్రాములికీ, టెలిఫోన్లకీ డబ్బు తగలెట్టుకున్నారు. అందువల్లే యీ ఆర్థిక మాంద్యం తటస్థించింది!

మనం కాకిలాంటి భక్తుణ్ణి యెన్నిజన్మాలెత్తినా చూడలేం. పద్నాల్గు భువనాల్లో కాకికీదైన భక్తుడు కనబడడు. ఇంద్రుడి లాంటి విష్ణుభక్తుడైనా వోమారు విష్ణుమూర్తి పారిజాతవృక్షాన్ని తియ్యడానికి వెళ్తే తన్నడానికి బయలుదేరేడు. ఇక అర్జునుడులాంటి పరమ భక్తుడుకూడా కృష్ణమూర్తిని 'రా' అంటే 'రా' అన్నాడు. రావణాసురుడి లాంటి భక్తాగ్రేసరుడు కూడా వోమారు కైలాసపర్వతాన్ని అమాంతంగా వూపేసి పరమశివుడి కపచారంచేశాడు. ఇల్లాంటి మహాభక్తుల్లో కూడా తప్పులు పట్టొచ్చు. కాని కాకిలో యేలాంటి తప్పూ పట్టలేరంటే అతిశయోక్తి కాదు!

అయితే మన శాస్త్రాల్లో నేమిటి, శ్రుతుల్లో నేమిటి, పురాణాల్లో నేమిటి కాకిని రాక్షసుడి లాగ రాసేశారు. ఆరోజులలో కాకిని కాకాసురుడన్న నామంతో పిలిచేవారు. వారన్నట్టు కాకాసురుడు కూడా త్రేతాయుగంలో చాలా ఘోరాలు చేసేవాడట. ఓమారు అమాంతంగా యెగిరివచ్చి విశాఖ పట్టణం ఆస్పత్రిమీద పడేటప్పటికి, రోగులంతా మంచి నీళ్ళడగకుండా చచ్చిపోయారని వేదాలలో వుంది. మరోమారు సూయజు కాలువలో అడ్డంగా పడుకొని అమెరికా యుద్ధనౌక అడ్డేశాడని మనుధర్మ శాస్త్రంలో వున్నట్టు వెంకన్నశాస్త్రుల్లుగారు చెప్తూవున్నారు. అందులో యెంత నిజంవున్నదీ తెలుసుకోలేక పరిశోధకులు యిప్పుడు 'కటకట' లాడిపోతున్నారు.

ఘోరాలు చేస్తూవున్న కాకాసురుడికి వాల్మీకిలాగే హటాత్తుగా మార్పుకలిగింది. విష్ణుమూర్తికి 'సీడ్ని సంస్కరిద్దాం, మన అంతరంగిక భక్తులలో వొకడిగా చేసుకుందాం' అనే కోరిక కలిగింది. (ఇందుకే ప్రత్యేకంగా) రామావతారం యెత్తేడు కాకాసురుడి పాప పండే అనుకోండి—పుణ్యం నిండే అనుకోండి—జానకీరాములు హాయిగా అడవిలో కూచోని వలపు కథలు చెప్పుకుంటూ వుంటే కాకాసురుడు (అసలు జయంతుడు లెండి) అమ్మవారి స్తనాలమీద పొడిచేశాడు రాముడెంత శాంతిమూర్తైనా, భార్యకు జరిగిన అవమానాన్ని చూసి వోర్వలేక పోయాడు. విల్లు బాణం కోసం 'ఓయీ! లక్ష్మణా.' అని కేకేశాడు. లక్ష్మణుడు శూర్పణక ముక్కూ చెవులూ కోసే పన్లో వుండడంవల్ల రాలేకపోయాడు. రాముడీ జాలాన్ని తాళలేక వెంటనే దోదర్భతీసి మంత్రించి వదిలేశాడు. అది మహాస్త్రమై కాకాసురుడి వెంట పడ్డాది. పద్నాలుగు లోకాలలో అతడ్ని యెవర్నూ రక్షించలేకపోయారు. అప్పుడతడు రాముడిమాహాత్మ్యం తెలిసికోగలిగాడు. 'కావుకావు' ('రక్షించు! రక్షించు') మంటూ అతడిపాదాలమీద పడ్డాడు. రాముడి పాద ధూళి అహల్యకిచ్చిన సుగుణంకంటే యెక్కువసుగుణం యిచ్చింది. వెంటనే మహాభక్తుడిగా మారిపోయాడు. రాముడు కోరినకన్నా దక్షిణగా యిచ్చేశాడు—కన్నే

కాదు ప్రాణాన్నిమ్మన్నా యివ్వవలసిన మహానుభావుడు!

జగదోద్ధారకుడి దగ్గర, రాముడి దగ్గర ఉపదేశం పొందిన తర్వాత యెప్పుడూ రాముణ్ణే ధ్యానిస్తూ 'కావు కావు' మని వేడుతూ ఉంటాడు. నిరంతర రామ నామ స్మరణం వల్ల అతనికి అసురత్వం పోవడమే కాకుండా దేవత్వం సిద్ధించింది. *దివ్యదృష్టి కలిగింది. అప్పట్నుండి అతను గాంధీమహాత్ముడిలా విశ్వప్రేమే ఆదర్శంగా పెట్టుకొని చరిస్తున్నాడు. వేదకాలంలో ఆర్యులు కాకి తాలూకు గొప్పతనం గ్రహించారు. అందుకనే 'పక్షితీర్థం' అనేది వొకటి ప్రత్యేకంగా స్థాపించారని శ్రుతిస్మృతులలో వుంది. కొన్నాళ్ళక్రిందట 'కాకివాద' అనే పట్నాన్ని కట్టడం కూడా కాకియొక్క స్థాపకార్థమే అని కవిరాజుగారు చెలుతూవున్నారు. మనం యిప్పుడు యిలాంటి యిలాంటి నిష్కామ్యభక్తుణ్ణి నిర్లక్ష్యంచెయ్యడం మానవజాతికి తీరనికళంకం అవుతుంది. కాబట్టి కాకిలోవున్న గొప్పతనాన్ని లోకంలో చాటడానికీ, ముందువాళ్ళు చంపకుండా చూడడానికీ వొక పెద్ద ఆందోళన అవసరం.

—'అవతార్.'

* అందుకే కాకిఅరుస్తే చుట్టాలువస్తారని పెద్దలు చెబుతారు.

---

# ప్రాయమా?

౧

ముగ్ధసమ్మోద జలధిలో మునిగితేలు
జీవముకుళమ్మునకుఁ గ్రొత్త చెలువ ముట్టి
పడ వికాసమునందించి పలుకరాని
తీయనితలంపు వలపులఁ దేల్చినావు.

౨

నీదు బిగియారు కౌగిలి నెనసి, వెచ్చ
నైన యధరాసవమ్మాని నంతలోన
మానసమునందదేదొ అమాంతమైన
నూతనోత్సాహ మొకటి యుబ్బాతలూగె.

౩

లోకమోహన యుష్మదాలోకనోత్స
వమ్ము నందిన నాయంగకమ్ములేమొ!
పట్టరానట్టి సంతోష భరముతోడ
మునిగి తేలియాడుచు హసన్ముఖములయ్యె.

౪

హృదయవల్లకి గాసినఁ దొలఁగఁజేసి
త్రుప్పుపట్టిన తలఁపు తంత్రులను దులిపి
చేర్చిరాగలయమ్ముల శృతినిగలిపి
మేటి ప్రేమగీతమ్మును మీటినావు.

౫

ఈవు బాసటయైనిల్వ నింక వేఱు
సాయము నపేక్షసేయక సాగదీసి
నింగి గండియొనర్చు 'ఫిరంగి' నైన
ఎదురుకొమ్మెన్నడ్డి యాపెద బెదరులేక.

౬

ప్రాతకాలఁపు మునులు నిక్క పాపములకు
దారిఁజూపుదువని యెంచి నారుగాని
పట్టుఁబట్టిన పరమాత్ము పట్టునైన
దిట్టతనమునఁ జేర్పించు శెట్టి వీవు.

—మానసరగండ విశ్వరూపశాస్త్రి.

# యోగిని

౧

'ఏమచ్చటనంతజనము మూగియున్నది?'

'మణికర్ణికా ఘట్టమునకు నేఁడొక భైరవవ్రతధారిణియగు యోగిని వచ్చినదట. ఆమెను గాంచుటకై జనులు గుంపులుగ నేగుచున్నారు.'

అని సంభాషించుకొనుచు గాశీనివాసులగు నిరువురు గూండాలు మణికర్ణికవైపున కేగుచుండిరి. ఇరువురును దృఢకాయులు, పరిశ్రమసంఘటిత దేహులు.

ఇప్పటికింకను ఘటికజాము ప్రొద్దెక్కలేదు. గంగానదీతరంగములపై ప్రాతఃకాలిక సూర్యకిరణముల కాంతి ప్రతిఫలితమగుచుండెను. అయ్యది మాఘమాసమగుటచే జనులంత ప్రొద్దెక్కనను వణఁకుచు వణఁకుచు గంగాస్నానమున కేగుచుండిరి. మఱికొందఱప్పటికే స్నానము చేసి విశ్వనాథ దర్శనార్థము దేవాలయమున కేగుచుండిరి.

అట్టి సమయమున నాత్మసమాగతయగు నొక యోగిని తీరమునఁగూర్చుండి గంగాప్రవాహమును దదేక దృష్టితోఁ గాంచుచుండెను. జనులామెకు నాల్గువైపుల మూఁగియుండిరి. కాని యామెను సమీపించుటకు మాత్ర మెవ్వఁడును సాహసింపలేదు. కాని క్రొత్తగా వచ్చిన గూండాలిరువురుమాత్రము బలవంతముగ తమ చేతులతోఁ బ్రజలను దొలఁగఁద్రోయుచుఁ గొన్ని మెట్లుదిగి యోగిని సమీపమునకేగి నిలిచిరి. కాశీలోని గూండాలు పరుల లక్ష్యపెట్టువారుకారు. స్త్రీల గౌరవించుట యనినవారికిఁ బొత్తిగాఁ దెలియదు.

యోగినిని గాంచుటతోడనే అందఱుజను లచటఁ గూడుటకుఁగల కారణమేమియో వారికి విశదమైనది. యోగిని జవ్వని, అనుపమసుందరి. ఆమె వెండ్రుకలలోఁ జాలభాగము జడలుగట్టియుండెను. కొన్ని వెండ్రుకలు మాత్రము శిరోమధ్యమున ముడివేయఁబడియుండెను. ఆ ముడిక్రింద నామె నెమ్మొగము వింతసోయగము నీనుచుండెను. జటాధారమువలన నామె ముఖకాంతి యించుకయు లోపింపక 'కిమివహి మధురాణాం మండనం నాకృతీనాం' అను కాళిదాసవాక్యమును స్మృతికి దెచ్చుచుండెను. ఆమెశరీరము మిగుల దేజోవంతమై విస్ఫులింగముల వెడలఁగక్కు నట్లుండెను. పాదములు, ముంజేతులు, శిరము దక్క మిగిలినశరీరమంతయు గావివస్త్రముచే గప్పబడియుండెను. జడలు వీపుపైఁ గ్రుమ్మ్రింతలనిడుచు భూమిని దాకుచుండెను. తళతళమను త్రిశూలమొకటి యామె తొడపైఁబడియుండెను.

భైరవి జనులవైపు చూచుటలేదు. ఆమెదృష్టి గంగానదిలోని చిఱుతరంగములతో సమ్మిళితములగుచున్న సూర్యకిరణములయందుఁ గేంద్రీకరింపఁబడియుండెను. గంభీరమగు నావదనమున నించుక యలసట దోచుచుండెను. చరణములు రజోదూషితములై యుండెను. కన్నులలోని తేజమించుక విన్ననగుచుండెను. ఆ యమయా కాలమున శీతల జలస్పర్శనముచే మార్గాయాసమును బోగొట్టుకొని జూచుచుండెను. అట్టిచో మూర్ఖులగు గూండాలిరువురు సూర్యకిరణముల కడ్డముగ నిలుచుటచే వారినీడ లామెపైబడెను. యోగిని కన్నులెత్తిచూడ వికృతాకారులగు నిద్దరు యువకులామెను దదేకదృష్టితోఁ గాంచుచుండిరి. పిమ్మట నాల్గువైపులఁజూడఁగా జనులు తన్ను చుట్టుముట్టియుండిరి. అంతట నామె యించుకయైన మాట్లాడక మౌనముతోలేచి నిలువఁబడెను. ఆమెచేతిలోని త్రిశూలము సూర్యకిరణములలో దళతళలాడుచుండెను. అద్దానిగాంచి భయముచే గుంపు ఆమెకు దారివదలెను. యోగిని వడివడిగా విశ్వనాథ దేవాలయమువైపునకుఁ బోసాగెను. లేచి నడచునపుడామె శరీరము పూర్వముకన్న పొడవు, సౌష్ఠవము, కలదిగ గాన్పించుచుండెను. ఆ యువకులిరువురు నామెను వెంటాడక విడువలేదు. అందులో నొకడామెతో 'కాంతా! నీవీయూరికి క్రొత్తగ వచ్చినట్లు గన్పడుచున్నావు. మా వెంటవచ్చిన నీ విశ్రాంతికి

యోగ్యమగు నుత్తమస్థానమును జూపింపగలము, అనెను. వెంటనే రెండవవాఁడు విశ్వనాథుని పండాలందఱు మాకు ముఖ్యబంధువులు. నీ వచ్చటికివచ్చిన విశ్వనాథునియొద్దనే యుండునట్లేర్పాటు చేయఁగలము అనిచెప్పెను. యోగిని యీ వాక్యములువిని ధీరురాలై మీరు నన్నేల వెంబడించెదరు. వెంటనే వెడలిపొండని కఠినస్వరమున జవాబుచెప్పి ద్రుతగమనమునఁ బోసాగెను. గంభీరమగు నా వాక్యమువిని యువకులించుక వెనుకాడిరి. కాని యామె యెచ్చటికి వెళ్ళును! ఏమి చేయును? అను విషయ మెఱుంగుటకు నుత్సాహులగుటచే వారామెను వెంటాడుట మానలేదు. యోగిని యువతి, సుందరి, నిరాశ్రిత, అసహాయ, కనుకనే యామెను వెంటాడుటకు వాండ్రకు జంకుగొంకులు లేకుండెను. ఆమె యారాత్రి యెచ్చటికివెళ్ళునది తెలిసికొనుట వాండ్రకు ముఖ్యకర్తవ్యము.

యోగిని దేవాలయసమీపమునకేగి కొంతసేపేమియో విచారించి లోపలఁ బ్రవేశించెను. ఆ యువకులును గొంచెము విచారించినమీఁదట నొకఁడు దేవాలయములోని కేగెను, రెండవవాఁడు వాకిట నిలువఁబడి యుండెను.

౨

యోగిని యారాత్రి గంగాతీరమునంగల యొకానొక జీర్ణమందిరమును శరణుసొచ్చెను. రాత్రులందుం డచ్చట నెవ్వరునుండరు. దానికి సమీపమున నిండ్లేమియులేవు. అప్పుడప్పుడు బాటసారులెవరైన నొకటి రెండు రోజులుమాత్ర మచ్చట విడిసిపోవుచుందురు. ఆ యింటిలోని ద్వారములు, కిటికీలు అలమారలు మొదలగునవన్నియు జీర్ణావస్థ నాశ్రయించినవే. ఆ యింటిలోనికి రాత్రింబవలు గంగాప్రవాహపుఁ గలకల ధ్వని వినబడుచుండును. బయటనున్నంత దుస్సహమగు చలి లోపలఁగూడ వేయుచుండెను. యోగిని యారాత్రి నచ్చట గడపు నుద్దేశముతో నందు బ్రవేశించెను. అయ్యది వెన్నెలరాత్రి. రెండవయామము గడచుచున్నది. పౌరుల కోలాహలము శాంతించినది. దూరమునందలి స్మశానములోఁ జితాగ్ని మండుచున్నది. వల్లకాటిలోని కుక్కలిటునటు బరుగులెత్తుచు భౌంకరించుచుండెను. వెన్నెలలో మందిరసమీపమునఁ బ్రవహించుచున్న గంగాతరంగపంక్తులు మనోహరములై కాన్పించుచుండెను. అట్టి సమయమున యువకులగు నిరువురు పురుషులు మెల్లనవచ్చి మందిరమునఁ జొరఁబడిరి. యోగిని పరుండియుండెను. కాని యామె కింతవఱకు నిద్రరాలేదు. కాలిచప్పుడు వినుటతోడనే యామె లేచి కూర్చుండెను. చంద్రికాప్రకాశమున బోల్చిచూడగా నా వచ్చినపురుషులు పగటిపూటఁ దన్ను వెంటాడిన గుండాలేనని స్పష్టమాయెను. వారిప్పుడు తప్పఁద్రాగియున్నారు. ఒకనిచేతిలో సారాబుడ్డికూడ గలదు. మదిరాదుర్గంధ మొక్కుమ్మడి యోగిని నాసారంధ్రముల ముంచితేల్చెను. ఆమె దిగ్గునలేచి నిలుచుండెను. ఆమె హస్తమునఁ ద్రిశూలము మెఱయుచునేయుండెను. ఆమె లేచుచుండఁగనే వారిలో నొకఁడు మందస్వరముతో 'యువతీ? ఏల లేచుచుంటివి? నీ కొఱకై భైరవీప్రసాదము దెచ్చియున్నాము. రమ్ము. వెంటనే దానిని స్వీకరింపుము' అనెను.

వానికన్న మద్యపానమునఁ గొంచెము వెనుబడియున్న రెండవవాఁడు యోగిని లేచుచుండఁగనే ద్వారమున కడ్డముగనిలిచి 'ఓయీ! ఎక్కడికి వెళ్ళెదువు? నిన్ను మేమెచటికిఁ దీసుకొనిపోఁదలఁచితిమో అచ్చటికి నీకైనీవే వచ్చుటమేలు. మమ్ముఁగాంచి యిప్పుడెచటికో పోవనవసరమేమి? ఇదిగో ప్రసాదము. స్వీకరింపుము' అని పలుకుచు మద్యపాత్రతోఁగూడిన తన హస్తము నామెవైపునకుఁ జాచెను. సుందరియగు నామె యిప్పుడు సంకటమునఁబడినది. నిస్సహాయ. అర్ధరాత్రము. నిర్జనస్థలము. అట్టియెడ బలవంతులగు నిద్దరు పురుషులు మద్యపానోన్మత్తులై యామెను బలాత్కరింప వచ్చినారు. ఇక నామెను రక్షించువా రెవరు. యోగిని ముఖమున భయచిహ్నమేమియు గానవచ్చుటలేదు. వారిమాటలు విని యామె మెల్లఁగా ఏమీ : ఇచ్చటి భైరవీవ్రతధారులందఱు మద్యపానము చేయుదురా? అని యడిగెను.

లేకున్న భైరవు లెట్లగుదురు? అని వారి జవాబు.

యోగి—ఇంతరాత్రివేళ మీరిచ్చటి కేల వచ్చితిరి ?

మొదటివాఁడు—(నవ్వి) ఈప్రశ్నకు జవాబేమి గలదు

యోగి—నేనే కాకిని, అబలను, అసహాయను. నా విషయమున దౌర్జన్యమాచరించిన మీకేమి లాభము.

గుండాలు—ఔరా ! నీవిషయమున దౌర్మార్గ్యమే మొదలుచేసిరి. మేమును కామమార్గానుయాయులము గదా రమ్ము. మద్యముద్రావుము. ఆనందింపుము.

భైర—త్రాగక విధిలేదా ?

గుండా—ఇన్నిమాటలేల ? తీసికొనుము. ప్రారంభింపుము.

భైర—నేను బ్రహ్మచారిణిని.

గుండా—ఇట్టివారినెందఱినో చూచినాము. మొదట నెల్లరు నిట్లే చెప్పుచుందురు.

యోగి—(మాటమార్చి) కాశి మిక్కిలి పుణ్యస్థానమన్న సంగతి మీరెఱుగుదురా !

గుండా—(నవ్వి) మొట్టమొదట నేఁడే యీసంగతి దెలిసికొనుచున్నాము. తమరాకవలన మఱియుఁ బవిత్రమైనది.

యోగి—(ఈ వ్యంగ్యవాక్యముపై లక్ష్యముంపక) ఇట్టి పుణ్యస్థానమున మీరు రాత్రింబవలు పాపాచరణ మేల చేయుచున్నారు.

గుండా—ఏమి; పాపమా ! నీ మధురమూర్తి గాంచినంత మేము మన్మత్తులమైపోతిమి. దీననించుక పాపమున్నను గాశీనివాసులకేమి భయము.

యోగి—మూర్ఖులారా ! స్వర్గమందేని నెవరైన పాపమాచరించిన నరకవాసి కాకతప్పునా? నరకమునందు గూడ మీ పాపమునకు ప్రాయశ్చిత్త ముండబోదు. ఎందఱుస్త్రీలను మీ కీవిధముగా నాశనమొనర్చిరో యొవరికెఱుక.

గుండా—ఏమి ! నీ విచ్చట శాస్త్రచర్చ చేయ వచ్చితివా ! వ్యర్థముగ నీ మాటలాడెదవు.

అనుచు నంకొకఁడు తన రెండుచేతులఁ జాపి యామెను బట్టికొనఁబోయెను. వెంటనే యామె యాకారము మాఱినది. ఇంతవఱకు మెల్లమెల్లగా నమ్ర వాక్యములఁ బల్కుచున్న యోగిని హఠాత్తుగాఁ ద్రిశూలమును ఝళిపించుచుఁ బ్రళయకాలరౌద్రాకారము దాల్చెను. ఆ మెరూపు మిప్పుడొక భయంకరాగ్నిజ్వాల. ఆమెను ముఖముపైనను, త్రిశూలముమీఁదను గూడ జంద్రకాంతి ప్రతిఫలించి తళతళలాడుచుండెను. యోగిని తన భీషణస్వరములో గంగాతటము నెల్ల గంపింపఁజేయుచు అరే! నే నెవతెనో యెఱుగుదురా? అని యాఁడుసింగమువలె గర్జించెను.

గుండాలిరువురు నాశ్చర్యచకితులు, భయకంపితులునై 'లేదు' అనిమాత్రము జవాబుచెప్పిరి.

యోగి—అందువల్లనే మీరు నన్ను వెంటాడుచున్నారు. నే నెవతెనో మీ రెఱిఁగియున్న నాకలిగొన్న వ్యాఘ్రిని గాంచువారివలె నెప్పుడో పాఱిపోయియుందురు. మీవంటి నీచులవలన నాకిసుమంతయు భయములేదు. విడువుఁడు, నామార్గమును విడువుఁడు.

అదివిని వాకిట నిలచియున్నవాఁడు మెల్లఁగ మాటలాడుము. ఇంతమాత్రమున కల్లరియేల ! అనెను.

యోగి—(త్రిశూలము చేత గట్టిగ బట్టికొని) ఓరీ! నీకు మృత్యువు సమీపించినది. ఇదిగో నాచేత జంపబడితివి, అనుచు రెండడుగులు ముందునకు వేయగనే ద్వారమునయున్న వ్యక్తి దూరముగఁ దొలఁగ ఆమె త్రిశూలమును ఝళిపించుచు నచ్చోటు వీడిపోయెను. ఆ వీరులిద్దరు నట్టి యర్ధరాత్రమున నామెను వెంబడింపనైన సాహసములేక యింటిదారి బట్టిరి.

## 3

సైనికవిప్లవము జరిగి రెండువత్సరములైనది. రాజ్యమునం దెల్లయెడల శాంతిస్థాపింపఁబడినది. అయినను అచ్చటచ్చట నరెస్టులుమాత్రము జరుగుచునే యున్నవి. నానాసాహెబ మింతవఱకుఁ బట్టుపడలేదు. మఱికొందఱు పేరుగలవిద్రోహుల జాడగూడ నింతవఱకుఁ దెలియలేదు. దేశమంతటను వీరికొఱకు గూఢచారులు దిరుగుచుండిరి.

ఈసమయమునందే యొకానొక సి. ఐ. డి. పోలీసు కాశీనగరమునకు వచ్చిచేరెను. అతని కచ్చట నేవిధ

మగు సహాయముగావలయునో, అతిరొల్ల నన్నటి ప్రభుత్వద్రోహులు సముకూర్చుచుండవలయునను దొరతనమువారి యాజ్ఞాపత్రి మతనియొద్ద గలదు. దానిపై నతని పేరు 'ముంతాజఅలీ' అని వ్రాయబడియుండెను. అతడు జిల్లామేజస్ట్రీటునొద్దకు వెళ్ళి దొరతనమువారి యాజ్ఞాపత్రి మతనికి జూపించెను.

మేజ—ఈపట్టణమునగాని లేక జిల్లాలోగాని రాజద్రోహు లెవరైన దాగియున్నారా?

గూఢ—యథార్థమని చెప్పలేను. ఇంతవఱకుఁ గేవల మనుమానముమాత్రమై యున్నది.

మేజ—పద నేనుకూడ వెంబడుటకు నీతో వత్తును.

గూఢ—అయ్యా! మీరురావలదు. నేను మాటిమాటికి దుస్తుల మార్చుచు మిగులఁ గష్టముగ గూఢచరకార్యమును నిర్వహించుచున్నాఁడ. తాము దయ చేసినచోఁ బక్షి వలనుండి యెగిరిపోఁగలదు.

మేజ—(కొంచెము కోపముతో) సరి. మీయిష్టము.

గూఢ—నాకవసరమగు సాయము చేయవలసినదిగా కొత్వాలు సాహేబున కాజ్ఞాపింపుడు.

వెంటనే కొత్వాలు పిలువనంపబడెను. మేజస్ట్రీటు నూత్న సమాగతుఁడగు పురుషుని కొత్వాలునకు జూపుచు. ఈతడొక గూఢచారి. ఇతని కవసరమగునపు డెల్లఁ దగిన సాయముచేయుచుండవలెను.

కొత్వాలు—(వంగి సలాముచేయుచు) చిత్తము.

బయటికి వచ్చినమీఁదట ముంతాజీనుండి కొన్ని రహస్యముల గనుగొనవలెనని కొత్వాలెంతయో ప్రయత్నించెను. కాని యతఁడు కొత్వాలునకంటె గండఁడు. అగుటచే నతడేమియు బయలుపుచ్చనీయ లేదు. . .ఇప్పుడు నాకేవిధమగు సాయ మవసరములేదు. అవసరమగుడు నేను మనవిచేతును, అని మాత్రమే యతఁడు కొత్వాలుతోఁ జెప్పెను. అంతనా గూఢచారి తన నియమిత స్థలమునకు వెడలెను.

గూఢచారి తనదుస్తులను మార్చి సన్యాసి వేషము దాల్చి పగలు మూడవజామున విశ్వనాథ దేవాలయము వైపున కేగెను. దారిలో నతడు మాటిమాటికి. జై, బాబా విశ్వనాథజీకీ జై అని బిగ్గరగ నఱచుచుండెను.

అతనిగాంచిన వారెవరు నతఁడు మహమ్మదీయుఁడని గుర్తింపఁజాలకుండిరి. వేషభాషలయందు నతఁడు నిజముగ సన్యాసుల కేమాత్రముఁ దీసిపోఁడు. జనులు గుంపులుగాఁ గూడినచోట్లనెల్ల నతఁడు నిలిచి వారి సంభాషణల వినుచుండెను. దేవాలయ సమీపముననే చీకటిపడువఱకు నటునిటుఁ దిరుగుచుండెను. అతఁడిట్లు దిరుగుచుండగనే అంధకారము మెల్లన నల్లుకొనెను.

అప్పుడొకచో గొందఱు యువకులు చేరి సంభాషించుకొనుచుండ గూఢచారి మెల్లన నటజేరబోయెను. అతడచటి కేగునప్పటికి వారిలో వారిట్లు మాట్లాడుకొనుచుండిరి.

మొదటివాఁడు—నాఁటినుండియు మరల నామె జాడలేదా?

రెండవవాఁడు—లేదు. మరల నేనందులకై ప్రయత్నింపనైనలేను.

మూడవవాఁడు—అరే! అట్టి చక్కనిచుక్కయగు కాంతచేఁ జిక్కినపు డేలజారిపోనిచ్చితివి. ఇయ్యది నీకేగాక మనయెల్లరకు లజ్జాకరముగాదా?

నాల్గవవాఁడు—ఆమె పారిపోయియుండదు. ఇచ్చటనే యెచటనో దాగియుండును. అన్వేషించిన మరల లభింపగలదు.

రెండవవాఁడు—ఆమెవెంటబడరాదు. ఆమె మిగుల నిర్భయురాలు. సాహసిక,

మూడవవాఁడు—(తిరస్కారముతో) ఒకయాఁడుదానికింతగా భయపడు నీవు బ్రదుకు బ్రదుకుటకంటె గంగలోదూకి చచ్చుట మంచిది.

రెండవవాఁడు—(కోపముతో) చాటున నెన్ని కోతలైన గోయవచ్చును. ఆమెయెదుట కొకమాటు వెళ్ళిన నందఱపస బయటపడగలదు. ఈ గర్వమప్పుడేమగునో తెలియగలదు.

మూడవవాఁడు—నోరుమూయుము. మీపాలు గోరించుకొని యాఁడువాండ్రతో నాడుకొనలెమ్ము.

ఇట్లు కొంతకాలము సంభాషించినమీఁదట నెవరి యిండ్లకువారు పోసాగిరి. సన్యాసియు వారివెంటనే పోవుచుండెను. పోవుచు మార్గమధ్యమున నతడు వారి నిట్లు ప్రశ్నించెను.

'ఇంతవఱకు మీరుమాట్లాడు విషయమేమి?' వారందఱు విస్మయముతో వెనుదిరిగి సాధువైపునకుఁ జూడసాగిరి. అట్టి యంధకారములోనే మందహాస సుందరమగు వదనముఖమును వారు చూడఁగల్గిరి వెంటనే వారిలోనొకఁడు విసుగుతో మాటలతో నీకుబనేమి? విచారించిచూడ నీవొక టక్కరిసన్యాసివలె గన్పట్టుచున్నావు. మేము నీవంటిటక్కరుల నిదివఱకెందఱనో చూచినాము. నీ వేషముల నిచట సాగింపక వెడలి పొమ్ము. అనెను.

వెంటనే రెండవవాడు: నీవు మా మాటలనెల్ల వినినట్లున్నది. శాబాసీ! నీవొక విచిత్రవ్యక్తివిగాఁ దోచుచున్నావే. వేషమున సాధుపుంగవుడవుగదా? మేము మాట్లాడినది స్త్రీవిషయము, అది వినుటవలన నీకేమి లాభము. అని కిలకిలనవ్వెను.

సాధువు మొగముపైగూడ జిర్నగవు వ్యాపించినది.

సాధు—నాతో జెప్పిన నా విషయమున నేనైన సాయముచేయఁగలను.

మొదటివాఁడు—నీకేమైన మందులు, మంత్రములు దెలియునా?

సాధు—ఆ విషయమున నాకు సంపూర్ణజ్ఞానము గలదు.

రెండవవాఁడు—శాబాసీ! దానిలో నీకుగూడ భాగమవసరములేదుగదా? లేక పిట్ట దొరకినవెంటనే గప్‌చప్‌గా లంకించుకొనిపోదువా.

సాధు—రాను, రాను, అట్లనకుడు. నేను విషయములరోసిన సన్యాసిని. మీ రే కాంతను గూర్చి మాట్లాడుచుంటిరో ఆమెను నే నిదివఱకే యెఱుగుదును.

రెండవవాఁడు—(ఆత్రముతో) ఆమె భైరవవ్రతధారిణియేనా?

సాధు—ఇపుడు భైరవియే కాని పూర్వమామె వైష్ణవి ఇదివఱకున్నప్రియుని వదలి నేడామె భైరవ వ్రతమును స్వీకరించినది.

రెండవవాఁడు—అట్లయిన మా మందేలనట్లు బింకముజాఱుచున్నది. చేతిలో నొక త్రిశూలమును దాల్చి యెల్లరిపైఁ దుముకుచుండునే. అట్టిదామె యాకారమును గాంచిన యెల్లరకు జంపివేయునన్న భయముఁ గల్గుచుండును.

సాధు—అవియెల్ల వట్టిడంబములు. ఈమారు గన్పడినఁ దప్పక మీచేఁజిక్కఁగలదు. కనుక ఆమె యెక్కడ నుండునది భోగట్టాతీయవలయు. అప్పుడు మీకోర్కె నెఱవేఱఁగలదు. రేపు సాయంసమయమున మనమెల్లర మిచటనే కలసికొనవలయును.

రెండవవాఁడు—మాకోర్కె సఫలమైన నీ కష్టమూరకపోదు. గొప్పబహుమతి పొందఁగలవు (అవి తనలో) బహుమతి చేతిలోఁగాదు, వీపుమీద, అనుకొనెను.

సాధువున్నా 'నాపని నెఱవేఱిన మీయుపదగిన యినాము లభింపఁగలదు.' అనుకొనుచు నటనుండి వెడలిపోయెను.

## ౪

మఱుచటిరోజు సాయంకాలమున నీరుపురు గుండాలను సంకేతస్థానమున యోగిని దర్శించిరి. వారిని గాంచుటతోడనే యోగి 'ఏమి సమాచారము' అని ప్రశ్నించెను.

గుండాలు—భైరవి సమాచారము తెలిసినది.

యోగి—ఆ మెచ్చట నివసించుచున్నది!

గుండాలు—అదేమో తెలియదు. కాని నేటిప్రాతః కాలమున గంగాతీరమున మణికర్ణికా ఘట్టమున గూర్చుండియుండెను. ఆమెచుట్టును జనులమూఁగఁగనే యెచటికో వెడలిపోయినది.

యోగి—రేపు మరలరావచ్చునా?

గుండాలు—శతవిధముల రావచ్చును?

యోగి—మంచిది. మరల రేపటిప్రభాతమున మిమ్ము గలసికొందును. మీరు మాత్రము గంగాతీరముననే యుండవలయును.

అనిచెప్పి యతఁడు తన నివాసమునకేగి వేషము మార్చెను. కొత్వాలునొద్దకేగి రేపటి యుదయమున నే మీరు నావెంట బలవంతులగు నైదుగురుభటుల నంపవలయును. ఆవచ్చు భటులను నే నిప్పుడే చూడవలయును. అనిచెప్పెను.

కొత్వాలు—మీరు వెదకుచున్న వ్యక్తి జాడ చిక్కెనా!

గూఢచారి—చాలవఱకుఁ జిక్కినట్లే

కొత్వా—నేనే స్వయముగ మీ వెంటవత్తునా!

గూఢ—అదెంతమాత్రమును బనికిరాదు. ఏమాత్ర మనుమానము గల్గినను ఖైదీ పారిపోఁగలఁడు. పట్టు వడినమీఁద మీరును జూడవచ్చును.

సిపాయిలు హాజరగుటతోడనే ముంతాజ్ అలి వారినిగాంచి మీరెల్లరు రేపు తెల్లవారకమునుపే మీ మీ యాయుధములతో సిద్ధముగనుండవలయు. మిమ్ము తరులు గుర్తింపకుండునట్లు మీదుస్తులపై కంబళ్ళుగప్పి కొనవలయును, అని చెప్పి వెడలిపోయెను.

మఱునాఁడు ప్రాతఃకాలమగుసరికే రక్షకభటు లైదుగురు సిద్ధముగానుండిరి. గూఢచారియును నడుమున ఖడ్గముబంధించి మీఁద తన దుస్తులదాల్చి పైనఁ గంబళి గప్పికొనెను. అతఁడు రక్షకభటులఁ గాంచి మీరు నా వెంటనుండక దూరముగ నొక్కరొక్కరుగ వచ్చుచు నేను సైగచేయఁగనే నాయొద్దకు రావల యును. అనిచెప్పి మణికర్ణికాఘట్టమువైపున కేగెను. సిపాయిలు కొంచెమువెనుక వచ్చుచుండిరి. మణికర్ణి కకుఁ గొంచెముదూరముననే గుండా లతనిఁగాంచి కహాన్! బాబూజీ! నేఁడు మీవేసము పూర్తిగ మాఱినదే అనిరి. గూఢచారి వెనుదిరిగి చూచుటతోడనే భటులతనిని సమీపించిరి. మీరు వెంటనే వీరినరె స్టుచేయుఁడని యాజ్ఞాపింపఁగనే పోలీసులు గుండాల నరెస్టుచేసిరి. సిపాయిలు వెలవెలవోవుచు మావలని యపరాధమేమి' యని అడిగిరి.

గూఢ—మీరు రాజద్రోహులకు సహాయులు, అని చెప్పి సిపాయిలఁ గాంచి మీరు వీరిని వెంటనే చెఱసాలలో బంధింపుఁడు, అని యాజ్ఞాపించి తానచటి నుండి సాగెను. ముప్పురు సిపాయిలు వారిం గొంపోవ నిద్దురుమాత్రము గూఢచారివెంటనే సాగిరి.

అతఁడు గంగాతీరముననే మణికర్ణికాఘట్టమునకేగి చూడ రోగిని యొందొక మెట్టుపై గూర్చుండి యుం డెను. అతడు రక్షకభటుల దూరముగనుండ నియమించి తానుమాత్ర మామెసమీపమునకేగి మెల్లగ 'నన్ను గుర్తింపితివా' అని ప్రశ్నించెను. ఆమె యులికిపాటుతో నతనింగాంచి సందేహాశ్చర్యములతో నీవిచటికేల వచ్చి తివి? అనెను.

గూఢ—మతి నీవు.

రోగి—నేను మరెచటికేగుదును.

గూఢ—నేనేల వచ్చితినో తెలియుదా?

రోగి—ప్రతిక్రియకై యుండును.

గూఢ—నాకవమానము సల్పుట నీకు నుచితమా?

రోగి—(కోపముడితో గర్కశస్వరము దీపింప) నీవు నాతండ్రికి ద్రోహకరుడవై యుండియు నాతోఁ మైత్రి నెఱపఁగోరినందున దానికిఁదగిన శిక్ష ననుభవిం చితివి.

గూఢ—నీవిషయమున సర్కారువారి హుకు మెట్లున్నదో తెలియునా?

రోగి—ఆఁ: తెలియునేమి. నన్ను బట్టికొని మరణ దండన విధింపుమనియేకదా? దానికేకదా నీవిచటికి వచ్చుట.

గూఢ—నేను గూఢచారినిగాన రాజద్రోహిని బట్టికొనుట నావిధి.

రోగిని చూపులలో గ్లాని ప్రస్ఫుటితమగు చుం డెను. భాగీరథిలోని చిఱుతరంగములపై ప్రాభాతిక సూర్యకిరణములు తాండవించుచుండెను. రోగిని గంగా నదివైపు దృష్టిపఱపుచు 'ఇదిగో నేనిచటనే కూ ర్చుండియుందును. మీభటుల బిల్చి నన్ను బట్టియిమ్ము' అనెను.

గూఢ—నిన్నిపుడు పట్టియిచ్చిన మరణదండనగాని లేక ప్రవాసశిక్షగాని లభించును. ఒకవేళ ప్రవాసమే లభించిన నచట నీమానము చూఱగొనఁబడదా?

రోగి—(అతనివైపు చూచుచు) ఇంతవఱకు నన్నెవఁడైన స్పృశింపగల్గెనా!

గూఢ—(వికటముగా) నీవు స్వతంత్రురాలవై యుండునంతవఱకు నీకేమియు భయములేక పోవచ్చును. కాని శత్రుహస్తగతవైనమీఁద నీకు దిక్కెవరు. నే నొకవేళ దయదలఁచి విడిచినను ఈసమాచార మెట్టు

లైనఁ బ్రభుత్వమునకుఁ దెలియకుండదు.

యోగి—నీవిచటికి వచ్చిన యుద్దేశ మేమియో స్పష్టముగఁ జెప్పుము.

గూఢ—జనులు నాల్గువైపుల మూగియున్నారు. వారి కేవిధమగు సందేహము గల్గకపూర్వమే నీవు నా వెంట లేచిరమ్ము. అట్లయిన నిన్నింగ్లీషువారు పట్టుకొనఁ జాలరు.

యోగి—(చిర్నగవుతో) ఏమి? నాతో నిఘాచేసికొనవలయుననియా?

గూఢ—మీరద నీ యిష్టముచొప్పునఁ బ్రవర్తింపవచ్చును. ఇప్పు డాలసింపక నావెంటరమ్ము.

యోగి—రానిదో.

గూఢ—రాజద్రోహ నేరముక్రింద నిన్ను సర్కారువారు బట్టియిత్తును.

యోగి—నన్నుఁ బట్టికొన సాహసించునది నీ వొక్కఁడవేనా?

గూఢ—కాదు. మతి యిద్దఱుభటులుగలరు.

యోగి—ఐనచో వారినిగూడ బిలువుము.

గూఢ—నీవు నా వెంటరావా?

యోగి—రాఁజాల.

గూఢచారి సిపాయీలవైపు చూడఁగనే వారు మెట్లు దిగసాగిరి. యోగిని వారిని గాంచుటతోడనే మెఱుపుమెఱసినట్లు చివుక్కునలేచినది. త్రిశూలహస్తయై గూఢచారియెదుట నిలుచు నాతఁడు భయకంపితుఁడై యించుక వెనుకాడెను. వెంటనే యా శూరకాంత తన చేతిలోని త్రిశూలముతో శక్తికొలది తనవక్షమునఁ బొడిచికొనెను. ఒక్కుమ్మడి నాల్గువైపులనుండి జనులు గ్రమ్మికొనిరి. గూఢచారియు పరికించినాఁడు. ఆమె మృతదేహము గంగాతటమున బడియుండెను. రక్తధారయొకటి యద్దానినుండి బయల్వెడలి గంగాజలముతో సంగమించుచుండెను గంగానదీ జల తరంగములా శరీర స్పర్శచేఁ బవిత్రములగుచుండెను. సూర్యకిరణములా మొగముపై నొకనూత్నకాంతి నొదవించుచుండెను.

ఏమైనది? ఏమైనది! అని యాతురతతో మూఁగిన జనులందఱతనింగాంచి 'ఈ పుణ్యకాంత యెవరు' అని ప్రశ్నింపసాగిరి.

గూఢచారి వంగినశిరముతో జవాబుచెప్పెను. "రాణీచందా"

జనులు—ఏమేమి? రాణీచందా? అజ్ఘగఢములో భయంకరమగుయుద్ధము సాగించిన దీమెయేనా?

గూఢ—ఔను.

(సరస్వతియను హిందీ పత్రికనుండి)

—బోడేపూడి వెంకటరావు.

---

## కృతార్థత

చిరపరాధీన దుస్తర జీవులైన
ఆంధ్రజనుల దురంతాంతరంగభరము
సుకవి తిక్కన భారత సూక్తికతన
స్రుగ్గునను భావకవి సూక్తి సూనృతంబు ॥
అస్వతంత్రతయను వార్థియందు మునిఁగి
విస్మృతి తరంగములఁ దేలి విహ్వలించు
సాంద్రభావజ్ఞులగు నాంధ్రజనుల వలపు
కడచనదె యాంధ్రభారతా కర్ణనమున ॥
విస్మృతి చరిత్ర భావగాంభీర్య మలర
ఆంధ్రమునఁ దీర్చినాఁడు తిక్కన్న సుకవి
భావరస పానమత్తులా భావకవుల
భావనారాజ్యలక్ష్మి శ్రీ భారతంబు ॥
అన్నివిధములఁ గాలదురంతములకు
లొంగి తలదాచుకొన్న తెలుంగు జనులు
కాంచినారు కృతార్థతా గౌరవంబు
నన్నతాచార్యుఁడైన తిక్కన్న కతన ॥
అల్ల యుద్యోగపర్వంబు నందు శౌరి
కౌరవులకడ సంధిప్రకార మెలమి
పలుకు ఘట్టంటు జాలదే తెలుఁగు జాతి
గర్వ పర్వత శిఖరాభి గమనమునకు ॥

—శేషాద్రి రమణ కవులు.

# వాసనద్రవ్యములు — జాజి

లవంగ, దాల్చిన, ఏలక, జాజికాయ, జాపత్రి మొదలగు సామాన్య సుగంధద్రవ్యములు ప్రతివాని వాడుకలో నెక్కువగానుండు విషయ మందరు నెరిగినదే. అయితే పదార్థమ్ములను బజారులో మాత్రము చూచుచున్నాము. కాని యా మొక్కలను కాయలను సాధారణముగా చూడలేకపోవుచున్నాము. అదిగాక యొక్క వాడుకతప్ప, యితరవిషయము లేవియుగూడ వాటినిగురించి మనకు తెలియకుండయున్నవి. అందుచేతను సాధ్యమైనంతవరకు వాటినిగురించి తెలుసుకొందము.

జాజి — జాజిచెట్టునుండియే జాజికాయ, జాజిపత్రి రెండును వచ్చుచున్నవి. జాజిపత్రికే జాపత్రియనికూడ పిలుచుదురు. అది వేరొకమొక్కనుండి వచ్చుననుకొందురు. కాని జాపత్రి జాజికాయమీదనున్న మెత్తని పొర.

జాజిచెట్టు యొకవృక్షము. 50-60 అడుగుల యెత్తువరకుకూడ పోవును. జాజిచెట్లు మలబారు, తిరువాన్కూరు, నీలగిరి కొండలలోను, యడవులలోను పెరుగుచున్నవి. వీటికి సంవత్సరమునకు 60 అం॥ వర్షపాతము, 2000 అడుగులకు మించిన యెత్తయినప్రదేశము, తేమతోకలసిన యుష్ణము, సదా నీటిసదుపాయము, నీటి యింకుడల, సారవంతమైన నేల కావలయును. అన్నిటికన్నను నీలగిరి కొండలదిగువను బాగుగా పెరుగుచున్నవి. కూనూరు ఘాటుప్రక్కనున్న బర్లియారు తోటలలో విజయముగానున్నవి. బర్లియారు దాదాపు 2500 అ॥ ఎత్తు. ప్రక్కనెప్పుడును పారు జలపాతములు, కొండవాగులు, ఎత్తయిన యితరవృక్షములు, కొండప్రక్కను పెరుగుటచే నీటినిలకడ తక్కువ కాని నీటి సదుపాయ మెక్కువ.

ఈ జాజిచెట్టుజాతులలో 22 రకములున్నవి. కాని యందులో నొకటే మనము సాధారణముగా తిను జాజికాయచెట్టు. మిగిలినజాతులలో కొన్నిటినుండి క్రొవ్వువత్తులు తయారుచేయుదురు. మరికొన్నిటినుండి పసుపుపచ్చని నూనెను దీసి దీపములకుపయోగింతురు. ఈ జాతి జాజిచెట్టునకు సువాసనలేదు. అందుచేత సాధారణముగా మనము తినము. వినను వర్తకమహాశయులు మంచిజాతులలో నివి కలపి యమ్ముట శోచనీయము. ఇందులోని తైలములకు 'ఫుండి' నూనె యని మలబారులో నందురు. ఇంతకు నీ రకపు కాయలలోని తైలమునుదీసి సబ్బులనుజేయు నవకాశము లెక్కువయున్నవి.

మన వాసనద్రవ్యమగు జాజికాయ పెద్దమామిడి పిందెయంత యుండును. పైతొక్క దళసరిగా, నున్నగా, పండినపుడు పసుపుపచ్చగా యుండును. సుమారు ½ అంగుళము దళసరియుండును. దీనిలోకూడ జాజిపిక్కకు, పత్రికి, గల సువాసన, రుచి తగుమాత్రమున్నవి. ఉత్తినోట తినుటకు చాల బాగుండును. కాయలయినప్పుడు మాత్రము కొంచెము పులుపుదనము, వగటు, కస యుండును. వీటిని యీ ప్రాంతములలో కొందరు ఊరగాయగా నుంచుటకూడ కలదు.

ఈ కండగల పైతొక్కను తీసినవెంటనే లేత యెఱుపన్నన పసుపుపచ్చన కలసినరంగుతో జాపత్రి పొర యుండును. దీనినితీసి యెండబెట్టినతర్వాత నరుణోదయపురంగుగల మనబజారు జాపత్రియగును. ఈ జాజిపత్రిపొర దాని దిగువనున్న జాజికాయ పైపెంకునకు దగ్గరగా నంటియుండును. అందువలన దాని యానవాలు గీతలరూపమున బజారులో దొరకు జాజికాయపై నగపడుచునే యుండును.

ఆ పెంకునుగొట్టిన లోపల జాజిపిక్క యుండును. దీని పైపొర తెల్లగానుండి, ముడుతలు పడియుండును. పిక్కలోనిభాగము నూనెను చిమ్ముచున్నట్లుండును.

బాగుగాపండిన జాజికాయలు నేలకురాలి పడిపోవును. వాటిని ప్రొద్దున్నే యేరి, పైతొక్కతీసి, లోని

జాజిపత్రిని జాజికాయలను వేరువేరుతీసి, యెండబెట్టుదురు. ఎగుమతి చేయవలసివచ్చినపుడు జాజికాయలను కఱ్ఱలతో బ్రద్దలుకొట్టి లోనిపిక్కలను కొంత సున్నములోరాసి, యెండబెట్టినపిదప గాలితగులకుండ పెట్టెలలోనుంచి పంపించెదరు. అట్లు చేయుటవలన దానికీపురుగును, చీడయు సాధారణముగాపట్టవు. సాధారణముగా మనదేశములో దగ్గరనున్న ప్రదేశములకు పంపునపుడు యెండినకాయలనే పంపించెదరు.

జాజిపిక్కలోను, జాజిపత్రిలోను కూడ నూనె యెక్కువగానున్నది. వీటినెక్కువగా తినిన మత్తు చేయును. జాజినూనెను ఇపుడు యూరపులో నెక్కువగా తయారుచేయుచున్నారు. 'విరిగిపోయిన జాజిపిక్కలను బాగుగా గుండగొట్టి, నీటితో కొంతకలపి, యొక సంచిలోవేసి, క్రిందను ఆవిరిపెట్టెదరు. అట్లు ఆవిరిలో కొంచెముసేపుంచి యినుపమర గానుగలలోనుండి నూనెను దీయుదురు. నూటికి 20-30 భాగముల నూనె వచ్చును.

జాజికాయలోను జాజిపత్రిలోను గల యాహార పదార్థములనీ దిగువ పట్టికయు సరాసరిని ప్రతిశతములో చూపును.

| ఆహారపదార్థము. | జాజికాయ. | జాజిపత్రి. |
|---|---|---|
| నీరు. | 6·32 | 4·56 |
| క్రొవ్వులు. | 50·23 | 50·48 |
| మాంసకృత్తులు. | 6·52 | 7·15 |
| కర్బనోదజనితములు. (పిండి) | 25·66 | 31·30 |
| సారపదార్థములు. | 9·85 | 4·99 |
| భస్మములు. | 1·42 | 1·52 |
| | 100·0 | 100·0 |

మీద పట్టికవలన క్రొవ్వుపదార్థములకు జాజి పేరు పడినదని తెలియుచున్నది. రసాయనశాస్త్రరీతిని క్రొవ్వు, నూనెయు నొకజాతిలోనివే. అందుచేతనే జాజికాయలోనుండి యెక్కువనూనెను తీయుచున్నారని యిదివరలో చెప్పియుంటిమి. శరీరమునకు వేడిపుట్టించుటలో మాంసకృత్తులుగాని, కర్బనోదజనితములను, పిండి పదార్థములుగాని పుట్టించు పరిమితికి దరిదాపు 2¼ అంతలు యీ క్రొవ్వులవలన మనకు కలుగుచున్నది. ఇందుచేతను, దానికిగల స్త్రీపురుషుల లింగావయవములపై కలిగించు గుణములచేతను, అవివాహితలగు బాలికాబాలకులు జాజికాయను తినరాదని యందురు.

ఇక బహుసూక్ష్మముగా దీని కృషివిధానము— మొదట చిన్నయాకుమడిలో జాజిపిక్కలనువేసి నారు వేయుదురు. ఆ నారుమొక్కలు 2-3 అడుగు లెదిగిన తర్వాత 10 గజములదూరమున పెద్దపాలములో నాటి పాతుదురు. మొక్కలెదుగుచున్నపుడు వాటికి సున్నపురాళ్ళపొడి, పచ్చియాకులరొట్ట, నత్రజనికొన్ని కంపెనీ యెరువులను బర్లియారులో నిచ్చుచున్నారు. వీటికి పురుగులు, చీడలు, కన్న మరికొన్నిమొక్కలు వీటి కొమ్మలమీద చేపుట్టి, పెరిగి, తుదకు చంపివేయును. కనుక యిటువంటివేమియు నుంచనీయరాదు. ఈ జాజి చెట్టులో మగ, ఆడ, భేదమున్నది. మనలోవలెనే యిందులోకూడ నాడిజాతి మొక్కలే కాయలను గాచును. (రెండునుకూడ పూచును. కాని ఆ పూవులలో నవయవభేదములున్నవి). మనకు కాయలు కావలసినప్పుడు ఆడచెట్లే యుండవలయును. మగచెట్లు అనవసరము. ఐనను మొదట వీటిలో నాడ, మొగ, పోల్చుకొనుట కష్టము. కనుక నవి పూచినపిదప 10 ఆడచెట్లకు ఒక మొగచెట్టుచొప్పుననుంచి, మిగిలినవాటిని తీసి పారవేయవలయును. ఆ తీసివేయుటలో గాలి వచ్చుతట్టున గల మగమొక్కలనే యుంచవలెను. అటుల చేయుటవలన వానిపుప్పొడి గాలికెగిరి దూరముగానున్న ఆడ పువ్వులపైపడును. ఇటులనే బొప్పసకాయలలో చేయవలసియుండును. చెట్లు 5,6 సం॥ కు కాయుట కారంభించును. ఆ కాపు 15,20 సం॥ వరకుపోవును. సరాసరిని చెట్టునకు 1500 కాయ లెక్కవేసుకోవచ్చును. ఒక్కొక్కకాయ 2-3 ఔన్సులు తూగును.

—గుమ్మలూరు సత్యనారాయణ, బి.ఎస్‌సి ఎజి.

# కన్నీరు

—కార్మికుడు, మానవంతుడు, ప్రభు కార్యము నెరవేర్చినగాని కడుపునిచ్చు తీర్చుకొనడు. ఇల్లాలు సాధ్వి. తనయధికారమునుండి ప్రమత్తుడు కాలేదు. ప్రభువు ముష్కరుడు. వానిచే మాటపడినాడు కార్మికుడు మనస్సు చితికింది.

తన కుటీరమున ఇల్లాలి వొడిలో తలవాల్చినాడు రుద్ధదృష్టితో నిర్మలాకాశాన్ని చూచుచున్నాడు.—

౧

ఏలొకో? యేమి?-అయ్యో యూ? యెందుకండి
చెప్పరే నాకు నిసుమంత చెప్పరాదె?
కారణంబేమొ-? కాల్వలై కనుల నీరు
పారుచున్నది పలుకరా ప్రాణనాథ!

౨

అతుల స్వచ్ఛందమౌ యాత్మ ఆర్తిగుంద
కావరమ్మున దూరె ముష్కరుడెవండు?
కనులు పొరగప్పి యధికార గర్వమునను
కనుల నీర్నిండ జేసిన కఠినుడెవఁడు?

౩

ధర్మపథమునబడి నమ్మి దైవతమును
సత్యముగ జీవనమ్మును సలుపనెంచి
కష్టమొడిగట్టి నిలుచుండ్రి నిష్ట మీాదు
కనుల నీర్నిండ జేసిన కఠినుడెవఁడు?

౪

పొంగి బయలుదేరుచునుండె నింకిఁదాక
వాలు కన్నీరు వరదలోఁ బాడుకదిలి
వాని పట్టిల్లను మునింగి భగ్నమగునొ?
యేమొ? నేడిట్లు—ఉన్నదానేచు మొండు.


౫

ఎండవానల కెంతయు నెండి తడిసి
సొలసి జీవించు కష్టజీవులము మనము
తలలు మారిచి రొప్పుడు ధనముకొఱకు
పరులపంచించు దుష్టవ్యాపారి యతఁడు.

౬

అట్టి వానిని ప్రభువుగా నంటగట్టి
కులుకు పరమేశు నాడిపోవలెనుగాని
పచ్చిమాంసంబు భక్షించు పశువతండు
వాని నిందింప ఫలమేమి వాగ్వ్యయమ్ము.

౧౧౪ —



పాపనాశనం



ప్రతిబింబము

౭

నీట తడిసిపోవుచునుండె బైటచెఱఁగు
నోట పలుకేని రానీక బాటయేది ?—
తరిగిపోలేదు యింతలో దైవమహిమ
మురిగిపోలేదు మంగళ సూత్రమహిమ.

౮

మురిపెమున శాంత మొలికెడు ముద్దుమోము
దుఃఖ కలుషితమయి వన్నెతొరగె—చూడ
కడుపు చెఱువగు - భరియింప గష్టమకట! -
కష్టజీవులకును తోడుకలదె దేవి!

* * * * * *

౯

నీరసచిత్తు ముష్కరు వినీతుని మాటలునమ్మి నోట నం
గార విదగ్ధలోహమయఖండములే కడు బోసికొంచు నా
హార విహారకృత్యముల నాసతొలంగియునుంటి వెఱ్ఱినై
భూరివిషాదఘూర్ణపరిపూరిత స్వాంతముతోడ నియ్యెడన్.

౧౦

నీరము పల్లమేయరసి నేర్పునబోయెడు భంగి చల్లగా
జారుచు నేగె జీవితపథమ్మున ముప్పదియేండ్లు దుష్ట వ్యా
పార తురుష్క భూపతుల పాలనఁ బుగ్గయి నింక శేష మీ
తీరున దుఃఖరాగములఁ దీయుచు బొమ్మనె దైవమక్కటా!

౧౧

వేగుజామున మేల్కని విధికి మ్రొక్కి
చిమ్మచీకటి రేఖలు చెలఁగి నిండు
వరకు పనిచేసిచూపిన పాపలైనఁ
గిట్ట దింకేటిలోకమ్ము నట్టిమాట.

౧౨

కష్టసుఖముల నీక్షించి కాచుధవులు
దక్షిణాశనుఁ బాలింపఁ దరలినారు
కార్మికులనోరు చెడగొట్టి గడనబ్రతుకు
క్రూరకర్ములెల్ల రున్నారు నేడు.

౧౩

కరకుకత్తుల దాలిచి కరుణలేక
నరుల పీడించి జీవింప దగుగు దుష్ట
ధనమదాంధుల యింటిలో దైవమహహ!
బందియైపోయె నేడు దివాంధమట్లు.

౧౪

కాలగతి మారునెప్పుడో మేలవగవ
కాలవశమున ఝగటిఁగష్టాలువచ్చు
నెంత తరచిన నీరము నేమి ఫలము ?
న్యాయమరయంగ దైవమున్నాడు లెమ్ము.

౧౫

మనలఁజూచిన పిల్లల మనసుచెదురు
వెతల గుందగ నిదికాదు వేళ చెలియ!—
ధర్మమార్గాన నడిచిపోదాము, మీద
నారువేసినవాడె పో నీరువోయు.

—స్థానాపతి రుక్మిణమ్మ.

# ముసలివాళ్ళ పడుచుతనం

[ఈ వ్యాసమున ప్రస్తావింపబడినవారందఱును అరువదియేండ్లకు పైబడిన వృద్ధులు. కాని వారు శక్తి, ఉత్సాహములందు యువకులే. ముసలితనములో ఈపడుచుతనమువారి కెట్లు కల్గినది ?]

'ముసలివాళ్ళ పడుచుతనం' అనే వ్యాసశీర్షిక చాలామందికి ఆశ్చర్యం పుట్టించునదిగా ఉండక మానదు. ముసలివాళ్ళకు పడుచుతనమేమిటి అనే సందేహం తోడనే కలిగితీరుతుంది. సరియైన ఆరోగ్య నియమములను పాటించుటచేతను, సక్రమమైన దేహపరిశ్రమ చేయుచుండుటచేతను ముసలివాళ్ళు సదా పడుచుతనం కలిగి ఉండవచ్చును. ఈసత్యాన్ని నిరూపించుటకు నేడు ప్రపంచేతిహాసమున శుక్రతారలై వెలుగొందుచున్న కొందరు వయోవృద్ధులు తమముసలితనంలో కూడా ఎట్లు పడుచుతనపుబింకము పోకుండా నిలుపుకొనుచున్నారో వివరించుచున్నాను.

## బెర్నార్డుషా

బెర్నార్డుషా ప్రఖ్యాతి అందరూ ఎరిగినదే. అతనికి ఇప్పటికి తొంభైయెనిమిదేళ్ళు నిండాయి. కాని మనిషిఆరోగ్యము కాసంతేనా చెదరలేదు. శక్తిసంపద చింతాకంతేని తగ్గలేదు. ఈ ఎనభైఏళ్ళ ముసలితనంలో కూడా అతడు దేహపరిశ్రమ విధ్యుక్తంగా చేసితీరుతాడు. అతడు శాకాహారముతప్ప అన్యం ముట్టడు. గ్రుడ్లు, పాలు మాత్రం సేవిస్తాడు. మాంసాహారమును తాను ముట్టకపోవడమే కాకుండా అతడు దాన్ని తీవ్రంగా నిరసిస్తాడు మాంసాన్ని తినడం చచ్చిపోయిన శవాల్ని తినడమేనని అతడు తనసహజ హాస్యధోరణిలో చెపుతాడు. అతని ఆహారం చాలాభాగం ఫలాలతో కూడి ఉంటుంది. ఉప్పు, కారము మొదలగునవి రక్తమున ప్రవేశించి క్రమముగా విషతుల్యములగునని అతడంటాడు. తేనీరు, సారాయి, పొగాకు-వీనిని కూడ అతగాడు దగ్గరకు చేరనీయడు. షా ప్రతిదినం పెందలకడనే లేస్తాడు. చన్నీళ్ళస్నానం చేస్తాడు. అవకాశంఉంటే బాగా ఈతకొట్టుతాడు. ఈతకొట్టిన తరువాత చిన్నచెడ్డీతప్ప మరేతా ఎట్టిబట్టా లేకుండా ఆతపస్నానం చేస్తాడు. అనగా శరీరానికంతటికీ ఎండ బాగా తగిలేటట్లు ఎండలో నిలబడతాడు. తరుచుగా అతడు గొడ్డలిపట్టి తనతోటలో కొయ్యదూలాల్ని కొట్టేపనికి పూనుకొంటాడు. లండను నగరంలో ఉన్నప్పుడు వీధులవెంట చాలసేపు నడుస్తాడు. పల్లెటూరులో ఉంటే పొలాలవెంట చాలసేపు నడుస్తాడు. అతనికి దేహపరిశ్రమ ఒక మతవిధి. విధియుక్తముగా అది జరిగి తీరవలసిందే. ఏ పరిస్థితులలో కాని దేహపరిశ్రమను మాత్రం అతడు ఏమరడు. 'ఎంప్రెస్ ఆఫ్ బ్రిటన్' అను ఓడమీద అతడు ఆనడుమ ప్రపంచయాత్ర చేసి ఉన్నాడు. ఆసమయంలో అతడు ఓడడెక్కుమీద యథారీతిని తన నడక సాగించువాడు. ప్రకృత్యనుగుణ జీవితముయొక్క విలువకు షా జీవితమొక అమోఘ నిదర్శనము. 'ప్రశాంతజీవనము—ఉన్నతభావములు' ఇది అతని ఆదర్శం. అతని అవయవచలనం కులుకుగాను చురుకుగాను ఉండి ముసలితనాన్ని మూసివేయును. తేజముకలిగి అతని నీలికన్నులు ఆనందముతోడను ఆరోగ్యముతోడను ఉద్వేలితములగుచు అతని యౌవనమును ప్రతిబింబించుచుండును.

## లాయడ్ జార్జి

యుద్ధకాలంలో బ్రిటీషుసామ్రాజ్యపు టదృష్టాన్ని అంతటినీ తన భుజస్కంధాలమీద నిలిపి నెగ్గివచ్చిన మంత్రిపుంగవుడు లాయడ్ జార్జి వయస్సుచేత ఇప్పుడు బాగా ముసలివాడయ్యాడు. కాని అతనిలో పడుచు

తనవు లక్షణాలేవీ సడలలేదు. అతని ఇప్పటి ఆరోగ్యం యువకులకుకూడా అసూయపుట్టించేదిగా ఉంది. రాజకీయాల్లో ఎల్లాఉన్నా తిండివిషయంలో అతడు చాలా మితంగాఉంటాడు. ఏమాత్రం అనుమానంగా ఉన్నా అజీర్తిచేసే పదార్థాలు దరికి రానివ్వడు. సాధారణంగా తేలికపదార్థాలే తింటాడు. వారానికి చాలా సార్లు గోల్ఫుఅనే కఱ్ఱబంతిఆట చాలాసార్లు ఆడుతాడు. అతని జీవితకాలంలోని రాత్రులలో నాలుగింట మూడుపాళ్ళ రాత్రులలో అతడు విధిగా పదిగంటలకే పడక్కి చేరుతాడు. గాఢంగా నిద్రపోతాడు. ఊరికే పడుకోవడం కాని, పడుకుని పుస్తకం చదవడం కాని, ఆలోచిస్తూ పడుకోడం కాని అతనికి బొత్తిగా కిట్టదు. రాత్రి గాఢంగా నిద్రపోవడమే కాకుండా పగలుకూడా ఎంతపనిఉన్నా మధ్యాహ్నమప్పుడు అతడు ఒక కోడి కునుకు తీస్తాడు.

## రాక్ ఫెల్లరు

ప్రపంచమునందలి కోటీశ్వరులలో రెండవస్థానమాక్రమించుచున్న జాన్ డేవిసన్ రాక్ఫెల్లరు జీవితము ఆంధ్రభూమి పాఠకులకు పరిచయమైనదే. అతడిప్పుడు తొంభైఏళ్ళ ముసలితొక్కు. సాధారణంగా అవయస్సులో అనుగుతీసి అడుగు పెట్టకలిగిఉండడం ఒక గొప్ప అదృష్టం. రాక్ఫెల్లరుమాత్రం ఇంకా బాగా దార్ఢ్యంగా ఉన్నాడు. కఠినమైన ఆరోగ్య నియమాలతో జీవితంఅంతా గడిపాడు. పని, ఆట, భోజనము, విశ్రాంతి—వీని అన్నిటియందును అతడు చాలామితంగా ఉండేవాడు. ఏడాదిలో మూడువందల అరవై ఆరు రోజులూ ఈ తొంభైయేళ్ళ ముసలితనంలో కూడా అతడు గోల్ఫుఅనే కఱ్ఱబంతిఆట ఆడుతాడు. ఆ ఆటలోకూడా పడుచువాళ్ళతో సమంగా సాటిగా ఆడతాడు. 1870 ప్రాంతాలలో వారానికి నాలుగైదు రోజులు మధ్యాహ్నమప్పుడు బహిరంగ ప్రదేశాలలో విహరించేవాడు. తోటలో బాటలువేయిస్తూ, చెట్లు నాటుతూ కాలక్షేపంచేసేవాడు. ఇది ఆరోగ్యమునకు, ఆనందమునకు కూడా అనువైనదని అతని అభిప్రాయం. 1870-వ సంవత్సరమునుండి నేటివఱకుకూడా అతడీ కార్యకలాపాన్ని మానలేదు. అతనంతటి డబ్బు ఉంటే కాని మధ్యాహ్నమప్పుడు కాలాన్ని అతనిలా తోటల్లో ఖర్చుపెట్టడానికి అవకాశం ఉండకపోవునని కొందరంటారు. వారికి నేను ఇట్లా సమాధానంచెప్పుతాను. తోటలలో తిరుగుతూ శక్తి ఉత్సాహములు నిలుపుకోకపోతే రాక్ఫెల్లరు ఇంతటి ధనికపుంగవుడు కాలేకపోవును. లాయడ్ జార్జిలాగ రాక్ఫెల్లరు కూడా మధ్యాహ్నభోజనమైన తరవాత ఓ కునుకుతీస్తాడు. ఏభైఏళ్ళగా అతడీ పగటినిద్రకు అలవాటుపడి ఉన్నాడు.

## కాప్టెన్ మాక్గ్రాత్

న్యూయార్కు మహాపట్టణమున ట్రాఫిక్ డిపార్టుమెంటునకు మాక్గ్రాత్ అధ్యక్షుడు. ప్రపంచమునందలి మహానగరములలోని ట్రాఫిక్లలోనికెల్ల న్యూయార్కు వీధులలోని ట్రాఫిక్ బ్రహ్మాండమైనది. అట్టి బ్రహ్మాండమైన ట్రాఫిక్ను క్రమపఱచుట. అతనికి ఏబదిఏండ్లు దాటినవి. ఏమాత్రము పొరపాటుజరిగినను విశేషధననష్టము, విశేషప్రాణనష్టము. వీటినన్నోర్చుచు ఆ వృద్ధుడు బల్లదగ్గర ఎంతకాలమైన కూర్చుండును. దినాంతమున బల్లదగ్గరనుండి లేచినప్పుడైనను అతని నేత్రములందు అలసట పొడగానరాదు. వీసమంతేని కసట కానబడదు. అతడు చిన్నతనమున పొలము దున్నినవాడు. నాటినుండి నేటివఱకు అతడు ఆరోగ్యనియమములను మీఱి యెఱుగడు. పల్లెటీపట్టువదలి న్యూయార్కుపట్టణమునకు వచ్చినప్పుడు అతడు ఇండ్లలో పనిచేయవలసివచ్చినది. పల్లెటీపట్టున బహిరంగస్థలములందలి గాలికి అలవడిన అతడు ఈపట్టణమున ఇండ్లలో పనిచేయవలసి వచ్చుటచే రాత్రిభాగమున నిద్రించుటకు పూర్వము బహిరంగస్థలములందు సంచరించి శరీరమునకు వాయుప్రసారము కలిగించుకొనువాడు.

## డాక్టర్ జాన్ ఫిన్లే

డాక్టర్ జాన్ఫిన్లే గొప్పసంపాదకుడు, విద్యాప్రదాత. అతనికి ఏబదిఏండ్లు దాటినవి. అతడు దినము

వను ఏడుమైళ్ళు నడవడం ఒకనియమంగా పెట్టుకున్నాడు. ఈ నియమం అతడు ఎంతనిక్కచ్చిగా ఆచరిస్తాడో డబ్లు.ఓ.ఇంగ్లిష్ అనువాడు 'ఫిజికల్ కల్చర్' అనుపత్రికలో ఇట్లు వ్రాస్తున్నాడు: 'శీతకాలమునందలి ఒకదివసమున నేనాతనితో నడుచుట తటస్థించెను. టైమ్సుస్క్వేర్ నుండి గ్రామెర్సీపార్కునందలి అతని యింటికి నడిచివెళ్ళుచుంటిమి. అతడు పడిశభారముతో బాధపడుచుండెను. కాబట్టి టాక్సీకారుమీద ఇంటికి వెళ్ళడం మంచిదని నేను చెప్పితిని సాధారణంగా పడిశభారం పట్టినవానిని కదలకుండా పడుకోవలసిందిగా డాక్టర్లు ఆదేశిస్తారు. టాక్సీకారు మీద వెంటనే యింటికి వెళ్ళడంమంచిదని ఆ కారణంచేత నేను ఫిన్లేతో చెప్పేను. కాని అతను నామాట వినలేదు. నడిచేవెళ్ళేడు. విచిత్రం ఏమంటే నడకచివర అతను చాలా తేలిగ్గా కనిపించాడు. బాల్యంనుంచీ కఠినవియమాలతో ఆరోగ్యం కాపాడుకుంటూవచ్చినవాడు కాబట్టి అతడు ఆపడిశభారాన్ని నడకచేతనే నయంచేసుకున్నాడు.

మనమందఱము బెర్నార్డుషా, లాయడ్ జార్జి, రాక్ఫెల్లరు, మాక్ గ్రాత్, జాన్ ఫిన్లేలము కాలేము కాని కొద్ది జాగ్రత్తతో రక్తమాంసయుతమగు మనశరీరయంత్రము జరాగ్రస్తమైనను శక్తి సంపన్నమై యుండునట్లు చేసికొనవచ్చును. క్రమమైన దేహపరిశ్రమ—శరీరమునకు అధికశ్రమకాని, అధికాహారము కాని ఈయకుండుట - ఇవి ముఖ్యము. పస్తు పెట్టుట ఎంతకోపమో హెచ్చుగా తినుటయు అంత దోషమే. ఆరోగ్యనియమములను బాగుగ పాటించుట వలననే బెర్నార్డుషా, లాయడ్ జార్జి, రాక్ఫెల్లరు మొదలగు ప్రఖ్యాత పురుషులు ముసలితనమున కూడ పడుచువాండ్రవలె పనులుచేయుచున్నారు. వీరి వయస్సున్న ఇతరులు కాటికి కాళ్ళుచాచుకొని ఉంటారు, వీరుమాత్రం శక్తిసంపన్నులై ఉత్సాహవంతులై ఉన్నారు.

—పి. బ్రహ్మాజీరావు, ఎం.బి.,బి.ఎస్.

# పశ్చాత్తాపం

"అమబ్బు యీమబ్బు
ఆకాశమధ్యాన
అద్దుకున్నట్లు మన
మైక్య మాదామె?
.... .... .... .... ...."

శశికి విశుకు చిన్నప్పటినించే స్నేహం. యిద్దరు ఒకబళ్ళోనే చదువుకునేవాళ్ళు. వాళ్ళ యిళ్లుకూడా దగ్గరే. బాల్యంనించీ శశి అల్లరిపిల్ల. ఆ కళ్ళల్లోంచి, ఎర్రని పెదిమెల్లోంచి, నొసట్లోంచి అల్లరితనం పొంగిపొరలుతూవుంటుంది. ఆమె పెంకెతనానికి ఆడపిల్లలు సరేసరి మొగపిల్లలుకూడా భయపడేవాళ్ళు ఆ అమ్మాయి లేకుండా ఒకా ఆటా, పాటాయేమీ జరగదు. బాగా పాడలేకపోయినా ఆమెకంఠంలో మాధుర్యముంది. ఉత్సాహంతో, స్వాభావికంగా తలవాడిస్తూ, అల్లరి కళ్ళని మిటకరిస్తూ సన్నగామృదుత్వంగా పాడుతోంటె యింటోవాళ్ళంతా గానతరంగాల్లో మైమరచి చిటికలేసేవాళ్ళు. ఊరిబయట చింతలలో శశి పసులకాపరులు కట్టిన వుయ్యాలలూగుతో సన్నగా కూనరాగాలు తీస్తోంటె ఆకాశంమీద గంధర్వులు పాడుతోన్నట్టనిపిస్తుంది. ఆమె కనపడినప్పుడల్లా పిల్లలంతాచుట్టుమూగి, ఏదోఆట చూపించమని, ఏదోపాట పాడమని ఏడిపించుకు తినేవాళ్ళు. ముసలివాళ్ళకి చిన్నవాళ్ళకి శశంటె అమితమైనప్రేమ చిన్నచిన్నపిల్లలంతా ఆమెని చూట్టంతోటే చుట్టేసుకునేవాళ్ళు. శశికూడా పిల్లలంటె అమితమైనప్రేమ. రంగురంగుపేలికల్తో జడేసి, తలలో తీరుతీరుపూలుపెట్టి అందంగా తయారుచేసేదివాళ్ళని.

శశి చురుకైనపిల్ల. రెండురోజుల్లో అక్షరాలు పూర్తిచేసింది. లెక్కల్లో క్లాసులో అందరిని మించింది. ఒకమాసంలో అనర్గళంగా చదవటంనేర్చుకుంది. బడి పంతులెప్పుడూ ఆమెనే మెచ్చుకునేవాడు. బొంగరాలు, గోటికాయల్లో విశు యెప్పుడూ ఆమెని మించలేదు. ఆమెముందర అతనికి బాగా ఆడ్డానికూడా చాతకాకపోయేది. సరిసమానంగా ఆమెతో ఆడటంమానేసి

ఆమెవెనకాల హాంగుచేయడం నేర్చుకున్నాడు. ఇది చూచి జాలికొంది విశంటె నెమ్మదిగా ప్రవర్తించడం మొదలెట్టింది శశి.

శశి అందమైనపిల్ల. కొంచెం పొట్టిమనిషి. సన్నగా నాజూగ్గా వుంటుంది. విశుకన్న రెండేళ్ళు చిన్న. ఆఅమ్మాయికి తన శరీరంమీద ఎంతో అభిమానం. రోజుకి రెండు మూడుసార్లు స్నానంచేసి శుభ్రంగా వుంటుంది. మురికి వాళ్ళను తాకదు సరికదా వాళ్ళని దగ్గరికైనా రానిచ్చేదికాదు. శశికి పెళ్ళయింది. శశిని కాలేజిలో ఎమ్.ఎ. ఫైనల్ చదువుతోన్న వొకాయన కిచ్చారు. అత్తవారు చాలా నగలెట్టారు. పెళ్ళవగానే ఆ పిల్లని బడి మానిపించారు. శశి మెట్రిక్యులేషన్ వరకు చదివి విరమించింది. విశు యింటర్ చదవడానికి బెనారస్ హిందూ యూనివర్శిటీ కెళ్ళాడు. * *

ఏళ్ళుపైబడ్డకొద్ది శశి శరీరంలో మెరుపు నిగనిగ హెచ్చింది. యువకులని బాహాటంగా ఆకర్షించే శరీర అవయవాలన్నీ బాగా యేర్పడ్డాయి. అందరు ఆ అమ్మాయివొంకే చూచేవారు. వాళ్ళల్లా యేకాగ్రంగా ఆమెని చూస్తుంటే విశుకు వొళ్ళుమండేది. అతనివస్తు వేదో అతనిదగ్గరనించి దొంగిలించి నట్టనిపించేది. తెలియకండా దొంగలించడమే కాదు బలవంతాన పశుబలం ఉపయోగించి లాక్కున్నట్టనిపించేది. అతనిస్వంతాన్ని, సర్వస్వాన్ని, చిన్నప్రాణాన్ని వొదల్లేక, వదల్లేక వాళ్ళ కప్పగించేవాడు. బాల్యంలో శశిని, 'యెవరినిచేసుకొంటావని' అడిగితే తలవాల్చి క్రీగంటిచూపుల్తో, సిగ్గ నభినయిస్తూ వినీవినపడకండా విశుపేరుచ్చరించి మాయమయ్యేది. మరుక్షణమే అదంతామరచి అతనిదగ్గరికి తొరగా పరుగెత్తుకొచ్చి అతన్ని లాక్కుపొయ్యేది. 'భార్యాభర్త' ఆట ఆడుకోడానికి. అల్లాంటి చిన్ని ప్రాణాన్ని ముద్దులగుమ్మని ఇంకొకారికిస్తే యెట్లా వూరుకోగలడు?

అతను మెట్రిక్యులేషన్ చదువుతోండగా వాళ్ళకి బాగా అవకాశాలుదొరికేవి, వొకర్ని వొకరు కలుసుకోడానికి. చదువు మిషమీదనో, స్కూలు మిషమీదనో యెల్లాగో యిద్దరు పోగయ్యేవాళ్ళు వొకదగ్గర. ప్రేమ వృద్ధిపొందుతున్నకొద్దీ ప్రతిబంధకాలెక్కువయినాయి. ప్రేమవిషయంలో వాళ్ళకి దాపరికమంటె యేమిటో తెలియదు. యెంతప్రేమని వాళ్ళు, మండిపోతోన్న హృదయాల్లో అణచుకోనేందుకు శక్తిలేదు. వాళ్ళకి అట్లా అణచుకోలేనివాళ్ళనే సంఘంవెలేస్తుంది. యే ఉద్రేకాన్ని యువకులకి కనపర్చకండా జనసామాన్యాన్ని మోసంచేసేవాళ్ళని సంఘంపొగుడుతుంది.

వొకనాటిరాత్రి తోటలో కాలువొడ్డున కూర్చుని వెన్నెల్లో స్వచ్ఛంగా ప్రవహించే నీటితో ఆడుకొంటున్నారు వాళ్లిద్దరు. వెనకాల కాళ్ళచప్పుడైంది. నిర్లక్ష్యంగా చెంగల్నతికించి భుజాలమీద చేతులేసుకొని స్వర్గతుల్యమైన ఆనందం అనుభవిస్తూ వుయ్యాలవూగుతున్నారు. వొకబలమైన చెయ్యి విశునుపట్టుకుంది. వెనక్కితిరిగి చూచునుకదా శశితండ్రి. మాట్లాడకండా తలొంచుకున్నాడు. యిద్దర్ని నాలుగుచీవాట్లుపెట్టి తరిమేశాడతను. విశువెనక్కితిరగకండా పారిపోయినాడు. మరుసటిరోజునుండీ శశి కనపడలా. అత్తవారింటికెళ్ళిందని తెలిసింది. * * *

రెండేళ్ళుగడిచాయి. శశి విశ్వేశ్వరరావు కోసం కృశించి కృశించి మంచంపట్టింది. మొదట్నించి భర్తంటె ఆమె కసహ్యం. ఆమె అతనికి హృదయంయివ్వలా. ప్రేమ ఆమెశక్తిలోనిదా మరి? ప్రేమించడం ప్రేమించక పోవడం వొకరిశక్తిలోదికాదు. సాధారణంగా కొంతవరకణచుకోవడం, వృద్ధిపొందించడం మనుషుల స్వాధీనంలో ఉంటుంది. 'విశు'నుండి మనస్సు మరల్చేందుకు విశ్వప్రయత్నం చేసిందికాని ఆమె పట్టుదల ఫలవంతంకాలా. ఆమెభర్త కృష్ణారావుకి ఆమెయేదో మనోవ్యథతో కృశించుచున్న విషయం తెలిసింది. యెన్నోమార్లు సంగతి కనుక్కోడానికి ప్రయత్నం చేశాడు కాని అంతుదొరకలా.

వొకనాడు వొంటిగంటకి కృష్ణారావు సినిమానించి తిరిగొచ్చాడు. శశి మంచంమీద నిద్రపోతోన్నట్టు పడుకుంది. సన్నగా దీపం పక్కన వెలుగుతోంది. గదిలోకొచ్చి పడుకోటానికి కోటు విప్పుతో శశిని

పలకరించాడు. జవాబు లేదు. వొచ్చి మంచంమీద కూచుని ఆమె మొహం తనవేపు తిప్పుకుని ఆమెను తన తొడలమీదికి లాక్కున్నాడు. కళ్ళల్లోంచి నీళ్ళు కారి చెంపలకు వెంట్రుకలతుక్కు పోయినాయి. మొహం మీది ముంగురులు సవరిస్తూ 'శశీ!శశీ!' అని మళ్ళీ పలకరించాడు.

శశి మెల్లగా కళ్ళువిప్పింది.

'యింతవిట్టుకు యెందుకేడ్చావు చెప్పు'

'యేమిటో! తెలీదు, యెందుకో భయమేసింది.'

కృష్ణారావుకి రెండుసంవత్సరాల్నించి తన భార్యతో మెలగడం చాలబాధగావుంది. ఆమె యింకెవరినో ప్రేమిస్తున్నదని అతనికి తెలుసు.

చెంపలునిమురుతూ 'చెప్పవు! నీకేంబాధో? నేను నీవాణ్ణి కానా? నాతో చెప్పడానికేం? నీబాధ పోగొట్టడానికి నాసాధ్యమైనంత ప్రయత్నం చేస్తా చెప్పు మరి నా శశివికదూ! యెందుకూ అంతబాధ నేనుండగా'

శశికి తనమనోవేదనంతా తనభర్తకి చెప్పి శాంతి పొందాలనిపించింది. కాని చెప్పేస్తె......అమ్మొయ్యో తరువాతసంగతి.........

ఆరాత్రి శశి తనభర్తతో తనమనోవేదన గురించి యేమీచెప్పలా. అయిష్టత, వైముఖ్యం, కనఃకృటం తోటె కృష్ణారావు అసంగతి గట్టిగా కదపకండా మూకీభావం వహించాడు. * * *

ఒకనాడు తోటలో పొగడచెట్టుకింద పేము కుర్చీలో శశి నిద్రరాక మత్తుగా పడుకుంది. గాలి రివ్వున వీచడంమాని తెలియనట్టు మెల్లగా ఆమె వెంట్రుకల్లోంచి కదుల్తోంది. శీతకరుడు ఆకాశంలో మేఘాలతో దాగిలిమూతలాడుతో చెట్టుకొమ్మలలోంచి శశిని తొంగిచూస్తోన్నాడు. వెనకాలయింటి అవరణం గోడదూకి యెవరోవస్తోన్నట్టు కాళ్ళచప్పుడైంది. చప్పున శశి వెనక్కు మళ్ళింది. యేదో మణిగిపోయినట్టు యెగదమ్ముతో పరుగెత్తుకొస్తున్నాడు తన విశు. చివాలునలేచి స్వాగత మివ్వాలనుకుంది కాని నీరసం చప్పున లేచేందుకు శక్తినివ్వలా. ఉద్రేకంతో వొణుకుతోన్న శరీరాన్ని స్వాధీనంలోకి తెచ్చుకొని విశు తనని పలకరించే లోపల నెమ్మదిగా లేచింది. సంతోషం, తొలి కాదుతోన్న కన్ని పెదిమెల్తో, విశాలమైన నొసట్లో గాలికి గంతులేస్తున్న ముంగురులతో, స్వాగతమిచ్చింది. అడ్డుతీసేస్తే కలుసుకునే రెండుప్రవాహాల్లాగ, అలుముకుని పెదిమలతోంచి వొహరివెచ్చని వూపిరిని యింకొహరు పీలుస్తూ తన్మయత్వం చెందారు. రెండు నిముషాలు వొహర్ని వొహరు చూస్తూ వొణికిపోతోన్న శరీరాలతో నిండు హృదయాలతో కాగితపు ప్రతిమలకు మల్లె మాట్లాడకుండా నుంచున్నారు. యిప్పుడు తెలిసింది విశుకి తనప్రాణం తన సర్వస్వం తనకోసం ఆవేదనతో యెల్లా కృశించిపోయిందో. కాస్త సమాళించుకొని 'యెందుకొచ్చావు నాకోసమంత తొరగా పరుగెత్తుతో?'

'ఏంచెయ్యను?......శశీ! శశీ! నిన్ను చూచి రెండేళ్ళు అయిందికదూ మరి. యెన్ని రోజులని వొంటరిగా కాలంగడపను?'

'యేంచేస్తావుమరి! దయాదాక్షిణ్యంలేని సంఘ నిర్ణయప్రకారం బలవంతాన తీసుకొచ్చి నన్నిక్కడ ఖైదుచేశారు. వూహించుకునేందుకు నాకు అందరికీ మల్లె వొహ మస్తిష్కముందని వాళ్ళకెల్లా తెలుస్తుంది. క్రూరంగా అమానుషంగా నన్ను గొడ్డుకుమల్లె లాక్కొచ్చి యింతకుముందు యెన్నడెరగని వొహాయనకు వొప్పచెప్పారు. వాళ్ళ క్రూరత్వాన్నంతా సహించి యితరులకు మల్లె నోట్లోనాలుక కదపకండా వుంటె నన్నుకూడా సంఘం పొగిడేది. కాని యేంచెయ్యను. నా వ్యక్తిత్వాన్ని చంపుకొని ఆయనతోడను మల్లె మెలగడం నాకు దుస్సాధ్యమని తోచింది;

'వూరికె ఆలోచిస్తుకూర్చుంటె లాభంలేదు. తలచుకున్నపనిని నిరాఘాటంగా, నిష్కపట్యంగా త్వరలో చేయడమేమంచిది. నాతోరావడమో లేక యెప్పటికి మల్లె కష్టాలనుభవిస్తో యిక్కడేవుండడమో దబ్బున తేల్చుకో, 'విశూ! పదిరోజులు గడవనియ్య. మనుసు కుదుటపరచుకొని అవధి కాగానే యేదో వొకటి నిర్ణయించుకొని చెపుతా' * * *

విశ్వేశ్వరరావు శశికి అవశ్యకమైన గడవిచ్చి వెళ్ళాడు. శశి యీ పదిరోజులలో యేదో వొకటి నిష్కర్షగా తేల్చుకుచెప్పాలి. ఆమెహృదయంలో కర్తవ్యానికీ ప్రేమకీ ఘోరాఘోరియుద్ధము జరుగుతోంది. మనోదార్ఢ్యత లేకపోవడంవల్ల యేమీ తేల్చలేకపోయింది. గోరుచుట్టుకి రోకలిపోటన్నట్టు ఒకనాటి సాయంత్రం సన్నని జ్వరం తగుల్కొంది శశికి. కృష్ణారావు డాక్టరుకి కబురంపించాడు. డాక్టరు రోగిని పరీక్షించి నెమోనియా అని నిర్ధారణచేశాడు. ప్రస్తుతంలో కృష్ణారావుదగ్గిర వొకా చిల్లిగవ్వన్నా లేదు. మరి యిప్పుడు డాక్టరుకి మందులకీ డబ్బుకట్టడంయెట్లా, వొకరోజు సాంతం బాగా ఆలోచించాడు. ఒక్కదారితప్ప యింకేదీ కనపడలా బాగా ఆలోచిస్తే అదే క్షేమమనిపించింది. బేహారు ప్రజలకి హోగుచేసినధనం ప్రస్తుతం ఖర్చుపెట్టుకొని యెనిమిదిరోజుల తరవాత వాళ్ళకి పంపితేం? తనేమన్నా డబ్బు అసలు పంపకండా కాజేస్తున్నాడా! మరి యెందుకింతభయం? అతనికేదో దుష్కార్యంచేస్తున్నట్టనిపించింది. కాని వొకవైపు భార్య ప్రాణాలమీదికొస్తె యెట్లా వూరుకోగలడు. యెనిమిదిరోజులలో డబ్బురాగానె పంపెయ్యొచ్చుగా వాళ్ళకి. శశికాస్త కోలుకొంటోంది. రాత్రిళ్ళు నిద్రపోకండా యేదో పుస్తకము చదువుతో ఆమె మంచం పక్కనె కూర్చునేవాడు కృష్ణారావు. మూసుకపోతోన్న కళ్ళతో అతనట్లా రాత్రిళ్ళు కూచోవటం చూచి శశికి జాలేసింది. పడుకొమ్మని యెన్నిమార్లు బలవంతపెట్టినా పడుకునేవాడుకాదు. వారంరోజులు నడిచింది. శశి మెల్లగాలేచి అటితిలయిటతిల తిరుగుతోంది. దేహంలో శక్తి క్షీణించింది. కృష్ణారావు బేహారు ప్రజలడబ్బు ఖర్చుపెట్టుకున్నసంగతి అందరికీ తెలిసిపోయింది. ఆయన అనుకున్నట్టు నిర్ణీతసమయానికి స్వంతడబ్బు అందలా. పాపం కృష్ణారావు యిబ్బందులు జనబాహుళ్యానికేం తెలుసు? యెందుకు ఖర్చుపెట్టుకున్నాడో అతని ఉత్తరువుపొందకండానే నలుగురు నాలుగువిధాల చెప్పుకోడం మొదలెట్టారు. 'యీ లీడరులంతాయింతే ప్రజలడబ్బు అపహరించేందుకే యీ దొంగవేషాలువేస్తారని' వొకరు. మొదట్నించి యిట్లా అవుతుందని అనుమానిస్తూనె వున్నానని, యింకొకరు, యెవరికితోచినట్టు వాళ్ళు అనుకోడం మొదలెట్టారు. యీ విషయాన్నిగూర్చి అతను కోర్టులో యేమీ చెప్పుకోలా. కోర్టువాళ్ళు రెండేళ్ళ కఠినశిక్ష విధించారు. అతని వెనుకటిసుగుణాల్ని, ఉదారస్వభావాన్నికూడా లెక్క చేయకండా.

* * *

శశిగుండెల్లో రాయిపడ్డట్టు అయింది తనభర్త సంగతి విని. అతను తనకోసమే యింత త్యాగం చేశాడని తెలుసు. దేశం అభ్యుదయంకోసం, ఔన్నత్యంకోసం అతనెట్లా అహర్నిశాలు పాటుపడ్డాడో ఆమెకు తెలుసు. కూటికోసం మలమల మాడుతోన్నట్టి ప్రజలకి తనసర్వస్వం యెట్లా ధారపోసింది ఆమెకు విదితమే. జైలుకుపోవడంతోటె అతను ఉపక్రమించిన నాన్-కో-ఆపరేషన్ వొకమెట్టు కుంటుపడింది. భర్త ఆరంభించిన ఉద్యమాన్ని తను కొనసాగించడం తన కర్తవ్యమనుకుంది. సరియైన నాయకుడు లేక సైనికులంతా యుద్ధరంగంలో చెల్లాచెదురైనసంగతి గమనించింది. తను, ఉద్యమాన్ని కొనసాగించేందుకు దీక్షాకంకణం కట్టుకుంది. యితరులను తన వుపన్యాసాలతో ప్రోత్సహించింది, కార్యరంగంలోకి దిగడానికి ప్రవాహంలో తృణకమల్లె నిర్ణీతమైన జీవితోద్దేశ్యంలేని విశ్వేశ్వరరావుకూడ యీ వుద్యమానికి దోహదమిచ్చాడు. కాలేజివదలి ప్రభుత్వానికి విరుద్ధంగా ప్రచారం మొదలెట్టాడు. కొద్దికాలంలో అపారమైనకీర్తి గడించాడు.

అయిదునెల్లు గడిచింది. జైలులో కృష్ణారావుగారు బాగా జబ్బుపడ్డారు. ప్రభుత్వం అపకీర్తికివెరచి చావసిద్ధంగావున్నవాణ్ణి వొదిలింది. శశి అతన్ని యింటికి తీసుకొచ్చి విద్యుక్తమనేభావంతో వుపచారం మొదలెట్టింది యిప్పుడప్పుడె కోలుకునేస్థితిలో లే దాయన శరీరం.

* * *

ఈ మధ్యలో 'విశు' యెన్నో వుత్తరాలు రాశాడు శశికి భర్తనువదలి తన దగ్గరికొచ్చెయ్యమని. యీ విషమస్థితిలో అతన్ని వదిలివెళ్ళడం ఆమెకు మనస్కరించలా. బాగా ఆలోచించింది. భర్త శుశ్రూషచేస్తుండడమే తన విద్యుక్తధర్మమని నిర్ధారణచేసుకొంది. భర్త తనకోసం త్యాగంచేసి ప్రాణాలమీదికి తెచ్చుకు

న్నప్పుడు తను ఆమాత్రం అతన్ని కనిపెట్టుకుండలేదూ? సాయంత్రమయి మెల్లగా చీకటిపడుతోంది.

శశి కోవాగదిలో బల్లముందుకూచుని అవసరమైన కాగితాలేవో చూసుకొంటోంది. కిటికీగుండా చంద్రికలు ఆమె మొహంలోకి అప్రయత్నంగా ప్రవహిస్తున్నాయి. విశ్వేశ్వరరావు గుమ్మందగ్గర నుంచున్నాడు. శశి దివాలునలేచి గుమ్మందగ్గరికి కెళ్ళింది.

'ఎందుకొచ్చావు'

'రాక యేంచెయ్యమనుకి! ఎక్కడ నిలుస్తుంది ప్రాణం?'

శశి గుండెనీరైంది. సున్నితమైన హృదయవీణను ఎవరో ఆప్యాయంగా మీటినట్టయింది కళ్ళల్లో నీళ్ళు కమ్మాయి.

'పాపం నాకోసం నీవెంత బాధపడుతావో? ప్రతి నిముషం నీసంగతె తలుచుకొంటో వుంటా. విసూ! నన్ను మరిచిపో పెళ్ళిచేసుకు సుఖంగా వుండు.'

'ఇదా నీవుబోధించేది నాకు. ఎల్లా మరిచిపోను, నాప్రాణాన్ని, నాప్రేమముద్దని.'

'విసూ! నీవు దీనంగామాట్లాడి నాధృడసంకల్పాన్ని మనోదార్ఢ్యతని చెడగొట్టకు. నేను వదిలివచ్చే స్థితిలో లేదాతను. యిహానీతో వుండడము నాకు గిట్టదు. ముమ్మాటికి వుండకూడదా'

'యేఁ! నామీద ప్రేమలేదా'

'వుంది, చాలావుంది. నావక్షాన్ని తెరిగితే నీప్రతిమ దాంట్లోంచి బయటపడుతుంది, కాని యేంచెయ్యను. ఎందుకో ఆయనమీద అమితమైన ప్రేమ కలిగింది. ప్రేమో, జాలో, తెలియడంలేదు. ఆయన మొహాన్ని చూస్తే యేదో చెప్పరాని ఆనందం పుట్టుకొస్తుంది నాహృదయంలోంచి. ఆయన మీది ప్రేమ నీమీది ప్రేమవంటికాదు. అది భక్తితో మిళితమైంది. నీమీదద్ది అది భోగలాలసతతో కూడుకున్నది. నాదేశంకోసం, నాప్రజలకోసం ఆరోగ్యాన్నంతా ధారపోసి అల్లా అయినాడాతను.'

'శశీ! శశీ! మరి నా సంగతి'

'మరిచిపో అదంతా మరిచిపో. నీహృదయాన్ని లాక్కని నిన్ను బాధపెట్టినందుకు క్షమించు. లక్షసార్లు క్షమించు. వెళ్ళు, వెళ్ళమనడానికి నోరురాదు కాని యేం చెయ్యను.'

'శశీ.........'

'వెళ్ళు! వెళ్ళు నీకు నమస్కారంచేస్తా. నా నిశ్చయాన్ని చెడగొట్టకు'

విశ్వేశ్వరరావు వెళ్ళిపోయినాడు. శశి కుర్చీలో జారగిలపడి సన్నగా యేడుస్తోంది. లోపలిగదిలోంచి భర్త పిలుపు

'శశీ.........'

'వెళ్ళు అతన్నివొదిలి నీ వెల్లావుంటావు. వెళ్ళు నీకు తృప్తి. హాయి, ఆనందం అక్కర్లా?'

'ఆసంగతి మాట్లాడకండి. అదంతా అయిపోయింది. నా హృదయం పరివర్తనంచెందింది. ఎప్పుడూ మీ దగ్గరేవుండి మీ పాదసేవచేస్తూ పతివ్రతురాల్ని కావడానికి నన్ను ఆశీర్వదించండి. మీ సేవచేయడం నాకు స్వర్గతుల్యంగావుంది. యిల్లాంటిసేవ ఎవరికిలభిస్తుంది!'

.......................................

సాయంత్రం అయిదుగంటల సమయం యింకా చీకట్లుకమ్మలా. విశ్వేశ్వరరావు తడబడుతోన్న కాళ్ళతో దొంగతనంగా కృష్ణారావుబంగళాను సమీపించాడు. ముసకచీకట్లో బంగళాకానుకునివున్న జామచెట్టెక్కి అతని పడకగదిలోకి తొంగిచూచాడు, చెట్టుపక్కనవున్న కిటికీగుండా, కృష్ణారావు మంచంలో ప్రశాంతంగా నిదురిస్తున్నాడు. గదిలోదీపం సన్నగా వెలుగుతోంది. పాదాలొత్తుతో శశి అతనికాళ్ళమీద మత్తుగా పడిపోయింది.

విశ్వేశ్వరరావు ఈ దృశ్యాన్నిచూచి చకితుడైనాడు. పానకంలోపుడకలాగు వాళ్ళ ఆనందాన్ని ఎల్లా అంతమొందించగలడు. శశి తనతోవుండిపోయి అంతకన్న ఎక్కువేం ఆనందం అనుభవిస్తుందని. గిరున వెనక్కుతిరిగి కెవ్వుమని నోరుతెలియకుండా తడబడుతూన్నకాళ్ళతో వెర్రిగా పరిగెత్తాడు ఎక్కడికో ఆ చీకట్లలోకి.

— బి. కృష్ణారావు.

జి
జ్ఞా
స

మీ
మాం
స

> విజ్ఞానసంపాదనావసరమున వివిధవిషయములందు కలుగు సందేహములను నివారించుకొను పత్రికాముఖమున జిజ్ఞాస సలుపుటకును—ఇందలి ఏ ఒక్క జిజ్ఞాసకైననుసరే సరియైన సమాధానము తెలిసియున్నచో దానిని కూడినంత సంగ్రహముగ వ్రాసి, ప్రచురణార్థము పంపుటకును ఆంధ్రభూమి పాఠకులను ప్రార్థింతుము.
>
> —సంపాదకుడు.

### 41. సంశయము

ఇందు వ్రాసిన శ్లోకములోని స్త్రీ పాడుట కుపక్రమించి యీ క్రింది కారణముచే వీణను విడిచెను. లేడికి సంగీతము వినుటయందెక్కువ ఆసక్తి యుండుటచే వీణానాదము వినుటకై చంద్రునిలోని లేడి వచ్చినయెడల చంద్రుడు కళంకములేనివాడగును కనుక కళంకముతో కూడిన చంద్రుడే విరహిణులను బాధపెట్టుచుండగా కళంకములేని చంద్రుడు యెంతబాధపెట్టునోకదా, అను భయముచేత వీణను వెంటనే విడిచిపెట్టెను.

—యస్. వెంకటేశ్వర్లు.

### 47. మతములవారీగా జనసంఖ్య

| | |
|---|---|
| 1. క్రైస్తవులు | 682 400,000. |
| కన్ఫ్యూషియనులు | 350 600 000. |
| హిందువులు | 230,150,000. |
| మహమ్మదీయులు | 229,020 000. |
| బౌద్ధులు | 150 180 000. |
| ఎనిమిష్టులు | 135 650 000. |
| యూదులు | 15 630,00. |
| తదితరులు | 50 870.000. |

పై లెక్కనుబట్టిచూడగా మన హిందూమతము జనసంఖ్యనుబట్టి చూచినచో ప్రపంచమతములలో మూడవస్థాన మాక్రమించుచున్నది అమెరికాయందు ప్రచురింపబడు లాస్ఏంజల్స్ టైమ్సు అను పత్రికనుండి.

—నారాయణస్వామి.

2. ప్రపంచమునందలి మొత్తము

| | |
|---|---|
| జనసంఖ్య | 1,646,491,000. |
| క్రైస్తవులు | 564,510,000. |
| కన్ఫ్యూషియనులు | 300,830,000. |
| మహమ్మదీయులు- | 221,825,000. |
| హిందువులు | * 210,540,000. |
| ఎనిమిష్టులు | 158,270,000. |
| బౌద్ధులు | 138,031 000. |
| షింటోయిష్టులు | 25,000,000. |
| యూదులు | 12,205 000. |
| తదితరులు— | 15,280,000. |

(1) పై లెక్కలనుబట్టి హిందూమతము ప్రపంచమతములలో నాల్గవదిగా వచ్చుచున్నది.

(2) * 1931-సం॥ హిందూదేశ జనసంఖ్య ప్రకారము హిందువులు 239,195,140.

(Joseph whitaker. F.S.A. 1917 Almanac.)

—పి.వి. సోమయాజి.

### 48. టాజ్‌మహల్ కట్టినదెవరు ?

అసలు ఈసందేహము లేకయేపోయెడిది. షాజహాను చక్రవర్తి కాలములో అతనికిగల యుత్సాహమువలన శిల్పము, చిత్రలేఖనము పుంచి అభివృద్ధిలోనికి వచ్చినవి. ఆయుత్సాహ ఫలితముగా ఒక టాజ్‌మహాలు, ఒక నెమలి సింహాసనము, ఇంకను ఇతర శిల్పములు భారతదేశమున కాతడు ఉపహారమిచ్చినాడు. ఇంతటి నిరుపమాన సౌందర్య విలసితమగుటచే టాజ్‌మహాలు కట్టిన ప్రతిభాశాలి యెవ్వడోయని ప్రపంచమునకు తెలిసికొనుటకు కుతూహలము కలిగినది. హిందూదేశీయులందఱును షాజహాను కట్టించిన శిల్పమని తెలిసికొని తృప్తినొంది యుండిరి. ఎవ్వడు కట్టినను, కారకుడగు రాజే నిర్మాత యని తృప్తి. అది హైందవుల యాచా

రము. కాని పదునెనిమిదవ శతాబ్ది కడపటను, పందొమ్మిదవ శతాబ్దిలోను వచ్చిన యూరోపియను విద్యాధికులకు టాజ్ కట్టిన పనివాఁడెవ్వరో తెలిసికొనగుతూహలము జన్మించినది. అందులకై తగిన యాధారములకై వారు ప్రయత్నించిరి. వారికి తెలిసినట్లు నిర్ణయించిరి. స్మిత్తు 'హిందూదేశములోను, సింహళములోను నున్న లలితకళా, శిల్పము'లను గూర్చి విశేషపరిశ్రమచేసి యొక గ్రంథమును వ్రాసినప్పు డందులో ఈవిషయమై చర్చింపఁబడినది. అంతకుముందే 'టాజ్ కట్టిన ఏదేశస్థుఁడు?' అను విషయముపై చర్చలు జరిగియుండెను. ఆచర్చలను, వాని సారాంశములను, స్మిత్తుగారు విమర్శించి తన యభిప్రాయమును వెలిబుచ్చినారు. ఆవిషయమిది*:—

యూరోపియనులు కట్టినారనుటలో గూడ అభిప్రాయభేదములున్నవి.

(1) స్లీమెన్ తన హిందూదేశపు సంచారములో టాజ్ మహాలునుగూర్చి వ్రాసెను. ఈ ఫ్రాంసుదేశీయుఁడు టాజ్ మహాలు తనదేశీయుఁడే యైన 'ఆస్టిన్ డిబోర్డో'చే ప్లాను వేయఁబడి కట్టఁబడినదని సూచించెను. అయితే 'ఉస్తద్ ఈసా'చే కట్టఁబడినదని యొక విషయ మాతఁడు వినెను, అందువలన 'ఆస్టిన్ డి బోర్డో' నే ఉస్తద్ ఈసా అన్నారని సమాధానము చెప్పివైచెను. (ఉస్తద్=ఆస్టిన్‌డి; ఈసా = జీసస్, మిషనరీయగుటచే జీసస్ మతమునకు చెందినవాడని అట్లు పిలిచిరని ఈతనివాదము.)

(2) బాల్ఫోర్ హిందూవిజ్ఞాన సర్వస్వములో గూడ ఇట్లే వ్రాయఁబడినది.

కాని, విన్సెంటుస్మిత్తుగారే ఈవాదమును ఖండించిరి. స్లీమెను పొరపాటుపడెను. ఆస్టిన్ డి బోర్డో నెమలిసింహాసనమును నిర్మించుటలో 'కుందనపుఁబని'లో సహాయముచేసినట్లు ఆధారములున్నవి. ఆసహాయము టాజ్ మహాలు విషయములో అని స్లీమెను పొరపాటు పడినాఁడు. ఇక బాల్ఫోర్ విజ్ఞానసర్వస్వములోని విషయము పూర్తిగా స్లీమెను వ్రాత ననుసరించియే వ్రాయఁబడుటవలన పైవాదముచే నదియు ఖండింపఁబడుచున్నది.

(3) స్మిత్తు నిర్ణయము: ఫాదర్ మాన్రిక్ అను స్పెయిను మతబోధకుఁడు 1641 లో ఆగ్రాను దర్శించినాఁడు. అతఁడు తన పుస్తకములో 'టాజ్ మహాలు ప్లాను, ఇటలీదేశీయుఁడైన 'జెరోనిమో వెరోనిమో' చేత వ్రాయఁబడినదనియు, అతఁడే టాజ్ మహాలును కట్టినాఁ''డనియు వ్రాసినాఁడు. దీనిని నమ్మవచ్చునని స్మిత్తు పల్కుచు నిట్లు వ్రాయుచున్నాఁడు.

(౧) ''మాన్రిక్ ఆగ్రాలో ఒకనెల నివసించెను. అతనికి ముంతాజ్ మహాలు తండ్రి, ఆసఫ్ ఖానుతో పరిచయముగలదు. కాఁబట్టి, అతఁడు వట్టి వదంతియేదో, నిజమేదో తెలిసికొనక అట్లు వ్రాసియుండఁడు.

(౨) వెరోనిమో, లాహోరులో మరణించియుండగా ఆగ్రాలో అతనిని సమాధిచేసినారు. అందువలన నితఁడు ఆకాలములో నొక ముఖ్యపురుషుఁడనియు, ఆగ్రాతో నితనికేదియో సంబంధమున్నదనియుఁ దెలియుచున్నది (అనగా టాజ్ మహాలు నిర్మాతయని స్మిత్తు అభిప్రాయము).

(3) టాజ్ మహాలు కట్టుటకు ఇరువదిరెండు సంవత్సరములు పట్టినది. (1632—1654). జెరోనిమో 1640 ఆగస్టు రెండవతారీఖున మరణించినాఁడు. ఇతని తరువాత 'ఉస్తద్ ఈసా' 'మేస్త్రాంగము' వహించియుండవచ్చును. అందువలన టాజునుగూర్చి పూర్తియైన పిమ్మట, వ్రాసియుండిన ఆకాలపు హిందూదేశపు చరిత్రకారులు చాలకాలముక్రిందట చనిపోయిన పరదేశీయుఁడగు 'వెరోనిమో'ను తమ పుస్తకములలో వ్రాయుట మానియుండవచ్చును.' అని నిర్ణయించుచు స్మిత్తు, '(ఇటలీవాఁడైన) వెరోనిమోయైనను, ఉస్తద్ ఈసా (పెర్షియను) అయినను హిందూదేశీయుఁడు మాత్రముకాడు' అని తృప్తిపొందియున్నాడు. దీనిని బట్టి యూరోపియను కట్టినాఁడనువదంతి ప్రబలినది. తరువాత దీనిని చాలమంది హిందూ, యూరోపియను

* V.A. Smith. A History of Fine Art in India and Ceylon. pp. 436.

చరిత్రకారులు విమర్శించినారు. కాని, ఈ విమర్శనము లన్నిటితో మనకుఁబనిలేదు. వాని సారాంశము లివి:—

(1) షాజహాను ప్రేయసి ముంతాజుమహాలు (అసలు పేరు అర్జుమంద్ బానూ) 1631-వ సంవత్సరము జూన్ ఏడవ తారీఖునఁ జనిపోయెను. ఆమె జ్ఞాపకార్థము 'గోరీ' నిర్మించుటకు వివిధదేశములనుండి శిల్పులు రాపింపఁబడిరి. అందులకు పెరిషియా, అరేబియా, టర్కీ మొదలగు దేశములనుండి సుప్రసిద్ధ శిల్పులువచ్చిరి. వారందఱుఁ దమతోఁదోఁచిన ప్లానులను దయారుచేసిరి. వాని మంచిచెడ్డలనుగూర్చి విశేషముగా చర్చలుజరిగెను. కడకొకప్లాను స్వీకరింపఁబడెను మంచు కఱ్ఱతో దానికొక మోడల్ చేయఁబడెను. ఉస్తద్ ఈసా మేస్త్రీ. ఇతనికి నెలకు వేయిరూప్యముల జీతము. ఎంతమందిరో ప్లానులు వేసినప్పుడు, వెన్నిస్‌నుండివచ్చిన వెరోనియో గూడ ఒకప్లాను వేసియుండవచ్చును. అదియైనను పూర్తిగా ఆశియా పద్ధతులమీఁదనే యుండియుండవలెను. మఱియు, ఈ విషయము మాన్రిక్ వను ఫ్రైరో నియోద్వారా తెలిసినదిగాదు. వెరోనియో లాహోరులో ఆగస్టు 1640లో మరణించెను మాన్రిక్ అయిదు నెలలతరువాత డిశంబరు 1640-లోనో, జనవరి 1641-లోనో అచ్చటికివెళ్ళెను. వారిరువురును గలిసికొననే లేదు.

(2) వెరోనియోను స్వయముగా ఎఱిఁగియున్న 'పీటర్ మండీ' ఈవిషయమై వ్రాయలేదు. టాజుమహాలు కట్టుచుండగా హిందూదేశమును సందర్శించిన టావర్నియరు, వెరోనియో కట్టినట్లేమియు సూచింపనైనలేదు. బెర్నియరుకూడ టాజు, ఇటాలియను ప్లానుపై కట్టఁబడినట్లేమియు వ్రాయలేదు అన్నాడు. నిజముగా యూరోపియులు ప్లానుపై కట్టఁబడినచో వీరు గొప్పగా వ్రాయక యూరకొను రకమువారు కాదు. వీరిలో ఒక్కనికేనియు దెలియకపోదు.

(3) పైగా, థివెనో అను ఫ్రాంసుదేశీయుఁడు 'హిందూదేశీయుల శిల్పకౌశలమునకు టాజు సాక్ష్య' మని పల్కుచున్నాడు. ఇతఁడు 1666 లో హిందూదేశమును జూచినాఁడు.

(4) 'అబ్దుల్ హామీద్‌లాహోరి' అను చరిత్రకారుఁడు తన 'పాద్షానామా'లో టాజు హిందూదేశీయులు నిర్మించినదను చున్నాఁడు.

(5) సర్ జాన్ మార్షలుగారు ఇతరదేశీయులు టాజు నిర్మించిరనుటకు చరిత్రాధారములు లేవని పల్కుచున్నారు.

(6) ఇ.బి. హావెల్ అను శిల్పవేత్త టాజామహాలు పూర్తిగా హిందువులచేతనే నిర్మింపఁబడినదని వాదించియున్నాఁడు.* 'ఒకవేళ ప్లానుగీయుటలో ఇతరదేశీయుఁడు సహాయముచేసి యుండినట్లు ఒప్పుకొన్నను, (తప్పనిసరి అయిన) టాజామహాలుశిల్పము వేరొకదేశమువారి ప్రతిభాజన్యమనుటకు వీలులేదు. ఒకవేళ ఇటలీదేశీయుఁడైనను అతఁడు యూరపుపద్ధతులను పూర్తిగవదలి హిందూదేశపద్ధతులపైననే ప్లానుగీసినాడు. డోమ్ అను పైభాగము హిందూదేశములో 'కలశ' అని అనాదిగావచ్చుచున్నది. హైందవశిల్పులను అనుకరించినవారు పెరిషియను శిల్పులేగాని, హిందూదేశపు శిల్పులు ఇతరదేశముల శిల్పులను అనుకరింపలేదు.'

(7) ఇంతకు పూర్వముకూడ నిట్టి ప్లానులుగల కట్టడములున్నవి. హుమాయూన్ గోరీయు, ఇత్మదుద్దౌలా గోరీయుఁ జాలవఱకు దీనిని బోలియున్నవి.

టాజుమహాలు కట్టుటకు మూడుకోట్ల రూపాయిలు వెచ్చింపఁబడెను. పై కారణములనుబట్టి టాజుమహాలు నిర్మాణము హిందూదేశీయులచే కాని, యూరోపియను లది కాదని తేలుచున్నది.

—వి. కె. రామచంద్ర.

---

* E.B. Havel: Indian Architecture pp. 36 f.

E.B. Havel: A Handbook to Agra and Taj.

## ప్రాక్ప్రపంచమున తెల్లవాని ఆధిపత్యము

ఒక్క పురుషాంతరమునకు పూర్వము తెల్లవారు ప్రాక్ప్రపంచమున అడ్డులేని ఆధిపత్యము చెలాయించుచుండిరి. తూర్పున ఆధిపత్యము ప్రెస్టీజ్ మీదనే ఆధారపడియుండును. కాగా జపాను రష్యాను ఓడించుటలో తూర్పుదేశములందు తెల్లవాని ప్రెస్టీజ్ కొంతవరకు కూలిపోయెను. జపాను రష్యాను ఓడించిన పదియేండ్ల అనంతరము విరోపామహాయుద్ధము ప్రారంభమైనది. అది తెల్లవాళ్ళ పాలు దాయకమగు ఆత్మహత్యగా పరిణమించినది. నాటినుండియు తెల్లవాని గౌరవ ప్రతిపత్తులు క్రమముగా తగ్గిపోవుచున్నవి. విరోపా మహాసంగ్రామ కాలమునుండియు తెల్లవారు వెనుకబాటునొందుచున్నారు. తమ సామంతరాజ్యములందు తమకు ఉండుచున్న హక్కుభుక్తములను క్రమముగా వీడుచున్నారు. హిందూదేశమునందును, ఫిలిప్పైన్ దీవులయందును, డచ్ ఇండీస్ నందును, ఇంకను మరికొన్ని దేశములందును నేటికికూడ తెల్లవాడే ప్రభుత్వము నెఱపుచున్నాడు. కాని అది పెక్కు అధికారములను గోల్పోయిన ప్రభుత్వము. తెల్లవాని వెనుకబాటు క్రమక్రమముగా జరుగుచున్నది. ప్రెస్టీజి పోవుగాక తెల్లవానికింకను వలసినంత బహుబలము ఉన్నది. ఆ బహుబలముతోడనే ప్రాక్ప్రపంచమునందలి అలజడులను అతడు అణచిపెట్టుచున్నాడు. కాని ఇట్లెంతకాలము అణచిపెట్టగలుగును? గడచిన రెండుసంవత్సరములలోను ప్రాగ్దేశములందు తెల్లవాని ఆధిపత్యము మరింత డిందుపాటునొందినది. ఆర్థికమాంద్యము, రాజకీయవిభేదములు ప్రబలమై తూర్పుదేశములందు వెనుకటిరీతిని నిరంతరముగా ప్రభుత నెఱపుటకు తెల్లవానికి అడ్డువచ్చుచున్నవి. బ్రిటిష్ప్రజలు ఇదివరకే విశేషమగు పన్నుల భారముతో క్రుంగుచున్నారు. కాగా ఇప్పుడువారు చీనాదేశముమీదకుగాని హిందూదేశముమీదకుగాని గొప్పసేనను నడిపించుఖర్చును భరించుటకు ఎంతమాత్రము ఒప్పుకొనజాలరు. ఒక్క బ్రిటిష్ప్రజలే అననేల, అమెరికన్ ప్రజల విషయమునకూడ పరిస్థితులిట్టివిగానే ఉన్నవి. ప్రాగ్దేశములందు తెల్లవాని అధిపత్యము దిగజారుచున్నదనుటను రహస్యముగా ఉంచవలసిన అవసరములేదు. అట్లు దిగజారుచుండుట ప్రాగ్దేశవాసులందఱకును స్పష్టముగా వెల్లడియైయున్నది. అది నేడు బహిరంగ రహస్యమైయున్నది. కావుననే జపాను నేడు చీనాదేశమున తన ఇచ్ఛవచ్చినట్లు చేయుచున్నది; హిందూదేశీయులును, ఫిలిప్పయిన్ ప్రజలును స్వాతంత్ర్యముకొఱకు నిరంతరము ఆందోళనము చేయుచున్నారు.' అని లోథార్ స్టోడ్డార్డు అనునతడు వ్రాయుచున్నాడు. —స్క్రిబ్నర్స్ మాగజైన్.

* * *

## ఉచ్చరించునవి శాంతివాక్యములు : చేయునవి యుద్ధ ప్రయత్నములు.

అరువది ప్రభుత్వముల ప్రతినిధులు మూడు వత్సరములుగ సమావేశమగుచున్నారు. ఆసమావేశమునకు ఆయుధవిసర్జన సమావేశమని నామమీయబడినది కాని ఆసమావేశమున ఆయుధవిసర్జనము అను సమస్య మాత్రము పరిష్కారము కాలేదు. ఉపన్యాసములమీద ఉపన్యాసములు - ఆలోచనలమీద ఆలోచనలు. ఆయుధవిసర్జనము నెఱవేఱదని తేలినది. తుదకు ఆయుధనియమమునకు ప్రయత్నము. ప్రతిజాతియు మొదట తనస్వాతంత్ర్యమునుగూర్చి ఆతురత కలిగియుండును. తన రాజ్యపు పొలిమేరలను పరిరక్షించుకొనుటకు జాగ్రత్తవహించుచు, తనజాతియు జీవనము కాపాడుకొనుటకు శ్రద్ధపెట్టును. ఈ ప్రయత్నములు ఫలయుతమగుటకు ఆయుధములు పూటకాపు. కాగా వీలయినంత హెచ్చు మొత్తమును వెచ్చించి ప్రతి ప్రభుత్వమును ఆయుధములను సంపాదించును. పొరుగురాజ్యమునకంటె తనకు హెచ్చు ఆయుధములు ఉండునట్లుగ చూచుకొనును. దీనితో స్పర్ధ. ఈ రాజ్యమును మించుటకు పొరుగురాజ్యము ప్రయత్నిం

చును. ఆయుధవిసర్జన సమావేశపు చర్చలన్నియు ఒక్క పర్యవసానమునకు వచ్చుచున్నవి. జాతిసమితి వంటి సంస్థ యాజమాన్యమున ఒక్కొక్క రాజ్యపు ఆయుధబలమును నిర్ణయించుట. ఇది యుద్ధమాత్రమునకే భంగము కలిగించునదిగా నున్నది. యుద్ధము చేయుట యెందులకు? ఎదిరిని జయించుటకే గదా. యుద్ధమున తగిలియున్న జాతులు ఎదిరిని జయించుట కెట్టిపద్ధతినైనను అవలంబించుట అట్టిస్థితిలో ఆయుధ బలమును నియమింపబడియుండినను సూత్రములన్నియు తుడిచిపెట్టుకొనిపోవును. యూరపునందలి వివిధదేశములు నేడు శాంతివాక్యములను ఉచ్చరించుచున్నవే కాని అవిచేయు యుద్ధప్రయత్నములను మాత్రము మానలేదు. అంతర్జాతీయ విశ్వాసము పెంపొందనిది ఆయుధసంయమన ప్రయత్నముగావించుట కొంత వెర్రి. యూరపు అనుమానపుపుట్ట; ఒకరాజ్యమునకు మరియొకరాజ్యమునకు సహోదర్యతలేదు. ఆయుధవిసర్జన సభ సాగుచున్నతీరు. యూరపురాజ్యములలో అన్యోన్యము నడుచుచున్న రహస్యపు ఒడంబడికలు, ఒక్కొక్క రాజ్యమును ఆయుధములను ఇబ్బడిగా ముబ్బడిగా పెంచుచున్న విధము,-ప్రస్తుతస్థితిలో ఆయుధవిసర్జనముకాని, తుదకు ఆయుధ సంయమనముకాని నెరవేరుటను సూచింపకున్నవి. ప్రపంచమునందలి ప్రజలందరును నేడు యుద్ధమనిన చాల భయపడుచున్నారు. కాని ప్రభుత్వములుమాత్రము యుద్ధప్రయత్నములను మానలేదు. గతయుద్ధముకంటె రాబోవు యుద్ధము అతి భయంకరముగ నుండునని ప్రజలు నిజ మెరిగినవారు. తుపాకుల పరిమాణము మొదలగు మారణసాధనముల సంయమనమునుగూర్చి ప్రస్తుతస్థితిలో మాట్లాడుట కాలమును వృథపుచ్చుటయే. ఒకానొక అంతర్జాతీయ సమావేశము యుద్ధమును తక్కువ ప్రాణనష్టము కలిగించునదిగా చేయుటను గూర్చి చర్చించుచుండెను. ఆసభలో లార్డు ఫీషర్ ఇట్లు చెప్పెను. "యుద్ధమును తక్కువ ప్రాణనష్టమును కలిగించునదిగా చేయవలయునను ఏ ప్రయత్నము నరకలోకమున క్రైస్తవమతము వ్యాపింపజేయు ప్రయత్నమంతటి హాస్యాస్పదముగా నున్నది. 'యుద్ధమువలని నష్టమును ప్రజాబాహుళ్యము గ్రహించినది' కాగా ప్రజాబాహుళ్యము యుద్ధమునకు పూర్తి విముఖము కాగలదు. అప్పుడు ఏ ఆయుధవిసర్జన సభయు నక్కఱలేకయే ఆయుధవిసర్జనము అగును.' అని వైకౌంటు స్నోడెన్ పలుకుచున్నాడు.

—సండే డిస్పాచ్.

* • *

## ప్రాచీన భారతీయుల జ్ఞానప్రచారము

పురాతన కాలమునందు సైతము భారతీయ విద్వాంసులు తమదేశమునువిడిచి జ్ఞానప్రచారమునకై దూరదేశములకేగి యచటిభాషలలో పాండిత్యము గడించి మతబోధలు సలిపి యశోవిశాలురయినట్లు వాఙ్మయపరిశోధకులు నిర్ధారణముగావించిరి. క్రీ. శ. మొదటి శతాబ్దము మొదలు పదియవశతాబ్దమువఱకు ఇట్లు పండితప్రకాండులనేకులు 'నళంద' 'ఉజ్జయిని' మున్నగు భారతవిశ్వవిద్యాలయములందు విద్వత్సంపన్నులై నిర్జనారణ్యములను లెక్కసేయక చెట్టుచేమలులేని యెడారులను దాటి దారిలోని బందిపోటుదొంగల బాధలకు సహించి చీనాదేశముచేరి బౌద్ధమతవ్యాప్తికి వేయివిధముల తోడుపడిరి. వారొనర్చిన త్యాగము ప్రశంసనీయము: చీనాభాషకు వారు గావించిన మహోపకారము చిరస్మరణీయము.

అట్టి జీవన్ముక్తులలో 'కుమారజీవుడు' మొదట చెప్పదగినవాడు. ఇతడు సంస్కృతమునందు విశేషపాండిత్యము గడించి మహామేధావియని తరుణప్రాయమునందే ప్రసిద్ధిగాంచెను. క్రీ. శ. 401 సంవత్సరమున చీనాసార్వభౌముడు ఇతని పాండిత్యప్రకర్షమును విని తనసన్నిధికి రప్పించుకొనెను. ఆ చక్రవర్తిచే నాదరింపబడి యితడు పండ్రెండుసంవత్సరములు చక్కగ కృషి యొనరించి చీనాభాషలో అఖండవైదుష్యము నార్జించి బౌద్ధమతగ్రంథములను సుమారు నూఱింటిని గీర్వాణభాషనుండి చీనాభాషలోనికి పరివర్తనము గావించెను. అతడు రచించినగ్రంథముల శైలి అద్వితీయమని యిప్పటికిని చీనాదేశస్థులు అభినందింతురు. అశ్వఘోష నాగార్జునుల జీవితములుకూడ నితడాభాషలో వ్రాసెను. 'త్రిపిటకములజాబితాలో' నితనిగ్రంథములు 49 వివరింపబడినవి. వానిలో ముఖ్యములివి 1. పంచవింశతి సహస్రిక ప్రజ్ఞాపారమితా 2. దశసాహస్రిక ప్రజ్ఞాపార

మితా 3. వజ్రచ్ఛేదికా ప్రజ్ఞాపారమితా 4. ప్రజ్ఞాపారమితసూత్రము. 5. ప్రజ్ఞాపారమిత హృదయసూత్రము. 6. పూర్ణపరిపృచ్ఛా 7. ఈశ్వరరాగబోధి సత్త్వసూత్రము 8. బోధి హృదయ వ్యూహసూత్రము. 9. దశభూమికా సూత్రము. 10. సర్వపుణ్య సముచ్చయ సమాధిసూత్రము. 11. సద్ధర్మ పుండరీకసూత్రము. 12. అవలోకితేశ్వరబోధిసత్త్వసమంత ముఖ పరివర్తము. 13. విమలకీర్తినిర్దేశము. 14. మహాద్రుమ కిన్నరరాగపరిపృచ్ఛము. 15. సర్వధర్మ ప్రవృత్తి నిర్దేశ సూత్రము. 16. వసుధర్మసూత్రము. 17. విశేషచింతా బ్రహ్మ పరిపృచ్ఛము. 18. సుఖావతీ వ్యూహము. 19. మైత్రేయ వ్యాకరణము. 20. గయాశీర్షము. 21. మహామయూరీ విద్యారాజ్ఞీ. 22 అచింత్య ప్రభాస నిర్దేశ సూత్రము. 23 సురంగమసమాధి. 24 సకల మూలసంపరిగ్రహసూత్రము 25. సహస్ర బుద్ధ నిదానసూత్రము. 26. దీపంకరావదానసూత్రము. 27. సర్వాస్తివాద ప్రతిమోక్షము. 28. ప్రాణ్యమూల శాస్త్రటీక. 29. దశభూమి విభాష సూత్రము. 30. సూత్రాలంకారశాస్త్రము. 31. ద్వాదశనికాయ శాస్త్రము. 32 సత్యసిద్ధిశాస్త్రము. 33. సముత్తాన దానసూత్రము. 34. బోధిసత్త్వజీవితము. ఇటుల బహుళగ్రంథ రచనాధురీణుడై ధ్యానసమాధుల విషయము స్పష్టీకరించి పుస్తకములువ్రాసి చీనాసారస్వతమున కమూల్యోపకారము గావించిన ధిషణాసంపన్నుడు కుమారజీవుడు. ఈ మహానుభావునితో పాటు పరిశ్రమయొనరించిన సమకాలికులలో విమలాక్షుడు, బుద్ధభద్రుడు, పుణ్యత్రాత, యను భారతీయ విద్వచ్ఛ్రేష్ఠులుకూడ పేర్కొనదగినవారు.

బౌద్ధమత ప్రచారము విదేశములందు నిరాఘాటముగ సాగించి, పేరుబడసిన మరియొకవ్యక్తి గుణవర్మ. ఇతడు కాశ్మీరరాజ కుటుంబములోనివాడు. సింహాసనమును నిరాకరించి కాషాయవస్త్రధారియై యీవిద్వాంసుడు మొదట సింహళద్వీపమునందును పిదప యవద్వీపమునందును బుద్ధధర్మమును వ్యాపింపజేసెను, పిదప చీనా చక్రవర్తి శ్రమణులను కొందరిని పంపి యితనిని పిలిపించి 'జేతవనవిహారము'నందు విడిదియొసగి బౌద్ధమత రహస్యములను బోధించుటకు నియమించెను. ఆ పనికి పూనుకొని సద్ధర్మపుండరీకసూత్రమును, దశభూమి సూత్రమును వారికతడు చక్కగా బోధించి చక్కని శైలిలో చీనాభాషలోనికి కొన్ని మతగ్రంథములనువాదముసల్పి ఆదేశమునందే తన డెబ్బదిఏడవ సంవత్సరమున పరమపదించెను. భిక్షుకీ సంఘమును స్థాపించి దానికి కట్టుబాటు లొనరించిన పుణ్యపురుషుడితడే యని చైనాదేశస్థులు నేటికిని యితని సంస్మరింతురు. ఇతనితో కృషిసల్పిన సన్యాసులలో గుణభద్రుడు ముఖ్యుడు. ఇతడు బ్రాహ్మణకుల సంజాతుడు. ఎనిమిదియేండ్లు కష్టపడి యీవిప్రవిద్వాంసుడు చైనాభాషలోనికి డెబ్బదిఎనిమిది గ్రంథములను రచించెను. వానిలో ప్రధానములని ఎన్నదగినవి 1. శ్రీమాలదేవి సింహనాదము, 2. సంధినిర్మోచన సూత్రము, 3. రత్నకరండక వ్యూహసూత్రము, 4. లంకావతార సూత్రము.

వారివెనుక నారవశతాబ్దమున వచ్చిన భారతీయప్రవాసులలో జినగుప్తుడు భాషాంతరీకరణ కార్యమునందు విసుగులేనివాడు. ఇతడు పరివర్తించిన గ్రంథములు ముప్పదియారు. 'బుద్ధచరితము' 'సద్ధర్మపుండరీకము' అను రెండు గొప్ప పుస్తకములు చైనా సారస్వతమున కర్పించినందులకై ఆదేశీయులు నేటికిని యీమేధాశాలికి ఋణగ్రస్తులే. అతడు గాంధార రాజ్యమందలి పురుషపురమునందు జనించెను. ఏడవయేటనే సన్యసించెను. తన యిరువదియేడవ సంవత్సరమునందే మరికొందరు స్నేహితులతో నితడు చీనా దేశముజేరెను. అచటకూడ గీర్వాణవిద్యా ప్రపూర్ణుడే. జినయశస్సు, జినభద్రుడు, యశోగుప్తుడు అను ముగ్గురుమిత్రులు మార్గకష్టములకు సహించి అతనిని వెంబడించినవారు, వారికి చైనాసార్వభౌము డొసంగిన సమ్మానము నిరుపమానము. జినగుప్తుడు రాజగురువయ్యెను, ప్రజానురాగమును బడసి యీ ధన్యాత్ముడు తన డెబ్బదిఏడవ సంవత్సరమునందు కీర్తిశేషుడయ్యెను. అతడు పరివర్తనమొనరించిన పుస్తకములలో ముఖ్యములు. 1. అవలోకితేశ్వరుని గాథలు. 2. నానా సంయుక్త మంత్రసూత్రము. 3. అద్యాశయ శంకోదయము. 4. రత్నకూట సూత్రము. సార్వభౌముని

యానతిననుసరించి ఆతడొక గ్రంథమాలారచనమున కష్యతపదవినిపుణి యింకను ఎన్నియో పుస్తకము లా దేశభాషలో రచించి కృతకృత్యుడయ్యెను.

అటుతరువాత నెనిమిదవ శతాబ్దమునందు వెలసిన భారతీయవిద్వచ్ఛేఖరులలో అమోఘవజ్రుడు నిరుపమానశేముషీ సంపన్నుడు. తాంత్రికవిద్యను చీనా దేశములో వ్యాప్తిగావించుట కితడే కారణభూతుడు. ఈ పండితుడు బ్రాహ్మణకులజుడు. వజ్రబోధి యను విద్వాంసునకు శిష్యుడు. అతని పవిత్రజీవనమునకును మేధాసంపత్తికిని యులరి చీనాచక్రవర్తి 'ప్రజ్ఞాకోశ' 'త్రిపిటకభదంత' యను బిరుదులొసంగి యతనిని సన్మానించెను. సార్వభౌమునిచే గురుపీఠమునందుంచబడి యర్చింపబడిన యీ పుణ్యపురుషుడు రచించిన గ్రంథములు పెక్కులు గలవు. వానిలో ముఖ్యము లీ దిగువ నుదహరింపబడును. 1. మహామయూరీ విద్యారాజ్ఞి, 2. కుండీదేవిధారిణి, 3 మరీచీధారణి, 4. మరీచీదేవి పుష్పమాలాసూత్రము, 5. సర్వతథాగతాధిష్ఠాన హృదయ గుహ్యధాతుకరండ ముద్రాధారణి, 6. మహాశ్రీసూత్రము, 7. మహాశ్రీదేవి ద్వాదశబంధన అష్టశతనామ విమలమహాయాన సూత్రము, 7. గంగులి విద్యా, 9. రత్నమేఘధారిణి, 10. శాలిసంభవ సూత్రము, 11. రాష్ట్రపాల ప్రజ్ఞాపారమితా, 12. మహామేఘసూత్రము, 13. ఘనవ్యూహసూత్రము, 14. మైత్రీమణి దివ్యరాజసూత్రము, 15. మంజుశ్రీ పరిపృచ్ఛాసూత్రము, 16. పంచాత్రింశత్ బుద్ధనామ పూజా స్వీకారశేఖ, 17. అవలోకితేశ్వర బోధిసత్త్వ నిర్దేశ సామంతభద్రధారణి, 18. అష్టమండలక సూత్రము. 19. సర్వరోగప్రశమనధారణి, 20. యోగసంగ్రహమహార్థ ఆనందపరిత్రాణధారణి, 21 అమోఘపాశవైరోచన బుద్ధమహాభిషక్తప్రభాస మంత్ర సూత్రము, 22. నీతిశాస్త్రసూత్రము, 23. తేజోప్రభా మహాబల గుణాపద్వినాశ శ్రీధారణి, 24 ఉష్ణీష చక్రవర్తితంత్రము, 25. బోధి మండవ్యూహధారణి, 26. ప్రజ్ఞాపారమితా అర్థశతికా, 27. వజ్రశేఖర యోగసూత్రము, 28. మహాప్రతిసరధారణి, 29. గరుడగర్భ రాజతంత్రము, 30. వజ్రకుమార తంత్రము, 31. సామంతభద్ర ప్రణిధానస్తోత్రము, 32. మహాయాన నిదానశాస్త్రము, 33. హారీతిమాతృ మంత్రకల్పము.

ఏకారణముచేతనో క్రీ. శ. తొమ్మిదవ శతాబ్దమునందు మాత్రము భారతీయులు మతప్రచారము గావించినటుల గానిపింపదు. కాని తిరిగి పదియవ శతాబ్దినందు ధీమంతులనేకులు భారతవిద్యాలయములందు విశిష్టులై, చీనాదేశమునకు జని ఆహ్వానమున కపార సహాయము గావించిరి. వారిలో దానపాలుడు ముఖ్యుడు. ఇతడు 111 గ్రంథము లాభాషలోనికి తర్జుమా గావించెను. ఆపుస్తకములలో ఖ్యాతిగాంచినవి 1. కశ్యప పరివర్తము, 2. వసుధరధారణి, 3. ద్వాదశనిదానగత శ్రీసూత్రము, 4. చింతామణి ధారణీ సూత్రము, 5. రత్నజాతధారణీసూత్రము, 6. సర్వబుద్ధసూత్రము, 7. పుష్పకూట ధారణి, 8. దానచింతనసూత్రము, 9. ధర్మముద్రాసూత్రము, 10. మహాజాతార్థసూత్రము, 11. మేఖలాధారణి, 12. సువర్ణకాయధారణీసూత్రము, 13. భిమగుపమాన సూత్రము, 14. రత్నమేఘ సూత్రము.

ఈవిధముగ సుమారు వేయిసంవత్సరములు (క్రీ.శ. మొదటి శతాబ్ది లగాయతు దశమశతాబ్దివఱకు) విజ్ఞానవాహిని భారతదేశమునుండి యవ్యాహతముగ చైనా సామ్రాజ్యమునకు ప్రవహించి యీదేశమును పునీతము గావించెను. ఆమహా విద్వాంసుల ధైర్యసాహసములు, త్యాగాభినివేశములు సంస్తవనీయములు. ఎన్ని ఘోర కష్టములకైన యోర్చి దూరమని జడియక విఘ్నములకు వెఱవక జాతిభేదములను పాటింపక కడుదూరమని వెనుదీయక హిమాలయ మహోత్తుంగపర్వతములను దాటి గోబీయెడారిలో పయనమొనరించి యన్యదేశములో తమ పుణ్యశరీరములు పరిత్యజించిన మహాపురుషుల పరిశ్రమవలననే మాతృభూమియందు నామమాత్రావశిష్టమై కొనయూపిరితో నున్న బౌద్ధమతము నేటికిని చైనారాజ్యమునందు నవనవలాడుచు చైతన్యయుక్తయై వెలయుచున్నది. పదియవ శతాబ్దమునెనుక భారతదేశమునకు సంభవించిన మహమ్మదీయాక్రమణ ప్రళయమే అ

పవిత్రవిజ్ఞానవాహిని నరికట్టి భారతీయసభ్యతావృక్షమునకు కుఠారప్రాయమై దనరెననుట చరిత్రకవిషయమే కదా!

—గోదావరి సత్యనారాయణ.

• • •

## హిట్లరు రాజ్యములో స్త్రీలు

'హిట్లరు ఆధిపత్యము వహించినతరువాత జర్మను స్త్రీలస్థితి పూర్తిగా మారిపోయినది. జర్మనీదేశమున ఇపుడు స్త్రీలు ఉద్యోగములు చేసి ధనమార్జించు హక్కును గోల్పోయిరి. పెక్కురు స్త్రీలకు ఇదివరకు ఉన్న ఉద్యోగములుకూడ ఊడిపోయినవి. ఇట్లు ఉద్యోగములు ఊడిపోవుటకు కారణము వారు జ్యూమతస్థులగుటకాని, సోషలిస్టులగుటకాని కాదు. వారు స్త్రీలగుటయే ఇందుకు కారణము. హిట్లరుచేతను, అతని మంత్రులచేతను ప్రతిపాదితమగుచున్న నాజీ తత్వము ప్రస్తుతకాలపుస్త్రీల యుద్యమములపై ఒక గొడ్డలిపెట్టు వేయుచున్నది.' హిట్లరు ఇట్లు చెప్పుచున్నాడు: 'స్త్రీలవిద్యలో దేహసౌష్టవము, బలములనుగూర్చియే శ్రద్ధ పెట్టవలెను. తరువాతనే ఆధ్యాత్మిక, మానసికాభివృద్ధులనుగూర్చి ఆలోచింపనగును. స్త్రీలను మాతృత్వమునకు తయారుచేయుటయే స్త్రీ విద్యయొక్క ఏకైకాదర్శముగ నుండవలయును' హిట్లరు మంత్రులలో ముఖ్యుడగు హెర్ గోబెల్సు ఈ విషయమునుగూర్చి ఇట్లు చెప్పుచున్నాడు: 'సుందరముగ నుండుట, పిల్లలను కనుట ఈ రెండే స్త్రీలపనులు. ప్రకృతిలో ఆడపక్షి మగపక్షికొఱకు అలంకరించుకొనుచున్నది, గ్రుడ్లను పొదుగుచున్నది. ఇందుకు ప్రత్యామ్నాయముగ మగపక్షి ఎఱ సంపాదనమునుగూర్చియు, గూటిపొదకు శత్రువులు రాకుండ కాపాడుటనుగూర్చియు శ్రద్ధ పెట్టుచున్నది.' హిట్లరు ముఖ్యమంత్రులలో మఱియొకడగు కాప్టెన్ గోరింగు ఇందునుగూర్చి ఇట్లు చెప్పుచున్నాడు. 'స్త్రీలు: వారి స్థానము గృహమే. వారి విధ్యుక్తధర్మము అలసిన పరిశ్రామికులగు పురుషులకు వినోదము కల్పించుటయే.'

—ది వోట్.



## జాగ్రత్స్మృతి

ఓహృదయేశ్వరా! ఆతొలినాటి నిశీథము అగాధాంధకారము. ఎటుచూచిన సడిలేదు. తుదకు ఒకమిణుగురుపోలికవేనియును కానరాదు. అట్టి గాఢతమ సూచ్యభేద్యతమస్వినియందు నొదిగి యొదిగి నుద్యానవాటికకు వచ్చితివి. ఆప్రథమ సందర్శనమున నీ నిర్మల వదనము ఒక అజ్ఞాతసావేశములో నన్ను పరవశమున తేల్చువట్టి సుకుమార తారళ్యము నీమోమునుండి వలుకుచుండెను. ఆసమయమున నాకొక అపూర్వస్పృహా ద్యోతకమైనది—బహుశః ఈశ్వరుడు పాలనురుగులు గ్రక్కు పున్నమచంద్రుని తునియలుజేసి ఒక తునక యిక్కడ పారవేసినాడు కానోపు, అని. నీ సుందరతర సౌకుమార్యము నాహృదయమున శాశ్వత స్థానము బొందినది. ఏమని వచింపను? నా చిత్తవీథియందు నీభవ్య మనోహర ప్రేమస్వరూపము అదిమొదలు తాండవకేళి సల్పినది.

నాథా! నీవు నీహృదయమున నాకు స్థానము యిచ్చినప్పటినుండి మన యిరువురము హర్షోన్మత్తులమై ప్రాపంచకమునే మఱచితిమి కొన్నాళ్ళు.

నాకు స్ఫురణయున్నది — వివాహానంతరము ఉపవనవిహార సమయమున నీప్రేమ శీతల మధుతుషారములు విరజల్లి నా మనస్సును ప్రఫుల్లితమును జేయుచుండినదియు, విచలిత జలతరంగములవంటి నీ కరుణాపాంగ దృక్కులు నన్నుకై వసము చేసికొని చిత్త చాంచల్యము గలిగించి, ప్రణయకుసుమములు నావైపు రువ్వుచుండినదియు.

నీవు చిత్రమాంజిష్టప్రభలు అల్లుకొన్న లేసంజలో శివక్తనిర్మల సౌధోపరిభాగమున కూర్చుని, అనురాగ ముగ్ధత్వముతో వసంత సమీర వీచికలచే నా నుదురు అంచులపై ప్రేలాడు ముంగురులు సవరింపుచు ప్రేమానుభూతి చవిచూపించి, నన్ను అతీతస్వర్గలోకమునకు గొంపోవుచుంటివి. ఉషఃకాల బాలసూర్యుని స్నిగ్ధమధుర మందశీతల కిరణములవోలె నీ అంతఃకరణమునుండి వెలువడిన ఆ దినముల శుభవాంఛలు జ్ఞాపకమున్నవి. దాంపత్యసుఖములో నైక్యమైన ఆ దినముల ముచ్చట్లు ఎన్నని వచింపను?

కాని నేడు —.

అకస్మాత్తుగా నెక్కడనైన తటస్థపడినపుడు అవనతముఖుడవై పరువిడిపోవుటకు ప్రయత్నించుచుంటివి. నేను శాంతముతో ఏకాంతమున నీతో ఒకటిరెండు మాటలు మాట్లాడి నా హృదయపిపాసను తీర్చుకొన గోరుచున్నాను, నీ అనిర్వచనీయ ప్రేమకై ఆత్మసమర్పణోత్కర్ష యొక్క పవిత్రసందేశము నాకు వినిపించుచున్నది. రమ్మురమ్ము కరుణాకటాక్షా! ఎడతెగా మర్మపీడిత విచారముచే కుందు నా ఆత్మకు శాంతి ప్రదానమొనర్చుము. భగభగ మండుచున్న నా హృదయచిచ్చును నీ మంజులస్వాదు వాక్సుధాస్రవంతిచే నార్పివేయుము.

స్వామీ! ఇప్పుడు నీవు వివాహధర్మబంధమును త్రెంపుకొని అన్యులధనమై యున్నావని నే నెరుగుదును. కాని ఈ కారణమున నేను నీ ప్రేమనుండియేగాక, లోకదృష్టినుండియు వంచితనై పోవుదును. నన్ను అపమానజన్యఖేదమునకు గురిచేయకుము. నీ సందర్శనమునకై తల్లడించు నా మానసమునకు శాంతిప్రసాదింప జాలవా? ఎట్టి నిష్ఠురత! అబ్బా!!... ఎంతని ఈ సాధింపు. సత్యబద్ధమైన ఆదర్శమ్ము, మన ఆశలు నిష్ఫలములై పోవునా? చిరకాల మనుభవించవలసిన సుఖము విచ్ఛిన్నమై పోవలసినదేనా? దాంపత్య ప్రేమయొక్క నిగూఢసూత్రములోని విమలనిష్ఠను పాలింపలేని గార్హస్థ్య నియమము వృధాగదా? తమకు తెలియని అంశములేమున్నవి. ధర్మశాస్త్రములు పురుషజాతిని బంధింప నంతమాత్రమున అంత తృణీకారమా?

దేవా! నేను నా పూర్వఅనుపమ సుఖానుభవమును స్మరించి స్మరించి దుఃఖభాజని నగుచున్నాను. అహోరాత్రములు ప్రతీక్షించి విసువుకలుగుచున్నది. ప్రాపంచక నియమము, ప్రేమగలవారి రీతులు యివియేనా? రమ్ము, దయచేసిరమ్ము! ఈ జీవితములో నిన్ను నేను మఱచిపోగలనా యని చెప్పినంతమాత్రమున చాలునా?

లేదు, నేను ఎన్నడు అట్లనజాలను. ఈ సేవకురాలిని అనుగ్రహించి దయచేయుము. కేవలము ఒకసారి!

— పొణకా కనకమ్మ.

# ఇన్స్యూరెన్సు విషయములు

## భారత భీమా వ్యాపారము చేసే కంపెనీలు

| ఇండియన్ ఇన్స్యూరెన్సు కంపెనీల సంఖ్య. | ప్రత్యేకంగా జీవితభీమా వ్యాపారం చేయునవి. | జీవితభీమా తదితర భీమా. | ఇతర భీమా (అగ్ని, సముద్రము వగైరా.) |
|---|---|---|---|
| 169 | 124 | 29 | 16 |

ఇండియన్ ఇన్స్యూరెన్సు కంపెనీలు – రాష్ట్రములవారీ సంఖ్య.

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| బొంబాయి | 68 | పంజాబు | 19 | మధ్యరాష్ట్రములు(సి.పి) | 3 | అజ్మీరు, మార్వారు | 3 |
| బెంగాలు | 31 | ఢిల్లీ | 9 | సంయుక్తరాష్ట్రములు (యు.పి) | 3 | బర్మా | 1 |
| మద్రాసు | 26 | బీహారు, ఒరిస్సా | 5 | | | అస్సాము | 1 |

| 1932 లోని భీమా పట్టాల సంఖ్య. | కంపెనీ పుట్టినప్పటినుండి 1932 సాలు ఆఖరుకు అమలులోనున్న పట్టాలు. | 1932 లో జరిగిన భీమా మొత్తము రూపాయిలు. | 1932 లో జరిగిన వ్యాపార మొత్తం మీద పాలీసా వచ్చే ప్రీమియం. |
|---|---|---|---|
| 113000 | 554000 | 19 కోట్లు | 1 కోటి |

కంపెనీ పుట్టినప్పటినుండి 1932 ఆఖరుకు జరిగిన భీమావ్యాపార మొత్తం రూపాయిలు 102 కోట్లు.

కంపెనీ పుట్టినప్పటినుండి 1932 ఆఖరుకు జరిగిన భీమావ్యాపార మొత్తంమీద వచ్చే ప్రీమియం ఆదాయము రూపాయిలు 4¾ కోట్లు.

## భారతదేశములో విదేశ భీమాకంపెనీలవారి వ్యాపారము

| విదేశీ కంపెనీల సంఖ్య. | ప్రత్యేక జీవితభీమా వ్యాపారంచేసేవి. | జీవితభీమాతో యితర భీమావ్యాపారంచేసేవి. | ఇతరభీమా చేసేవి అగ్ని సముద్రం వగైరా. |
|---|---|---|---|
| 150 | 126 | 11 | 13 |

దేశములవారీ వివరాలు :

యునైటెడ్ కింగ్డం (ఇంగ్లండు, స్కాట్లెండు, వేల్సు) 71.

బ్రిటిష్ డొమినియన్సు అండ్ కోలనీస్ (అనగా అధినివేశ రాజ్యాలు) :

| | | | |
|---|---|---|---|
| ఆస్ట్రేలియా | 11 | స్ట్రేటు సెటిల్మెంటు (కులంబో) | 3 |
| కెనడా | 8 | దక్షిణ ఆఫ్రికా | 1 |
| చైనా | 8 | | |

యూరపుదేశములోనివి :

| | | | | | |
|---|---|---|---|---|---|
| స్విడ్జర్లండు | 6 | హాలండు | 3 | ఇటలీ | 1 |
| జర్మనీ | 5 | ఫ్రాన్సు | 2 | ఆస్ట్రియా | 1 |
| జపాను | 9 | జావా | 5 | అమెరికా | 16 |

| 1932 లోని భీమా పట్టాల సంఖ్య. | ఇండియాలో పనిచేసేటప్పటి నుండి 1932 ఆఖరుకు అమలులోనున్న పట్టాల సంఖ్య. | 1932 లో జరిగిన భీమా మొత్తం రూపాయిలు. | 1932 లో జరిగిన వ్యాపార మొత్తంమీద సాలీనా వచ్చే ప్రీమియం ఆదాయము. |
|---|---|---|---|
| 26.000 | 2.20000 | 8 ⅔ కోట్లు | ½ కోటి |

కంపెనీ పుట్టినప్పటినుండి 1932 ఆఖరుకు భారతదేశంలో జరిగిన భీమావ్యాపార మొత్తము రూ 76 కోట్లు.

కంపెనీ పుట్టినప్పటినుండి 1932 ఆఖరువరకు జరిగినభీమా వ్యాపార మొత్తంమీద వచ్చే ప్రీమియం ఆదాయము రూ 4¼ కోట్లు.

పై అంకెలనుబట్టి జూడ భారతదేశము క్లయింను విదేశీ కంపెనీల పోటీతో ఆగవలసి వచ్చుచున్న ట్లగపడుచున్నది. ఇప్పటికి ఇంకను రమారమి విదేశీ వ్యాపారస్తులు మనదేశీయులు చేసే వ్యాపారములో సగము కంటెను యీరీత్యా పట్టుకుపోతున్నారని గ్రహించి స్వదేశీభీమాకంపెనీలకే భారతీయులు ప్రోత్సాహమొసంగుదురు గాక !

## భారతశాసన సభ్యుల కర్తవ్యము

విదేశీ భీమాకంపెనీల పోటీవల్ల భారతదేశ భీమా కంపెనీలకు రక్షణలు నొసంగుటకుగాను విదేశీ భీమా కంపెనీలవారు మన భారతదేశములో పనిచేయుటకు గాను యీదిగువ షరతులతో భీమాచట్టమును సవరణ చేయవలసి యున్నది,

(1) 5 రెట్లు స్టాంపుఫీజు హెచ్చించుట.

(2) ప్రీమియము రేట్లపై ప్రతి వెయ్యిరూపాయల పోలసీకి 5 రూపాయల చొ॥ హెచ్చించుట.

(3) ఒకలక్ష రూపాయిలు డిపాజిట్టును ఇండియాలో నుంచుట.

(4) ఇండియాలోనుంచి వసూలుచేసుకొనే ప్రీమియము సొమ్మును ఇండియాలోనే పెట్టుబడి పెట్టుట.

(5) ఇండియాలోనుండు బ్రాంచి మేనేజరుపదవి ఇండియనుకే నొసంగుట.

(6) ఇండియాలో చేయు వ్యాపారమునకు ప్రత్యేకంగా ఇండియాలోనే ఆడిటుచేసే ఏర్పాట్లుచేయుట.

—శనివారపు సుబ్బారావు.






# కంచికి పోయిన కథలు

౧

## కాకెమ్మ కట్టెలిల్లు కథ

అనగా అనగా ఒకకాకి, ఒక పిచ్చిక. పిచ్చికమ్మ పిడకలయిల్లు కట్టుకుంది కాకెమ్మ కట్టెలయిల్లు కట్టింది. అట్లా కట్టుకుని యుండగా ఒకనాడు గాలివాన వచ్చింది, పిచ్చికమ్మ పిడకలయిల్లు వానకు కరిగిపోయింది. పిల్లలను వెంటబెట్టుకుని కాకెమ్మయింటికి వచ్చినది. వాకిట్లో నిలువబడి కాకెమ్మా కాకెమ్మా తలుపుతీస్తావా అన్నది. యిప్పుడు వీలుకాదు తలుపుతియ్యడానికి మాయింటాయనకు నీళ్లుయిస్తున్నాను కొంచెంసేపు ఆగి రావలశినది అన్నది. మళ్ళీ కొంచెంసేపు వున్నతర్వాత మళ్లా కాకమ్మా తలుపు తీస్తావా అన్నది. నాపిల్లలకు నీళ్లుపోసుకుంటున్నాను వీలు లేదని అన్నది. మళ్ళీ కొంచెం సేపువుండి కాకెమ్మా కాకెమ్మా తలుపు తీస్తావా అన్నది. మాయింటాయనకు అన్నం పెడుతున్నాను అన్నది. మళ్ళీ కొంచెంసేపు ఆగివచ్చి కాకెమ్మా కాకెమ్మా తలుపు తీస్తావా అన్నది. మా పిల్లలకు అన్నము పెడుతున్నాను యిప్పుడు వీలుబడదు అన్నది. యెట్లాఅయినా కొంచెం వీలు చేసుకుని తలుపుతియ్యమ్మా అన్నది. కాకెమ్మ లేచి తలుపుతీసి పిచ్చికమ్మ నెత్తిన ఒక్కమొట్టు మొట్టింది. పిచ్చికమ్మ యేడుస్తూ పోయింది. పోయి ఒకచిన్న గుట్టమీద కూర్చున్నది చిన్నవరహా దొరికింది. మళ్ళీ పెద్దగుట్ట యెక్కింది. పెద్దవరహా దొరికింది. ఆగుట్టమీద కూర్చుని సూర్యుడివంక చూస్తూ వున్నది. చూస్తూవుండంగా సూర్యుడు పిచ్చికమ్మకు బండి, ఎద్దులు, చర్నాకోలను యిచ్చినాడు. ఆబండిమీదయెక్కి కాకెమ్మ యింటికి వచ్చినది. అప్పుడుకాకెమ్మ పిచ్చికమ్మ బండి యెద్దులనుచూచి ఆశ్చర్యపడి యేమే పిచ్చికమ్మా యివి అన్నీ నీకుయెట్లా వచ్చినవి అని అడిగినది. నీవు మొట్టుట వల్ల నేను విచారపడుతూ వెళ్ళి గుట్టమీద కూర్చుండగా సూర్యభగవానులు నాకు యిచ్చినారు అని చెప్పింది. సరె అయితే నీవు నన్ను మొట్టు నేనుకూడా పోయి గుట్టమీద కూర్చుంటాను అని కాకెమ్మఅన్నది. అంత పిచ్చికమ్మ రెండు మొట్లు మొట్టింది అంతట కాకెమ్మ విచారపడుతూ పోయి


చిన్నగుట్టమీద కూర్చున్నది. చిన్న తేలు కుట్టింది అక్కడనుండి యేడుస్తూ లేచి పెద్ద గుట్టమీద కూర్చున్నది. పెద్దతేలు కుట్టింది. ఆగుట్టమీదనే కూర్చుని సూర్యుడివంక చూచింది. అప్పుడు సూర్యుడు పాపఖర్ము రాలు గనుక దానిని మొఖము చూడరాదని పెద్దబండ ఒకటి పడవేసినాడు, అప్పుడు యేడుస్తూ కాకమ్మ పిచ్చికమ్మ యింటికి వచ్చింది, యేమి పిచ్చికమ్మా నీవు చెప్పిన ప్రకారమే నేను వెళ్ళి కూర్చుంటిని నీకు బండి మొద్దులు యివ్వటం యేమి? నాకు బండ లెయ్యటం యేమి? అని అన్నది ఎవరుచేసిన ఖర్మను అనుసరించి వారికి అనుభవించక తప్పదు అన్నది

౨

కుంటికమ్మకథ

పేరాసి పెద్దమ్మయింటికి కుంటికమ్మ నిప్పుకు పోయింది. పేరాసిపెద్దమ్మ అన్నది కూచో కుంటికమ్మా అని అరిశముక్క ఇచ్చింది. అరిశముక్క తీసుకుని యింటికొచ్చి వాకిట్లో చింతచెట్టుమీద కూర్చుని తింటు న్నది. తింటుంటె చెయిజారి ఆ అరిసిముక్క చింతతొర్రట్లో పడిపోయింది. దారిన వడ్లా బత్తుడు పోతుంటె అరిశముక్క చింతతొర్రట్లో పడిపోయింది తీసిపెడతావా అన్నది. అమ్మా నాకెక్కడ తీరుతుంది రాజుగారియింట్లో కొయ్యాగోణతము చెక్కబోవాలి అన్నాడు. అక్కడనుంచి కుంటికమ్మ లేచి రాజుగారి యింటికి పోయింది. కూచోకూచో కుంటికమ్మా అన్నారు రాజుగారు. కుంటి కమ్మా లేదు మంటిగడ్డలమ్మా లేదు పేరాసి పెద్దమ్మగారింటికి నిప్పుకుపోతే అరిశముక్క పెట్టింది చింతచెట్టుమీద కూర్చుని తింటుంటె అది చింతతొర్రట్లో పడిపోయింది తీసిఇవ్వ మంటె ఇవ్వడే వడ్లవాడు. వడ్లవాడి పిర్రలు చెక్కిస్తావా రాజుగారూ అంది నా యింట్లో కొయ్యాగోణతము చెక్కేవాడి పిర్రలు నే నెందుకు చెక్కిస్తాను అన్నారు రాజుగారు. అక్కడనుంచి లేచి లేళ్ల దగ్గిరకు పోయింది. కూచోకూచో కుంటికమ్మా అన్నయి లేళ్ళు. కుంటికమ్మా లేదు మంటిగడ్డలమ్మా లేదు పేరాసిపెద్దమ్మ అరిశముక్క పెట్టింది, చింత చెట్టుమీదకూర్చుని తింటుంటె చింత తొర్రట్లో పడిపోయింది, తీసిఇవ్వమంటె ఇవ్వడే వడ్లవాడు, వడ్లవాడి పిర్రలుచెక్కించ మంటె చెక్కించడే రాజుగారు, రాజుగారి పెసరచేను మేస్తారా లేళ్ళల్లారా అన్నది. మా రాజుగారి పెసరచేను మే మెందుకు మేస్తాము అన్నవి లేళ్ళు. అక్కడనుంచి లేచి మాలవాడి దగ్గిరకు పోయింది. కూచో కుంటి కమ్మా అన్నాడు, కుంటికమ్మా లేదు మంటి గడ్డలమ్మా లేదు చింతతొర్రట్లో అరిశముక్క పడిపోయింది, తీసిఇవ్వమంటె ఇవ్వడే వడ్ల వాడు, వడ్లవాడిపిర్రలు చెక్కించమంటె చెక్కించడే రాజుగారు, రాజుగారి పెసరచేను మెయ్యమంటే మెయ్యవే లేళ్ళు, లేళ్ళను కొడుతావా మాలవాడా అంది. మా రాజు గారి లేళ్లను నే నెందుకు కొడుతాను అన్నా డు. అక్కడనుంచి లేచి ఎలిక దగ్గిరకు పోయింది. కూచోకూచో కుంటికమ్మా అన్నది కుంటికమ్మా లేదు మంటిగడ్డలమ్మా లేదు పేరాసిపెద్దమ్మ అరిశముక్క పెట్టింది.... రాజుగారి పెసరచేను మెయ్యమంటె మెయ్య వే లేళ్లు లేళ్లను కొట్టమంటే కొట్టడే మాల వాడు మాలవాడి మగ్గము కొరుకుతావా ఎలికా అన్నది. అమ్మా మా మాలవాడి మగ్గము నే నెందుకు కొరుకుతాను అన్నది. అక్కడనుంచి పిల్లిదగ్గిరకుపోయింది కూచో

కుంటికమ్మా అన్నది పేరాదిపెద్దమ్మ అరిశ ముక్క పెట్టింది చింతతొఱ్ఱలో పడిపోయింది తీసిఇవ్వమంటె ఇవ్వలేదే వడ్లావాడు, వడ్లావాడిపిర్రలు చెక్కించమంటే చెక్కించడే రాజుగారు, రాజుగారి పెసరచేను మెయ్యమంటే మెయ్యవే లేళ్లు, లేళ్లను కొట్టమంటే కొట్టడే మాలవాడు, మాలవాడి మగ్గము కొరకమంటె కొరకదే ఎలిక, ఎలికను కొరుకుతావా పిల్లీ అన్నది చూర్లోవున్న ఎలిక నా కెట్లాదొరుకుతుంది అన్నది పిల్లి కుంటికమ్మ కుక్కదగ్గిరకు పోయింది. కూచో కుంటికమ్మా అన్నది పేరాసిపెద్దమ్మ అరిశముక్క పెట్టింది..........మాలవాడి మగ్గము కొరకమంటే కొరకలేదు ఎలిక. ఎలికను కొరకమంటే కొరకలేదు పిల్లి. పిల్లిని కరుస్తావా కుక్కా అన్నది మా అవ్వగారియింట్లో వుండే పిల్లిని నేనెందుకు కరుస్తాను అన్నది. అక్కడనుంచి అవ్వదగ్గిరకుపోయింది కూచో కుంటికమ్మా అన్నది. పేరాశిపెద్దమ్మ అరిశ ముక్క పెట్టింది ...పిల్లిని కొరకమంటే కొరకదే కుక్క కుక్కను కొడతావా అవ్వా అన్నది. మా కుక్కను నేనెందుకు కొడతాను అన్నది అవ్వ. తాతదగ్గిరకుపోయింది కూచో కుంటికమ్మా అన్నాడు పేరాశి పెద్దమ్మ అరిశముక్క పెట్టింది....పిల్లిని కొరకమంటే కొరకలేదు కుక్క, కుక్కను కొట్టమంటే కొట్టలేదు అవ్వ. అవ్వను కొడతావా తాతా అన్నది. మా ముసిలిదానిని నేనెందుకు కొడతాను అన్నాడు. ఆవు దగ్గిరకుపోయింది కూచో కుంటికమ్మా అన్నది పేరాశిపెద్దమ్మ అరిశముక్క పెట్టింది... ... అవ్వను కొట్టమంటే కొట్టడే తాత తాతను తంతావా ఆవు అన్నది. మా తాతను నేనెందుకు తంతానన్నది. దూడ దగ్గిరకుపోయింది పేరాశిపెద్దమ్మ అరిశముక్క పెట్టింది ....ఆవు తాతను తన్నమంటే తన్నదే ఆవు చన్ను కొరుకుతావా దూడా అన్నది; మా అమ్మచన్ను కొరికితే పాలిస్తుందా అన్నది. జోరీగదగ్గిరకు పోయింది పేరాశిపెద్దమ్మ అరిశ ముక్క పెట్టింది ...ఆవు చన్నుకొరకమంటే కొరకదేదూడ దూడచెవులో దూరుతావా జోరీగా అన్నది. సరే దూరుతాలే అన్నది జోరీగ. దూడ చెవులోదూరేటప్పటికి పాలు కుడువబోయి చన్నుకొరికింది దూడ చన్ను కొరికేటప్పటికి నెప్పితగిలి పాలు తియ్యపొయ్యేటప్పటికి తాతను ఆవు తన్నింది. తన్నేటప్పటికి అవ్వదగ్గిరకొచ్చి ఆవుకు కుడితి యెందుకు పెట్టలేదు అని అవ్వనుకొట్టాడు తాత. అవ్వను కొట్టేటప్పటికి అవ్వబోయి కుక్క యింట్లోజొరబడ్డదని కుక్కనుకొట్టింది కుక్కబోయి పిల్లి పాలుత్రాగినదేమోనని కుక్క పిల్లిని కరిచింది. పిల్లిబోయి యింటిలో ఎలిక చీరెలు కొట్టినదేమోనని పిల్లి ఎలికను కరవబోయింది. ఎలికబోయి పిల్లి కరువవచ్చేటప్పటికి మాలవాడి మగ్గముక్రిందదాగి మగ్గము కొరికింది, మాలవాడు ఆ కోపముతో లేళ్లను కొట్టాడు. లేళ్లుబోయి పెసరచేలో పడ్డవి. రాజుగారి పెసరచేను మేసివవి. కుంటికమ్మకు అరిశముక్క లేయించి పెట్టలేదని కోపముతో లేళ్లను మన చేలోతోలింది. అని వడ్లావాణ్ణిపిలిపించి పిర్రలు రాజుగారు చెక్కించినారు. అప్పుడు వడ్లావాడుబోయి చింతచెట్టు తొఱ్ఱటం తాచెక్కి అరిశముక్క తీసి కుంటికమ్మకు యిచ్చాడు. కుంటికమ్మ తిన్నది.





# తునకలు

## సోవియట్ రష్యా కార్మికుల స్వర్గము

సోవియట్ రష్యాలోని కార్మికులను తిలకించి ఆస్ట్రేలియన్ ఇంజనీయరొకడు ఇట్లు చెప్పెను: 'ఈ సుఖానందముఖములను పరికింపుడు. ఆ కార్మికుల స్టాండర్డు ఆఫ్ లైఫ్ హెచ్చుఅంతస్థునకు చెందినది కాకపోవచ్చును. అయితే వారు ఎప్పుడుగాని పస్తులేక తమ ఎదురొక్క నవలసియుండదు. తనకుటుంబమునందలి ఏ వ్యక్తులుగాని ఆకలిచిచ్చునకు గురికావలసియుండదు. రష్యన్ కార్మికులకు తాము ఎప్పుడుగాని పస్తుండవలసిన అవశ్యకత ఉండదని తెలియును. కావుననే వారు ఎల్లవేళల ధైర్యముగనుందురు. రష్యన్ రివల్యూషన్‌వలన కలిగిన లాభములలో ఇది ప్రధానమైనది. ఇతర దేశములలో—ధనవంతులు ప్రభుత్వము చేయుచున్న ఇతర దేశములలో—ఒక కార్మికుడు ఈవాడు పుష్కలముగ జీతము తెచ్చుకొనుచుండవచ్చును. కాని అతనికి తన ఉద్యోగము పోవునేమో అను భయము నిరంతరము వెన్నంటివచ్చుచుండును. ధనవంతుడగు పెట్టుబడిదారుడు ఆ కార్మికుని మరునాడు పనిలోనుండి తొలగింపవచ్చును. అందుతో అతడు పస్తులేక తను బానిసకాగలడు. రష్యాదేశమున ఈ బాధలేదు.' అని నిత్యనారాయణబెనర్జీ వ్రాయుచున్నాడు.

—రష్యా టుడే.

* • *

## ఆంధ్ర విశ్వవిద్యాలయము

యునైటెడ్ ప్రావిన్సెస్ యూనివర్సిటీల డిలిమిటేషన్ సభ్యుడగు ఖ్వాజా అహమద్ అబ్బాస్ అనువారు ఈనడుమ హిందూదేశయాత్ర గావించి ఆ యాత్రావివరములు వివరించుచు ఆంధ్రవిశ్వవిద్యాలయ స్థానమునుగూర్చియు, ఆ విశ్వవిద్యాలయమును గూర్చియు ఇట్లు వ్రాయుచున్నాడు: 'మాకు వాల్తేరు పేర్లవిన యాముని గజిబిజిపుట్టించినది. రైల్వేస్టేషన్ విశాఖపట్టణము అని పిలువబడుచున్నది. ఊరుపేరు మాత్రము వాల్తేరు. ఊరికి కొద్దిమైళ్ళదూరములో ఉన్న విశ్వవిద్యాలయము ఆంధ్రవిశ్వవిద్యాలయము అని పిలువబడుచున్నది. ఈ విశ్వవిద్యాలయముపుట్టి కొద్ది వత్సరములే అయినది. కాని మేధావియగు సర్ రాధాకృష్ణన్ యొక్క విశిష్టపరిశీలనమున ఆ విశ్వవిద్యాలయము సత్వరాభివృద్ధి నందుచున్నది. శాస్త్రవిద్యాప్రదానమునకు అనుకూలములగు అవకాశములు కల్పింపబడినవి. ఆంధ్ర విజ్ఞానపునరభివృద్ధి ప్రయత్నమున ఆంధ్రవిశ్వవిద్యాలయస్థాపనము ప్రథమఫలము. ప్రత్యేకపారస్యతము, ప్రత్యేకవిజ్ఞానము కలిగి ఆంధ్రులు వత్సరములుగ ప్రత్యేకరాష్ట్రము కొఱకు ఆందోళనము గావించుచున్నారు. దేశీయమహాసభవారు ఆంధ్రరాష్ట్రమును ప్రత్యేకరాష్ట్రముగ అంగీకరించియున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ భవనములు కట్టబడిన స్థలము అనేక విషయములచే రమణీయమైనది. ప్రపంచమునందలి విశ్వవిద్యాలయస్థలములలో ఆంధ్ర విశ్వవిద్యాలయస్థలము అద్వితీయమైనదని నా అభిప్రాయము. ఒకప్రక్క పచ్చికబయళ్ళచే కప్పబడినకొండ. మఱియొకప్రక్క తాటితోపులతో నిండాడిన ఇసుకబయలు. దాని అవ

తల అలలచే తన చలనశక్తిని చూపు బంగారు ఘూర్ణము. మానవమాత్రుడు కోరదగినది మతి యేమిగలదు?

—ది. బొంబాయి క్రానికల్.

* * *

## యూరపియన్ దేశములందు పోలీసుశాఖ

కారణమేమియో ఊహింపజాలము కాని ఈ నడుమ జర్మనులు యూరప్‌లోని ఇతర దేశములందలి పోలీసుల సంఖ్య హెచ్చగుచున్నదనిగూర్చి లెక్కలు తయారు చేయుచున్నారు. వారి లెక్కల ప్రకారము జనాభాను బట్టిచూచినచో ఇంగ్లండునందు హెచ్చుమంది పోలీసులు గలరని తేలినది. ఇంగ్లండున వేయిమంది ప్రజలకు సగటున ఆర్గురు పోలీసులుంగలరు. యూరపుఖండము మొత్తముమీద వేయిమంది ప్రజలకు సగటున ముగ్గురు పోలీసులుంగలరు. ఇంగ్లండున 174 ప్రజలకు ఒక్కొక్క పోలీసువాడును, ఫ్రాంసునందు 314 ప్రజలకు ఒక్కొక్క పోలీసువాడును, ఇటలీయందు 333 ప్రజలకు ఒక్కొక్కడును, జర్మనీయందు 402 ప్రజలకు ఒక్కొక్కడునుగలరు. ఇంత హెచ్చుమంది పోలీసులు ఉండబట్టియే ఇంగ్లండుప్రజలు చట్టసమ్మతజీవనులుగా నున్నారని తలంచబడుచున్నది.

—ది స్టార్.

* * *

## ఆంధ్రవైద్యము

ప్రతిదేశంలో ప్రతిజాతికి ఒక్కొకవైద్యం ఉంది. దానిలో అల్లా ఒకప్రత్యేకత స్ఫురిస్తూనేయుంది. ప్రతినిముషం అభివృద్ధిబొందుతున్న శాస్త్రాల్లో వైద్యం కూడా ఒకటి. అది నిరాటంకంగా మనం వద్దనుకున్నా అభివృద్ధి జరుగుతూనేవుంది. జరిగింది. వైద్యం మానవులకందరికేమిటి ప్రతి జీవజంతువునకు కూడా సహజమైన హక్కు. మానవులు జ్ఞానాధిక్యతచే అదొకశాస్త్రమని, పరిశోధనలుచేసి అభివృద్ధి చేస్తున్నామని అనుకొంటున్నారు. నిజానికి యితరజీవకోటికి సహజంగానే ఆ జ్ఞానం కలుగుతూన్నది. ఆ సంగతే మనవిచేస్తున్నాను. చూడండి సామాన్యంగా పిల్లి, కుక్క, మొదలైన జంతువులు అజీర్ణం చేస్తే వాటికి అవే చికిత్స ప్రారంభిస్తయి. లేత గడ్డిమొలకలు నమిలితిని వాంతిచేసుకొంటయి. యింత రిసర్చిచేసి యిన్నివేల పేజీల గ్రంథాల యొక్క రచనాఫలితం వమనంచేయించటమేగా. ఆయుర్వేదంప్రకారం మంగకాయరసం తాగించినా ఆంగ్లేయ సంప్రదాయం ప్రకారం స్టామక్ ట్యూబ్ వేసినా ఆమనిర్హరణానికి, ఉపవాసచికిత్స జంతువుల దగ్గర నుంచే మనం నేర్చుకున్నామేమో. అసలు సామాన్యంగా ఆయుర్వేదవైద్యమే హిందూదేశంలో, అంటే ఆరోజు బ్రహ్మచెప్పిన లక్షశ్లోకాలు మాత్రమేగాదు, ఆర్యవైద్యం, ద్రవిడవైద్యం యింకా యేవైనా ప్రాచీన వైద్య సంప్రదాయాలేవైనా ఉంటే అవీ తరువాత క్రమంగా వృద్ధియైనభాగము అంతా కలిసినన్నమాట. అయితేనేం అదే అనేకదేశాల్లో అనేకరకాలుగా ఉంది. అనేక పేర్లుకూడా వచ్చేయి. అందుట్లోకి దక్షిణదేశం (తమిళదేశం)లో ఉన్న సిద్ధవైద్యం దాని ప్రబోధకులు సిద్ధులే అయినా పేరుమాత్రం యీ మధ్య కాలంలో జేరింది. కారణాంతరములచే కల్పింపబడ్డది. పూర్వం ఆ పేరుపుట్టుకలేదు. అనార్యవైద్యం అయితే కావచ్చు కాని ఆర్యవైద్యమైనా. అచ్చు రసభాగంగా నేయుండదు అన్నిరంగులు ఉంటయి. యిప్పటి సిద్ధవైద్యంమట్టుకు ఆయుర్వేదీయ రసభాగమే. అప్పటి వారి ప్రత్యేకత అదే. వారా రసభాగాన్ని అభివృద్ధికి తెచ్చారు ప్రత్యేక పరిశ్రమ దాంట్లో చేచేశారు. యిట్లే కేరళ (మళయాళ) దేశంలో మూలికావైద్యమే కాకుండా పంచకర్మవైద్యాన్ని మంచి అభివృద్ధిలోకి తెచ్చారు. దానిలోనే ప్రత్యేక పరిశ్రమచేసి ప్రముఖులయ్యారు. తత్ఫలితంగానే నిగనిగలాడుతున్నారు పులిగడిగినముత్యాల్లాగ పట్టుకుచ్చువంటి చర్మంతో. అట్లే ఉత్తరదేశంలో ప్రత్యేకం మూలికావైద్యానికే ప్రాధాన్యత యిచ్చారు. యిదేవిధంగా కొన్నిదేశాల్లో, కొన్ని సమయాల్లో కొంతమంది మాంసపథ్యం ప్రధానంగా చెప్పారు. కొందరు శాకమే ప్రధానంగా చూచారు.


యీ వైద్యాన్నుంచి బయలుదేరి ఉత్పత్తి అయిన యితరదేశీయ వైద్యాలుకూడా ఏదో ఒకవిషయంలో ప్రత్యేక పరిశ్రమచేసినయి. యూనానీ వైద్యం హాల్వాకే ప్రధానంగాచేసుకొని బలం సంపాయించి రాజగౌరవానికి పాత్రమయింది. యిట్లే ఆంధ్రవైద్యం కూడా తన ప్రత్యేక పరిశ్రమను దేశానికర్పించి ప్రత్యేక తను సార్థకంచేసుకొన్నది. అంతేకాదు దానిలో ఒక మాత్స్యంకూడా యిమిడిఉంది. యితరదేశాల్లో ఏదో ఒకదానికే ప్రాధాన్యతయిచ్చి ప్రబలంచేస్తే యీ వైద్యం హిమాలయపర్వతాన్ని కన్యాకుమారి అగ్రాన్నే కాదు ఉత్తర దక్షిణధ్రువాల్ని తూర్పు పడమర సముద్రాల్నికూడా ఏకంచేసింది. మూలికావైద్యాన్ని, రస వైద్యాన్నికూడా కలిపి పాకంబట్టి హాల్వాచేసి మహమ్మదీయ ప్రభువులచేతకూడా తినిపించి శహబాష్ అనిపించింది. పరిశీలించండి. ఆయుర్వేద గ్రంథకర్తల్లో ప్రాచీనులైన చరక సుశ్రుతాదు లెవరూకూడా సంగమ దోషం ఒకటి ఉందనిగానీ అది మహా అసాధ్యమైదని గాని దాని నిదానంగాని చికిత్సగాని ఎక్కడా చెప్పినట్లు మనకు కనపడదు. కాని మనవైద్యంలో నిదానం చికిత్సా అంతా ప్రత్యేకంగా వివరించారు. ఆ మహర్షులంతా సన్నిపాతాలు కొన్నిరకాలు చెప్పారు. కాని మనవైద్యంలో యింకాకొన్ని ఉన్నాయి. దేశకాలాల ననుసరించి ప్రకృతిననుసరించి జ్వరాల్లో యింకాకొన్ని కొత్తరకాలు చెప్పారు. ఉష్ణవాతాలని, సవాసేమో అని. కాలానుసారంగా కలిగిన కొత్తరకాలుకూడా చేర్చారు. దీన్నిపట్టి మనదేశంలోకూడా రిసర్చిజరిగిందని ఎప్పటికప్పుడు వెనకపడకుండా మనవాళ్ళు మన వైద్యం ముందుకే నడచాయనీ స్ఫురించుతూనే ఉంది. కాబట్టె చరక, సుశ్రుత, మాధవ నిదానాల్లో చెప్పిన ప్రకారం నిదానలక్షణాదులు తెనుగువాళ్ళు రోగనిర్ణయానికి ఉపకరించిందానికంటే బసవరాజు, చింతామణికారుడు రాసిన లక్షణాలు తూచినట్లు సరిపోవటమే కాక రుగ్వినిశ్చయానికి, చికిత్సకుకూడా దాన్ని అనుసరిస్తే తప్పక ఫలప్రదమౌతూనే ఉంది. ఉద్గ్రంథకర్తలు నాడీసంగతి ఏమైనా ఎత్తుకున్నారా? అష్టస్థానాలసంగతి ఆలోచించారా? మనవాళ్ళో నాడికూడా ప్రధానమన్నారు యోగశాస్త్రం వైద్యశాస్త్రానికి ఎంత అవసరమో అంతా ఉపయోగించేశారు. ప్రాచీన గ్రంథాల్లో పథ్యాన్నిగురించి కొద్దో గొప్పో చెప్పినా వివరంగా చెప్పారా! మనవాళ్ళు యిది పథ్యం, యిది అపథ్యం అని గట్టిగా ఖచ్చితంగా ప్రతిరోగానికి వివరించిచెప్పారు. చివరకు పథ్యం ఒక్కటేచాలు రోగం కుదిర్చేందుకు అన్నారు. అంటే అదికూడా ఔషధు లేగా. వాగ్భటుడేదో కాస్త 'గ్రహావ్యమగునేను' అని కాస్త ఒకపదంతో చెప్పివిడిచిన (పూర్వులు అసలే చెప్పలా) గ్రహవిషయానికి ఆంధ్రవైద్యంలో ప్రాముఖ్యతయున్నది. ప్రతిరోగానికి కర్మవిపాకం, దానికి గ్రహచికిత్స వివరించిచెప్పారు. జ్యోతిషం మనకెంత ఉపయోగమో, తద్వారా చికిత్స ఎట్లుపయోగమో విప్పిచెప్పేశారు. విష ప్రతివిషాలనే పేరుతో ప్రతివిషానికి విఋంగుక్ళ్ళు బాగా వివరించిచెప్పారు. యికవాతలు. (అగ్నిచికిత్స)తో అన్నిరోగాలు కుదురుతాయని నిరూపించడమేకాదు ఈ రోజుకూడా వాతలతో అన్నిరోగాలుకుదిర్చే అపరధన్వంతరీ లున్నారు, ఆంధ్రదేశంలో అక్కడక్కడ. శస్త్రశాలాక్య చికిత్సలు మాత్రం వదిలారా? పెద్దపెద్ద వైద్యాలతో కుదరక మేజర్లుకూడా వదిలేసిన కేసులుకూడా బాగుచేస్తున్న ఆంధ్రవైద్యులున్నారు. అంజనాలు అద్భుతంగాచెప్పిన ఆంధ్ర గ్రంథకర్తలున్నారు. పనికిరాదనుకునే పాత తాటాకులుకూడా దేశాన్నంతా పీల్చేస్తున్న ప్రదర రోగాన్ని ఎలా హరిస్తుందో వివరించారు. వివరాలన్నీ ఆంధ్రవైద్య నిర్మాతలైన నాగార్జున, వల్లభ, బసవరాజ, శరభరాజాది ఆంధ్రవైద్య శేఖరుల జీవిత చరిత్రలలో మననిచేసుకుందాం.

—వి.వి.యస్. ఆరాధ్య. యల్ ఐ.యమ్.


# అశ్వత్థామగారి సంగతి

"ఆంధ్రభూమి" మార్చి నెల సంచిక యందు మ॥ రా॥ శ్రీ పోలవరం వాస్తవ్యులగు శిష్టా సుబ్రహ్మణ్యంగారు తెలియజేసినట్లు అశ్వత్థామ కనిపించాడను వ్యాసము చాలామందిని ఆంధ్ర దేశంలో కలవరపెట్టింది. కొందరు విశ్వసించారు. కొందరు లేత వంకాయ కోత అన్నారు. మరికొందరు కల గాబోలు నన్నారు. మిగతా రకంఅంతా యదార్థమన్నారు. పై వ్యాసమును నేను సమర్థించుచు నాకు తెలసిన యొక నిదర్శనమును మీ సంచిక కందజేయుచున్నాను. గంజాంజిల్లాయందు కల్లికోట ప్రాంతమున నుండు బిరిడీ యను చిన్న ఓఢ్రజమీందారి యందు మహాభారత పఠనీయము యతి నిష్టాగరిష్ఠతతో ప్రతిదినము జరుగుచుండెను. పురాణ కాలక్షేపము జేయుటకు ఏ కొద్దిమందియో వచ్చుచు బోవుచుండిరి. వచ్చుచు బోవుచున్నవారు గ్రామవాసులు కొందరు, జమిందారుకు చెందినవారు కొందరగుటచే యచ్చట కాపలాకాయు రక్షకభటున కందరు చిరపరిచితులై యుండిరి, వారి నందరిని వాడు బాగుగా నెరుగును. వీరియందరితో నొక నూతనపురుషుడు కూడా వచ్చుచు బోవుచుండెను. ఈ నూతనవ్యక్తి ఎవరై యుండునను సంశయముగలిగి, యాతని విషయమై కొంతవరకు తెలుసుకొందామని దీక్షతో యొకనాడు సింహద్వారమువద్ద జాగ్రత్తగా గసిపెట్టుకొనియుండి పురాణము పూర్తియైనతోడనే అందరితో నీ నవీనవ్యక్తి కూడా బోవుచుండగా, యాతని చేయిపట్టుకొని నిలిపివేసెను. అతడు అందరు బోవువరకు మాటలాడలేదు. నిశ్శబ్దముగా నుండగా "నీ వెవరని?" ద్వారపాలకుడు ప్రశ్నించెను, "నోరుపెట్టకుము, నేను అశ్వత్థామను చిరంజీవుడను" యని బదులుచెప్పెను. ద్వారపాలకుడు ధైర్యసాహసములతో తనకే దైన విలువిద్యను ప్రసాదించుమని నట్లును, ద్రోణతనయు డొకశ్లోకమును వ్రాసియిచ్చినట్లును, ఆ మంత్ర మతిప్రభావమై యుండుట, నేపకుగిల్లాలు కసిపెట్టి యుపద్రవము సంభవించునని భీతిల్లి చించిపారవేసినట్లు యొకకథను యిప్పటికి ఆ ప్రాంతమున నుండువారు చెప్పుకొనుచుందురు. మంత్ర వివరమునకు "ఆంధ్రభూమి" సంపాదకుల నుండి నా చిరునామాకై గొని రిప్లయికార్డుగాని పోస్టుముద్రలతో ఉత్తరముగాని వ్రాసిన బడయుగలరు. ఈ వృత్తాంతము యొక శతాబ్దముక్రిందట జరిగియున్నట్లు తెలియవచ్చుచున్నది. నమ్మితే నమ్మండి. లేకపోతే మానేయండి.

—లక్ష్మీనారాయణ పాణిగ్రాహి.



"ఆంధ్రభూమి"



శ్రీయుత
శనివారపు సుబ్బారావు గారు.

"ఆంధ్రభూమి"



ఆయుర్వేదాచార్య

డాక్టర్ యం. విశ్వేశ్వర శాస్త్రిగారు,

ఎల్. ఐ. యం., హెచ్. పి. ఐ. యం.

(Courtesy of Journal of Indian Medicine.)